
ఆంధ్రపత్రిక

సచిత్ర వార పత్రిక



4 అణా

11-4-5

విషయానుక్రమణిక

11 ఏప్రిల్ 1951

ఆంధ్రపత్రిక

సంవత్సర చందా
రు. 12-0-0
విడిపత్రిక
4 అణాలు

ప్రతి బుధవారము
ప్రకటింపబడును

Founder: K. NAGESWARA RAO

సంపుటము **43**
సంచిక **30**

ఖర సంవత్సర చైత్ర శుద్ధ పంచమి బుధవారము

ఆహార విషమస్థితి ★

"రావు"

★

పార్లమెంటువల్ల ప్రయోజన మేమంటే ఏడాదికొకసారైనా ప్రభుత్వశాఖల అవకతవకలను ప్రజాప్రతినిధులు విమర్శించడం ప్రజలు తిలకించవచ్చు. దేశాన్ని ఆవరించి ఉన్న ఆహారకొరను గురించి పార్లమెంటులో చర్చ జరిగింది.

కిందటేడు ఈరోజులలో ఆహార స్వయంసమృద్ధి ఎంత దగ్గరలో ఉన్నదా అని చూసిన దేశం ఈయేడు ఎంత ఆహారం దిగుమతి అవుతుందా అని ఎదురుచూస్తున్నది! సభ్యులను ఈ విషయమై సంతృప్తి పరచడానికి కాబోలు, ఏ దేశంనుండి ఎంతెంతమొత్తంలో దిగుమతి అగుతున్నదీ, కానున్నదీ వివరించాడు.

కాని ఈ వివరాలు అధికాహారోత్పత్తి ఉద్యమం ఏమవుతున్నదీ తెలుపజాలవు. దాన్నిగురించి తెలుకోవాలంటే చర్చలో శ్రీ కళా వెంకటరావు ఇచ్చిన వివరాలు చూడాలి. 1944 నుంచి నేటివరకు మన ఆహార దిగుమతులు మూడున్నర రెట్లు పెరిగాయని కళావారు జ్ఞాపకం చేశారు. అధికాహారోత్పత్తి ఉద్యమం సాగినకొద్దీ ఆహార స్వయంసమృద్ధి సన్నగిల్లుతున్నదని స్పష్టమవుతున్నది. దీనికి కారణాలుగా జనాభివృద్ధి వగైరా కారణాలన్నిటినీ మున్షీ పేర్కొన్నారు. జనాభివృద్ధి మీదగాని, ధాన్యం పండే పొలాలను నూనెగింజల సాగుకు ఉపయోగించేవారి మీదగాని, ధాన్యం దాచి నల్లబజారులో పెట్టేవారిమీదగాని ప్రభుత్వ ఆహారశాఖకు ఎట్టి అజమాయిషీ ఉన్నట్లు కనబడదు గనక ప్రస్తుత అధికోత్పత్తివిధానం ఆహార స్వయంసమృద్ధికి దారితీయలేదని స్పష్టమవుతుంది. స్వయంసమృద్ధి గడువు 1954 మార్చి 31 దాకా వాయిదా పడిందని మున్షీ తెలియజేశారు. కాని ఈలోపుగా అది మళ్లీ వాయిదా పడదని చెప్పడానికి లేదు. ఈ విషయంలో ప్రభుత్వంవారు లోగడ వేసిన అంచనాలన్నీ తప్పుగానే పరిణమిస్తూ వచ్చాయి.

దేశంలో అందరికీ అవసరమైనంత తిండి ఉండడం ఎంతముఖ్యమో, దేశం మొత్తం మీద స్వయంసమృద్ధిఉండటం కూడా అంతే ముఖ్యం. ఈవిషయాన్ని నెహ్రూ స్పష్టంచేశారు. ఆహారంలాటి ముఖ్యావసరానికి ఇతర దేశాలపై ఆధారపడడం స్వాతంత్ర్యానికేముప్పు అని నెహ్రూ వివరించారు. ఎందుచేతనంటే ఈ క్లిష్టప్రపంచ పరిస్థితులలో ప్రతిదేశమూ తనపై ఆధారపడిన దేశాలపై ఒత్తిడి తీసుకురావడానికి యత్నిస్తుంది. అమెరికా తమ మిగులు గింజలను మనకివ్వడానికి ఎన్ని రాజకీయ మారాముల్లు పెడుతున్నదీ నెహ్రూకు తెలుసును. అర్జెంటీనాపై ఆహారంకొరకు ఆధారపడిన బ్రిటను డొక్క మాడ్చుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. అన్ని దేశాలూ తమ సహాయానికి మారాముల్లు పెట్టవనే అనుకున్నా, ఏ క్షణం యుద్ధంవచ్చినా రావచ్చు. ప్రపంచ యుద్ధాన్ని వాయిదా వేసే శక్తి మన ఆహారశాఖ చేతిలోగాని, ఆహారమంత్రిగారి చేతిలోగాని లేదు. ప్రపంచయుద్ధంవచ్చి ఆహార దిగుమతులకు అవాంతరం ఏర్పడితే మనదేశం చాలా దెబ్బతింటుంది. యుద్ధం ఆరేళ్ళలోనూ ఇతర దేశాలు సైనికులను కోల్పోయినదానికన్న బెంగాలు క్షామంలో ఇండియా ఎక్కువ ప్రాణులను కోల్పోయిన సంగతి మరవరాదు.

అధికాహారోత్పత్తికిగాను కేంద్ర ప్రభుత్వం గత సంవత్సరాలలో వెచ్చించిన 88 కోట్లలో కొంతభాగం దుర్వినియోగపడినట్లు రిజర్వుబాంకు రిపోర్టు తెలుపుతున్నది. ఈ రిపోర్టు 1947 వివరాలకు సంబంధించినదనీ, బొంబాయిలోని 5 తాలూకాలకు మాత్రమే వర్తించేదనీ మున్షీ వాదం. కాని రిజర్వుబాంకువారు ప్రభుత్వాన్ని అపఖ్యాతిపాలు చేయడానికై ఈ అయిదు తాలూకాలను ఎన్నుకొనిఉండరు. ఇతర ప్రాంతాల ఇంకా ఘోరపరిస్థితులుండవచ్చును. దేశమంతటాగల పరిస్థితిని బట్టీ, అధికాహారోత్పత్తి ఫలితాలనుబట్టీ చూస్తే ఈ ఉద్యమం సఫలమవుతున్న జాడలు కానరావు.

కళా వెంకటరావు చెప్పినట్లు అధికాహారోత్పత్తి నిజంగా జరగాలంటే భూమి దున్నేవాడిపరం కావాలి. వాడి సౌకర్యాలు మనసులో ఉంచుకుని ప్రభుత్వం ప్రణాళికలు తయారుచెయ్యాలి. ఒకవంక సాగుభూమి బీడుపడిపోతూంటే – ఇది మున్షీ వివరించిన విషయమే – ఇంకోవంక బీడును సాగులోకి తీసుకురావడానికి కోట్లు కుమ్మరించి, అందులో అధికభాగం అన్యాక్రాంతం కానివ్వడం దండుగమారిపని. ఆహారం మొట్టమొదటి రాజకీయాయుధమని కొంతి రామమూర్తిగారు ఏనాడో అన్నారు. ఆహారాన్ని ఆవిధంగా ప్రభుత్వం ఉపయోగిస్తున్నదని శ్యామాప్రసాద ముఖర్జీ

మొదలైనవారు విమర్శించవలసి రావడం ప్రభుత్వం ఖ్యాతికీ, దేశశ్రేయస్సుకూ క్షేమం కాదు.

కాంగ్రెసు ఐక్యత

ప్రతి రాజకీయపార్టీకూడా తన సభ్యుల నుంచి కొంత క్రమశిక్షణ ఆశిస్తుంది. ఆశించడం ధర్మం. పార్టీ సభ్యులై ఉండి ప్రతిపక్షులాగా ప్రవర్తించే సభ్యులు పార్టీ ఐక్యతకు చాలా భంగం కలిగిస్తారు. అట్టి సభ్యులను సహించినట్లయితే పార్టీ పతనమవుతుంది.

అయితే పార్టీ సభ్యులు అవలంబించదగిన క్రమశిక్షణకు ఒక పరిమితి అంటూ ఉంటుంది. ఉండడం స్వాభావికం. ఈ పరిమితి ఏమిటన్నది ఎప్పటికప్పుడు నిర్వచించని పక్షాన పార్టీ సభ్యులు తమ సర్వస్వాతంత్ర్యాలకూ తిలోదకా లిచ్చుకోవలసిరావచ్చు. పార్టీ పెద్దలు నిర్ణయించిన అభ్యర్థులతో పోటీ చెయ్యడమే పార్టీ క్రమశిక్షణకు విఘాతంగా భావించబడవచ్చు. రేపు జరగబోయే రాష్ట్రకాంగ్రెసు అధ్యక్ష ఎన్నికలలో పోటీ చేసేవారిలో ఎవరినైనా మానమని పార్టీ నాయకులు ఆదేశించడం మాటవరసకు జరిగితే ఇక ఎన్నికలే జరగనవసరం లేదు! పార్టీ క్రమశిక్షణ దుర్వినియోగంఅయే విధానంలోనే పార్టీ ప్రజాస్వామ్యాన్ని కోల్పోయి ఫాసిజం అవలంబిస్తుంది. ప్రతిపార్టీ కూడా తన సభ్యులపట్ల ఫాసిజం అవలంబించడం ప్రారంభిస్తే దేశంలోని రాజకీయ పాదులకు ముందుగా ప్రజాస్వామిక హక్కులు పోవడం జరుగుతుంది.

కాంగ్రెసుపార్టీ ఐక్యతను రక్షించడానికిగాను వర్కింగుకమిటీ చేసిన తీర్మానం పార్టీ సభ్యుల ప్రజాస్వామిక హక్కుల నెంతవరకు రక్షిస్తున్నదీ అగ్రనాయకులు చూడాలి. కాంగ్రెసుపార్టీ అధికారంలో ఉన్న పార్టీ. 'దేశీయరంగంలో ఆ పార్టీకి చాలా బాధ్యతలున్నాయి. ఆ బాధ్యతలను కాంగ్రెసుపార్టీ తన సభ్యుల సహకారం లేకుండా నిర్వర్తించజాలదు. ఏ కాంగ్రెసు సభ్యుడుగాని తనకు పార్టీపట్ల ఉన్న బాధ్యతలకు ప్రజలపట్లా, దేశక్షేమం పట్లా ఉన్న బాధ్యతలు ఎంతవరకు అడ్డు వస్తాయో చూసుకునే అవకాశం ఉండాలి. లేకపోతే కాంగ్రెసు సభ్యులు పార్టీకోసం దేశాన్నీ, అంతరాత్మలనూ అమ్ముకున్నవారవుతారు. అటువంటిపనిచేయడం కొత్తగా అధికారంకొరకు, పార్టీలో ప్రవేశించిన వారికి సాధ్యంకావచ్చుగాక చిరకాలం మహాత్ముణ్ణి అనుసరించిన వారికి అది సాధ్యంకాదేమో.

కాశ్మీర్

★

కాశ్మీరం, కాశ్మీరం!
భారతఖండ మూర్ధోపరి
కాంచనమణి కోటీరం,
కాశ్మీరం, కాశ్మీరం!

అరుణారుణ కుంకుమసుమ
నందనవన సుందరతర
కాశ్మీరం, కాశ్మీరం!

ముష్కర సామ్రాజ్యవాద
మహావ్యాళ విషోద్గార
దంష్ట్రాపరి దష్టం మన
కాశ్మీరం, కాశ్మీరం!

2

అత్యున్నత కాశ్మీర గిరిశృంగాలు
ఆర్టిలరీస్థావరాల కనువైనరంగాలు.
భౌగోళికంగా కాశ్మీరదేశం
బలే కీలకమైన ప్రదేశం.

అందుకే కాశ్మీర్ జనవాక్యనిర్ధారణ
ఐక్యరాజ్యాల సైనికాధ్వర్యాన
జరిపించాలని ఆంగ్లో అమెరికన్లు
పొదుగుతున్నారు ప్లానుపైప్లాను.

మండలిలో తర్జనభర్జనలూ,
సర్ గ్లాడ్విన్ జెబ్ గర్జనలూ,
కాశ్మీరపుదొడ్డి వేపుతలుపులు
తెరవండని గద్దింపు పిలుపులు.

నిజానికి ఐక్యరాజ్యసమితి
ప్రపంచరాజకీయాల ఘోరమితి.
అగ్రరాజ్యాలు చేసే తీర్మానాలు
అల్ప రాజ్యాలకు మాత్రమే ఫర్మానాలు

—సవ్యసాచి—

కాంగ్రెసు ప్రభుత్వాలలో అవినీతీ, అసమర్థతా బలిశాయని కాంగ్రెసు అగ్రనాయకులే ఒప్పుకుంటున్నారు. కాంగ్రెసు ప్రభుత్వాలు దేశంపట్ల తమ బాధ్యతను నిర్వర్తించలేకుండా ఉన్నారని దేశపరిస్థితే ఎలుగెత్తి ఘోషిస్తోంది. ఇందుకై ప్రభుత్వ వర్గాలను విమర్శించడానికి ప్రయత్నిస్తున్నవారున్నారు. వీరంతా పదవులకు దేవులాడే వారేకావచ్చు కాని వారి విమర్శ సక్రమమైతే అనుసరణీయమైనదికూడా అవుతుంది. ప్రభుత్వాన్ని విమర్శించిన వారంతా క్రమశిక్షణకు విరుద్ధంగా ప్రవర్తించిన వారేననడం కాంగ్రెసు ఐక్యతకు గాక, కాంగ్రెస్ విచ్ఛిత్తికే దారితీస్తుందని గుర్తించాలి. ఎందుకంటే కాంగ్రెసును తీవ్రంగా విమర్శించే హక్కు కాంగ్రెసేతరులు మాత్రమే వినియోగించటమూ, అటువంటి విమర్శలను ప్రజలు ఆలకించేవైఖరిలో ఉండటమూ, మూలాన కాంగ్రెసుసభ్యులంతా ప్రజలకు విరోధులన్న భావమూ, కాంగ్రెసేతరులంతా ప్రజాహితులన్న భావమూ ఏర్పడడానికి ఇట్టిక్రమ శిక్షణబాగా తోడ్పడుతుంది.


కాంగ్రెసు అధికార వర్గీయులతో కలహించి వేరే కక్షలు కట్టేవారిపై క్రమశిక్షణచర్యలు తీసుకోవడం గాని, తీసుకునే వైఖరి అవలంబించడం గాని నిరుపయోగం. అసలు మూలకారణం ఏమిటో, కాంగ్రెసులోఉన్న లోప మేమిటో, అది ఎట్లా సంస్కరించాలో చూడాలి గాని, క్రమశిక్షణపేరిటా, ఐక్యతపేరిటా, అధికారాలిచ్చి నోళ్లున్న వారిని కట్టుకున్నంత మాత్రంచేత, "విమర్శకులను" దువ్వడానికి రహస్య రాయబారాలు జరిపినమాత్రం ఆ చే పార్టీకి లేని బలం ఎన్నడూ చేకూరదు.

ఈ సందర్భంలో ఇటీవల బ్రిటనులో చెలరేగిన కల్లోలం ఒకటి స్మరించదగినది. లేబరు పక్షంలో ప్రచారాధికారాలు సాగించే ప్రొఫెసర్ జి. డి. ఎచ్ కోల్, చైనాపై యుద్ధానికి బ్రిటిషు లేబరుప్రభుత్వం సమ్మతించే ఎడల ఆ యుద్ధాన్ని బలపరచవలసినదిగా బ్రిటిషు కార్మికులను తాను కోరనన్నాడు. దానిపై ఎవరో కోల్‌ను, "నువ్వు దేశద్రోహం చేస్తావా?" అని ప్రశ్నించారు. తన ప్రభుత్వం అక్రమమైన పని చేస్తున్నదని తన అంతరాత్మ చెప్పినప్పుడు ఆ ప్రభుత్వాన్ని ఎదిరించడం తన ధర్మమని కోల్ అన్నాడు.

ఒక పార్టీ ప్రభుత్వం సాగిస్తూ, క్లిష్టపరిస్థితులలో ప్రజాక్షేమాన్ని సరిగా పాటించలేని స్థితిలో ఉన్నప్పుడు, ఆ పార్టీకి చెందిన సభ్యులు, పదవీ వ్యామోహంతో బాధపడనప్పుడుకూడా అనేక నైతిక, ఆధ్యాత్మిక సంఘర్షణలకు గురిఅయి పార్టీ క్రమశిక్షణను వాటితో సమన్వయించవలసిన వారవుతారు. అట్టి సంఘర్షణలలో తమ సభ్యులు నైతిక ఆధ్యాత్మిక విజయం సాధించాలని పాశ్చాత్య రాజకీయపక్షాలు చూడకపోవచ్చు. ఎందుకంటే పాశ్చాత్య దేశాలలో రాజకీయవేత్తలు ప్రజల సద్భావాలనుతప్ప మరే నైతికదృష్టినీ పాటించరు. కాంగ్రెసు పార్టీ రాజకీయాలలో కూడా నీతిని విడవరాదని కంకణం కట్టుకున్న పార్టీ. ఈ పార్టీ ప్రజాభిప్రాయాలను పాటించడం ఇంకా నేర్చుకోలేదు. (మున్షీని వెళ్లగొట్టమని చాలా పత్రికలు ఘోషించాయి. ఈ సూచనను కాంగ్రెసు అగ్రనాయకులు పరిశీలించనైనా లేదు.) అటువంటప్పుడు కాంగ్రెసు తన సభ్యుల నైతిక విశ్వాసాలనైనా పాటించకపోతే ఆ సభ్యులపట్ల బాధ్యతలేకుండా ప్రవర్తించినదవుతుంది.

వర్కింగుకమిటీ ఇప్పుడు చేసిన తీర్మానం ఎదురు తిరిగిన సభ్యులపై శిక్షణ చర్యగైకొనడానికి చేయబడ్డది కాదని తెలుస్తున్నది. అటువంటి తీర్మానంవల్ల మరింత హాని ఉంటుందేమో. ఏమంటే ఈ తీర్మానం కృపలానీ, కిద్వాయ్, ఘోష్, ప్రకాశం వగైరాలను కాంగ్రెసు వర్గాల దృష్టిలో తక్కువ చేయడానికి మాత్రమే ఉపయోగిస్తుందిగాని పార్టీ గౌరవాన్ని పెంచడానికి ఉపకరించదు. అయినా కాంగ్రెసు అగ్రనాయకులు ఇటువంటి తీర్మానం చెయ్యడం వల్ల రాగల ఎన్నికలలో తమకు లాభం ఉంటుందనే విశ్వాసంతోనే ఈ పనిచేశారనుకోవాలి. అదేనిజమైతే ఆవిశ్వాసం అనుమానాస్పదమైనది. అంతకంటె, కాంగ్రెసు అగ్రనాయకులు పేరుమోసిన అసమర్థులనూ, అవినీతిపరులనూ ప్రభుత్వవర్గాలనుండి తొలగించి ప్రజాదరణా, ఉదారవర్తనా కలవారిని, ఇతరపార్టీలవారినైనాసరే, ఎన్నికలలో బలపరిస్తే రాష్ట్రాలలోనూ, కేంద్రంలోనూ బలమైన సంకీర్ణ ప్రభుత్వాలు ఏర్పడేఅవకాశం ఉన్నది. ప్రస్తుత ప్రపంచ వాతావరణాన్నిబట్టి అట్టి సంకీర్ణప్రభుత్వాలు ప్రజలను ఎక్కువ సంతుష్టిపరచగలవు. రేపు ఎన్నికలలో ఇతరపార్టీ అభ్యర్థులకు ప్రజాదరణలేని కాంగ్రెసు సభ్యులను నిలబెట్టవలసివస్తే అపజయం కలిగినా, కాంగ్రెసుపై ప్రజలకున్న అభిప్రాయం మరింతపాడైనా కూడా కాంగ్రెసుకే దెబ్బ. దేశక్షేమం కోసం కాంగ్రెసు ఏ పార్టీతోనైనా కలసి పనిచేస్తుందన్న విశ్వాసం ప్రజలకు కలిగించడం కాంగ్రెసుకు మంచిదిగాని, కాంగ్రెసులో కుళ్లున్నదన్న వారినల్లా కాంగ్రెసులోని కుళ్లుగా ప్రకటించదానికి ప్రయత్నించడం పార్టీకిక్షేమంకాదు.

★





ఆ వీధిలోకి ఒక కొత్త సంసారం వొచ్చింది. ఏమంత పెద్దకుటుంబం కాదు. ఒక అత్త మొగుడు, పెళ్ళాం, ఒక కుక్క – అంతే! పక్కింటి పుల్లమ్మత్త, పొరిగింటి గైరమ్మొదిన, దొడేపు మంగమ్మప్ప కొత్తగా వచ్చినవాళ్ళకి స్వాగతం చెప్పారు. కాని ఈ వచ్చిన కొత్తకుక్కని చూసి ఆ వీధి కుక్కలు ఒక్కటిగూడ ఆహ్వానించలేదు సరిగదా, మంచీచెడ్డా లేకండా ఒకటే మొరగడం!

సామానంతా యింట్లో సర్దేసుకొన్న తర్వాత అరుగుమీద తీరుబడిగా అత్తా కోడలు కూచొని పేలు నొక్కుకొంటున్నారు. పుల్లమ్మత్త నవ్వుకొంటూ వాళ్ళ పక్కకివచ్చి కూచొంది.

"మా కోడలు పేరేవిఁటో?" అని ప్రశ్నించింది.

"సుగుణమ్మ" అని అత్త తన కోడలు పేరుని గర్వంగా చెప్పుకొంది.

అంతలో మంగమ్మప్ప కొస్త జునుబాలు తెచ్చి, పేలు నొక్కుతున్న సుగుణకి యిచ్చింది.

సుగుణ ఆ జునుబాలని గభక్కున లేచి అందుకోలేదు. తల కొస్త పక్కకి తిప్పి గలాసులో పాలకేసి గడియసేపు చూసి, మంగమ్మప్పకేసి చిరునవ్వునవ్వుతు, ఏవిఁటిదంతా అన్నట్టు చూసింది.

"జునుబాలు చెల్లెమ్మ. మీ కోసం, మరిదిగారికోసం తెచ్చాను. ప్రొద్దుట మీరు రాకముందు మా ఆవీనింది. పొద్దుటపాలు కుడితిలో పారబోసి, తర్వాత పిండినపాలు కనకమ్మపిన్నికి, పాపయ్యొదినకి, గైరమ్మత్తకి, మునసబుగారికి కొసిని కొసిని చొప్పున యిచ్చి యివి మీకు తెచ్చాను" అంది. ఆ గలాసు ఆ పక్కనపెట్టి, గోడకి చారబడింది.


పుల్లమ్మత్త ముఖంలో అప్పుడే కొస్త ఈర్ష్య మెదిలింది. తనకంటె మంగ వాళ్ళ దగ్గర మంచయిపోతోందని. తనుగూడ మంగకంటె ముందుగా ఏదైనా యినాం తెచ్చి ఉన్నట్టయితే వాళ్ళ స్నేహం తను దానికంటె ముందుగా సంపాయించి వుండేది. పోనీ యిప్పటికయినా ముంచుకపోయిందేవీఁ లేదు. తన చిన్న బుల్లోణ్ణి ఎత్తుకుని వచ్చిందా, సుగుణకి పిల్లలు ఎలానూ లేరు గాబట్టి యిక వాణ్ణి వొదలదు. వాడూ బొజ్జిగా, అందంగా వుండటంవల్ల, వాణ్ణి చూడగానే గభక్కున ఎత్తుకుంటుంది. అలా తనే మంగమ్మకంటె వాళ్ళకి దగ్గరయి పోతుంది. ఈ భావం మదిలో మెదలగానే, పుల్లమ్మ లేచి చంటాడు లేచి ఏడుస్తుంటాడు, వాణ్ణి తీసుకొస్తానంటూ లేచింది. ఆ మాట అంటూనే సుగుణని సూక్ష్మంగా కనిపెట్టింది. సుగుణ నవ్వుతూ తలెత్తి చూడగానే, తన పాచిక పారుతుందని గబగబావెళ్ళిపోయింది.

"జునుబాల్లో బెల్లం కంటె పంచదా కోసుకొంటే ఇక ఆ రుచి దాండే ... ఏమమ్మ చెల్లెమ్మ ఇంతవరకూ మరిదిగారి పేరే చెప్పలేదు. ఏం పేరో చెబితే కొరుక్కుతినేస్తావాఁ?" అంటూ సుగుణ చేతిలోని పైనని లాక్కొని, అత్త తలని దువ్వడం మొదలు పెట్టింది మంగమ్మ. సుగుణ భర్త పేరు చెప్పలేక సిగ్గుగా తలొంచుకొంది.

"చెప్పు సుగుణా సిగ్గెందుకు? పెళ్ళయి ఏ పదేళ్ళో అయింది. ఇంకా వాడిపేరు చెప్పడానికే సిగ్గయితే ఎలా?" అంది అత్త.

"పిల్లలు లేరు గాబట్టి యింకా మా చెల్లెలు కొత్తపెళ్లి కూతురే నత్తా" అంటూ ఒక పేని తీసి రెండు బొటన వేళ్ళమధ్య పెట్టి 'స్' అని నొక్కింది.

బయట కుక్కలన్నీ సమయాసమయాలు తెలుసుకోకండా ఊరికే అరుస్తున్నాయి. కొన్ని సుగుణ కుక్కని చూసి చాతగాక ఏడుస్తున్నాయి గూడ. అసలా వీధికి కొత్త కుక్క రాగానే 'బొంయ్'మని అరిచాయి. ధైర్యం చాలక దూరం నించే మొరిగాయి. ఇప్పుడు గూడ స్థంభానికి కట్టిన కుక్కని



చూసి చేతగాని అరుపులు అరుస్తున్నాయి. ఆ వీధి కుక్కలన్నీ.

"అబ్బబ్బ! ఈ వీధి కుక్కలకి కొంత్త గూడ బుద్ధిలేదు. కొత్తకుక్క వస్తే అదే మొరగడం. మళ్లా ఎవరయినా నిజంగా దొంగలుపడితే అసలు కిక్కు మెక్కు మనవ్. దొంగచాటుగా యిళ్లల్లోకి చొరబడి అన్నాలు బుక్కేస్తాయి. ఛీ, ఛీ" అంటూ గైరమ్మొదిన వచ్చింది.

సుగుణ ఆ గ్రామీణుల చొరవకి, స్నేహానికి, ప్రేమకి ఎంతో ముచ్చటపడింది. అలా కలసిమెలసి ఒకచోట సరదాగా కబుర్లాడుకొనే జీవితంవుంటే ఎంత హాయిగా వుంటుంది!

"ఏమిటండీ?" అని ప్రశ్నించింది సుగుణ గైరమ్మొదిన్ని.

చంకలోని చంటాణ్ణిదింపి గైరమ్మొదిన సుగుణ పక్కకి వచ్చింది: "ఈ వీధి కుక్కలమ్మ. ఛీ ఛీ, ఊరకుక్కలే అన్నీ, ఒక్కటిగూడ జాతికుక్క లేదు. మన కుక్కనిచూసి ఒకటే మొరగడం. మీ కుక్క అసలు వాటి మొరుగుల్ని లెఖ్ఖచేయకుండా దర్జాగా రాజాలా కూచొనివుంది."

"కొత్తకదూ, అలానే పోట్లాడుకొంటాయి. అలవాటయితే అవే కలుసుకొంటాయి" అంది అత్త.

అంతలో పుల్లమ్మత్త కొడుకు నెత్తుకొని వచ్చింది. ఇంటికెళ్లి పడుకొన్న వాడిని బలవంతాన లేపుకొచ్చింది. పిల్లాడు చూడ్డానికి అందంగానే వున్నాడు. కాని తన కొడుకు కంటే ముందుగా, గైరమ్మ తీసుకొచ్చిన బూచిగాడు సుగుణ ఒళ్ళోకి, ముద్దుల్లోకి వెళ్లిపోయాడు. ,వాడేం అందంగా వుంటాడు, చీవిండిముక్కువాడూ. తన కొడుకుని చూసిందంటే సుగుణ గైరమ్మ కొడుకుని వొదిలేస్తుంది—అనుకొంటూ పుల్లమ్మ తన కొడుకుని తీసుకొచ్చి సుగుణకి అగుపించేలా ముందుకి తోసింది.

సుగుణ, పుల్లమ్మ కొడుకుని చూడగానే బూచిగాణ్ణి అవలికి నెట్టెయ్యలేదు. ఇద్దర్నీ

(46-వ పేజీ చూడండి)

★ డైరీ ★

సోమవారం, ఏప్రిల్ 2:

—నౌకా నిర్మాణ పరిశ్రమను జాతీయం చేస్తే తమకు అభ్యంతరం లేదని సిండియా కంపెనీ జనరల్ మేనేజర్ ఎన్. దండేకర్ చెప్పాడు.

—మద్రాసు హార్బరును దక్షిణంగా విస్తరింపజేయడానికై కూవం నదికి ఉత్తరంగా ఉన్న సముద్రతీరం కేంద్రప్రభుత్వ పరం జేయ సంకల్పం జరిగిందని మంత్రి భక్తవత్సలం రాష్ట్ర శాసనసభలో తెలిపాడు.

—ఇండియా ప్రధాని నెహ్రూ కాశ్మీరులో మాట్లాడుతూ, భద్రతామండలిలో కాశ్మీరు గురించి ఆంగ్లో అమెరికన్ తీర్మానాన్ని ఇండియా ప్రతిఘటిస్తుందనీ, దాని ఫలితాలను ఎదుర్కొంటుందనీ ఉద్ఘాటించాడు.

—పాకిస్తాను ప్రభుత్వం ఆంగ్లో అమెరికన్ తీర్మానాన్ని పూర్తిగా ఆమోదించినట్లు భద్రతామండలికి పాకిస్తాను విదేశాంగ మంత్రి జఫ్రుల్లాఖాన్ తెలిపాడు.

—నదీలోయ ప్రాజెక్టుల నిర్మాణానికిగాను కేంద్రం నుండి వివిధరాష్ట్రాలకు ఇప్పటివరకు 49 కోట్ల 67 లక్షలు ఋణమివ్వబడినట్లు ఆర్థికమంత్రి దేశముఖ్ పార్లమెంటులో తెలిపాడు.

—బొంబాయిమంత్రి మొరార్జీదేశాయి బొంబాయిలో కొత్త సిమెంటు ఫాక్టరీకి ప్రారంభోత్సవం చేశాడు. అతి నవీనమైన ఈ ఫాక్టరీ ఏటా 2 లక్షల టన్నుల సిమెంటు ఉత్పత్తి చేస్తుంది.

—బ్రిటను రష్యాతో సఖ్యం చెయ్యడానికి సిద్ధంగా వున్నదని నూతన బ్రిటిషు విదేశాంగమంత్రి హెర్బర్టు మోరిజన్ చెప్పాడు.

—గత రాత్రి అర్ధరాత్రి గడిచిన ఒక నిమిషానికి పారిస్‌లో జనరల్ ఐసెన్‌హోవర్ అట్లాంటిక్ బలాలకు అధిపతిగా పారిస్‌లో పని ప్రారంభించాడు.

—1952 ఏప్రిల్‌తో మార్షల్ సహాయం కట్టిపెట్టవద్దని కాంగ్రెస్‌ను కోరుతానని ట్రూమన్ మార్షల్ సహాయ తృతీయవార్షికోత్సవ సందర్భాన ప్రకటించాడు.

—నేడు పాకిస్తాను బ్రిటనులమధ్య కొత్త వర్తక ఒడంబడిక పై సంతకాలు జరిగాయి. బ్రిటను కుండిన కొన్ని సౌకర్యాలు ఇందులో రద్దయిపోయాయి.

మంగళవారం, ఏప్రిల్ 3:

—సంస్థానాధీశుల యూనియనును భారతప్రభుత్వం పరిగణించదని సంస్థాన శాఖా మంత్రి, ఎన్. గోపాలస్వామి అయ్యంగారు పార్లమెంటులో తెలిపాడు.

—పరిశ్రమలమంత్రి మెహతాబ్ పార్లమెంటులో ఈ వివరాలు తెలిపాడు: భారతీయ నేత పరిశ్రమలో పెట్టుబడి చేసిన విదేశం బ్రిటను ఒకటే; ఈ పరిశ్రమలోని విదేశీ పెట్టుబడి 9 న్నర కోట్ల రూపాయలు. భారత స్వాతంత్ర్యం అనంతరం విదేశీ పెట్టుబడితోగూడిన పరిశ్రమలు 88 ఆమోదించబడ్డాయి. 5 నిరాకరించబడ్డాయి. అన్నిటిలోనూ హెచ్చువాటాలూ, నిర్వహణా భారతీయులవే.

—ఇండియా ప్రధాని నెహ్రూ జమ్మూలో ప్రసంగిస్తూ, కాశ్మీరుప్రజలు తమ రక్షణార్థం కోరినంత కాలమూ భారతీయ సైన్యాలు సంస్థానంలో ఉండగలవని అభయం ఇచ్చాడు.

—ఏప్రిల్ మాసంలో మద్రాసు రాష్ట్రానికి లభించే ఆహార మొత్తం 33 వేల టన్నుల నుంచి 41 వేల టన్నులకు హెచ్చింపబడిందని రాష్ట్ర ఆహారమంత్రి రోచ్‌విక్టోరియా రాష్ట్ర శాసనసభలో తెలిపాడు.

—బ్రిటిషుప్రజలు శాంతి కోరినట్లయితే యుద్ధప్రయత్నాలు ఆమోదించాలనీ, యుద్ధప్రయత్నాలు కావాలంటే అధిక ధరలూ, వాడుకవస్తువుల లేమీ సహించాలనీ బ్రిటిషు ఆర్థికమంత్రి గేట్‌స్కెల్ అన్నాడు.

—కొరియాలో పురోగమించే ఐక్యరాజ్యసేనల దారిలో కమ్యూనిస్టులు 63 డివిజన్ల సేనలను అడ్డం ఉంచారని జనరల్ మకార్థర్ హెచ్చరించాడు.

—టెక్స్‌టయిల్ అభివృద్ధి సంఘ సభ్యులు ప్లానింగ్ కమిషన్ సభ్యులను కలుసుకొని నేత పరిశ్రమయొక్క అభివృద్ధిని గురించీ, నేతమిల్లులకు తగినంత ప్రత్తిని అందించడం గురించీ చర్చించారు.

—యు. పి. సరిహద్దున పశ్చిమ నేపాలులో గల అరాజకాన్ని అరికట్టడం గురించి నేపాలు ఆహార వ్యవసాయ శాఖామంత్రి భారతమణిశర్మ యు. పి. ప్రధానితోనూ, హోం శాఖామంత్రితోనూ సంప్రతింపులు ముగించాడు. ఉభయదేశ సేనలు సమష్టి చర్యలు జరిపి అరాజకాన్ని తుదముట్టించాలని నిర్ణయం జరిగింది.

—ఇండియాకు ఆహారం బహూకరించడానికి షరతులు పెట్టినట్లయితే ఇండియా ద్వేషం శాశ్వతంగా లభించవచ్చునని అమెరికా విదేశాంగ శాఖ కాంగ్రెస్‌కు తెలియజేసింది.

—నేపాల్‌లో కొత్తగా రేడియో కేంద్రం ఏర్పాటయింది.

—ఇటలీ ప్రభుత్వం తన విదేశాంగ విధానాన్ని మార్చుకొని సామ్రాజ్యవాదుల యుద్ధయత్నాలకు దూరమైతే 25 లక్షల మంది కమ్యూనిస్టులు ప్రభుత్వాన్ని బలపరుస్తారని ఇటలీ కమ్యూనిస్టు నాయకుడు పామిరో టోగ్లియాటీ ప్రకటించాడు.

—గాలిలీ సముద్రందగ్గిర ఇస్రేల్ ప్రాంతంలో ఇస్రేల్ పోలీసులకూ, సిరియన్ సైనికులకూ సంఘర్షణ జరిగింది. ఏడుగురు యూదు పోలీసులు చనిపోయినారు.

బుధవారం, ఏప్రిల్ 4:

—ఐక్యరాజ్య సర్వప్రతినిధి సభా తీర్మానాన్ని పురస్కరించుకొని దక్షిణాఫ్రికా భారతీయులను గురించి రౌండ్‌టేబిల్ సమావేశానికి ఆహ్వానించగా దక్షిణాఫ్రికా నిరాకరించినట్లు ఇండియా ఐక్యరాజ్య సమితికి తెలిపింది.

—రోమ్‌లోని డిగాస్పెరీ సంకీర్ణ ప్రభుత్వంనుండి ముగ్గురు సోషల్ డెమోక్రాట్ మంత్రులూ, నలుగురు ఉపకార్యదర్శులూ రాజీనామా చెయ్యడంచేత ప్రభుత్వంలో ప్రతిష్టంభన ఏర్పడింది.

—ఆహార కంట్రోలు చట్టం అక్రమమని అనేకమంది కలకత్తా హైకోర్టులో దరఖాస్తులు దాఖలు చేశారు.

—ఇండో చైనాలోని మృత భారతీయుల ఆస్తులను ఇండియాకు బదిలీ చేయడానికి ఫ్రెంచి అధికారులు సమ్మతించారు.

—12 ఏళ్ళలో 2 కోట్ల డాలర్ల ఖర్చుతో ఉపాధ్యాయులను తర్ఫీదు చేసి వారి ద్వారా వెనుకబడిన ప్రాంతాలలో నిరక్షరత రూపుమాపడానికి తయారుచేసిన పథకాన్ని ఐక్యరాజ్య విద్యా సంస్కృతీమండలి డైరెక్టరు జనరలు లండనులో వివరించాడు.

—టిబెట్ సమస్య సంప్రతింపుల ద్వారా పరిష్కరించబడిందనీ, దలాయ్ లామాలాసాకు తిరిగి రావడానికి అనుమతించబడ్డాడనీ ఆస్ట్రియాపత్రిక ఒకటి ప్రకటించింది.

—గత రాత్రి మాస్కోలో స్టాలిన్, మావోసేటంగ్ కలుసుకొని కొరియాయుద్ధం గురించి చర్చించినట్లు పారిస్‌నుంచి వార్తలు వచ్చాయి.

—ముగ్గురు బీహారు శాసనసభ్యులు తమ పదవులకు రాజీనామా ఇచ్చారని స్థానిక

శాసన సభాధ్యక్షుడు ప్రకటించాడు.

కారణం: కాంగ్రెసుకీర్తి కోల్పోయిందని లోకసేవక సంఘం నిర్ణయించింది.

—కొరియా శాంతికోరకు మరల ప్రయత్నించడానికై బి. ఎన్. రావు, 12 ఆసియా అరబ్ రాజ్యాల ప్రతినిధులను సమావేశం కమ్మని కబురు పంపాడు.

గురువారం, ఏప్రిల్ 5:

—మంచూరియాలో కేంద్రీకరించబడిన బలాలలో కొన్ని చైనావి కాక ఇతర దేశాలకు చెందినవని అమెరికన్ ప్రతినిధుల సభలో అధ్యక్షుడు రేబర్న్ చెప్పాడు.

—మద్రాసు రాష్ట్రంకొరకు 12 లక్షల రూపాయల విలువగల నూలును బ్రిటను నుండి ఇండియా ప్రభుత్వం దిగుమతి చేస్తుందని తెలిసింది.

—తనకూ సిరియాకూ గల తగాదా అత్యవసరమైనదిగా పరిగణించమని ఇజ్రేల్ ప్రభుత్వం భద్రతామండలిని కోరింది.

—పైనెలనుంచీ వస్త్రాల ధరలూ నూలు ధరలూ నూటికి 3 లగాయతు 35 దాకా పెంచడానికి నిర్ణయించినట్లు భారత ప్రభుత్వం ప్రకటించింది.

—మద్రాసు డిటెన్యూ మోహన కుమారమంగళాన్ని వదిలిపెట్టమని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది.

—మద్రాసు శాసనసభవారు ఎస్టేట్ల రద్దు చట్టాన్ని ఆమోదించారు.

—పశ్చిమ రక్షణ పథకాలలో ఈజిప్టు చేరదని ఈజిప్టు విదేశాంగమంత్రి చెప్పాడు.

—ఇజ్రేల్ విమానాలు ప్రతీకారచర్యగా సిరియా బలాలపై బాంబులు వేశాయి.

—మరి నాలుగు అమెరికన్ డివిజన్లను యూరప్‌కు పంపడానికి అమెరికన్ సెనేట్ సమ్మతించింది.

—కూచ్ బిహార్ మహారాజా సోదరుడు ఇంద్రజితేంద్ర నారాయణ్, డార్జిలింగులోని రాజభవనానికి నిప్పు అంటుకోగా, అందులో కాలి దుర్మరణం పొందాడు.

—అమెరికన్ సేనలు కొన్ని ఉత్తర కొరియా ప్రవేశించాయి.

—13 ఆసియా అరబ్బు దేశాల ప్రతినిధులు బి. యన్. రావు విడిదిలో సమావేశమై దూరప్రాచ్య సమస్యలు చర్చించారు.

శుక్రవారం, ఏప్రిల్ 6:

—అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ కూతురితోజాలపాటు మద్రాసుకు వచ్చాడు. సాయంకాలం కార్పొరేషన్ స్టేడియంలో మేయర్ మొదలైన పెద్దలు ఆయనకు పౌరసన్మానం చేశారు.

—బీహారు ఒరిస్సా రాష్ట్రాలతో తమను చేర్చడం అక్రమమని మాజీ ఒరిస్సా సంస్థానాలు వేసిన దావాను కొట్టివేస్తూ సుప్రీంకోర్టు తీర్పు యిచ్చింది.

—అధికాహారోత్పత్తి కార్యక్రమం 1954 మార్చి 31 దాకా సాగించబడుతుందని కేంద్ర ఆహారమంత్రి మున్షీ పార్లమెంటు సభ్యులకు సర్క్యులరు పంపాడు.

—ఆహారం మొదలైన అవసరాలకు ఇతర దేశాలపై ఆధారపడుతూ పోవడం ప్రమాదకరమని న్యూఢిల్లీలో భారతప్రధాని ఉద్ఘాటించాడు.

—కమ్యూనిస్టులనుంచి శాంతిసూచనలు లేని కారణంచేత కొరియాయుద్ధం కొనసాగించడం తప్ప గత్యంతరం లేదని ఐక్యరాజ్య ప్రధాన కార్యదర్శి ట్రిగ్వీ లీ చెప్పాడు.

—మలాన్ జాతితత్వాన్ని నిరసించుతూ మహాత్మాగాంధీ కుమారుడు మణిలాల్ గాంధీ డర్బానులో రెండువారాల నిరశనవ్రతం ఆరంభించాడు.

—కొరియాలో ఐక్యరాజ్య బలాలకు సర్వసేనానిగా జనరల్ మకార్థర్‌పై అవిశ్వాసం తెలుపుతూ బ్రిటిషు కామన్సులో కొందరు లేబరుసభ్యులు ప్రతిపాదన తెచ్చారు.

—సిమెంటు కంట్రోలు తొలగదని భారత పార్లమెంటులో పరిశ్రమల మంత్రి మహతాబ్ తెలిపాడు.

—టిటో ఫెడరల్ ప్రభుత్వంలోని 11 మంది మంత్రులను బర్తరఫ్ చేసినట్లు ప్రకటన జరిగింది.

—సిరియాపై ఇజ్రేల్ అతిక్రమణ చెయ్యకుండా అగ్రరాజ్యత్రయం చూడకపోతే అరబ్ రాజ్యాలు చర్య తీసుకొనగలవని ఈజిప్టు హెచ్చరించింది.

—జపాను శాంతిసంధి నిమిత్తం తాను తయారు చేసిన ముసాయిదాపై రష్యా సంతకం చెయ్యకపోతే, రష్యాకు క్యూరైల్, సఖాలిన్ దీవులను దత్తంచేసే యాల్టా ఒప్పందం ఉల్లంఘించబడుతుందని అమెరికా రష్యాను హెచ్చరించినట్లు తెలిసింది.

—అఖిల అమెరికా విదేశాంగమంత్రుల సమావేశంలో, 21 దక్షిణ అమెరికా దేశాలూ ప్రత్యేక సేనలను తయారుచేసి వాటిని అమెరికా రక్షణకూ, ఐక్యరాజ్య దళాలకూ వినియోగపరచాలని ఏకగ్రీవ నిర్ణయం జరిగింది.

—ఫ్రెంచివారు అమెరికాకు మొరాకోలో స్థావరాలిచ్చినట్లు తాత్కాలిక ఫ్రెంచి విదేశాంగమంత్రి పారిస్‌లో తెలిపాడు.

శనివారం, ఏప్రిల్ 7:

—బొంబాయి రాష్ట్ర సోషలిస్టుపార్టీ కార్యవర్గంవారు అవసర వస్తువుల ధరలు పెరగడం గురించి ఆందోళన తెలుపుతూ తీర్మానం చేశారు.

—నవీనమైన శిక్షణ విమానం పంపిణీని హిందూస్థాన్ ఎయిర్‌క్రాఫ్ట్‌వారు తయారు చేస్తున్నట్టు రక్షణశాఖ ఉపమంత్రి పార్లమెంటులో తెలిపాడు.

—యాలూనదిపై అమెరికను, కమ్యూనిస్టు జెట్ ఫైటర్ల సంఘర్షణ తారస్థాయికి వచ్చింది.

—మంచూరియాలో రష్యన్ సేనలు లేవని సోవియట్ వార్తాసంస్థ "టాస్" ప్రకటించింది.

—కొరియాలో బ్రిటన్ అమెరికాలకు గల లక్ష్యాలలో ఎట్టి వ్యత్యాసమూ లేదని బ్రిటిషు విదేశాంగ కార్యాలయాధికారులు చెప్పారు.

—1950 లో ఇండియా 21,24,700 టన్నుల ఆహారధాన్యాలు దిగుమతి చేసుకున్నట్టు ఆహారవ్యవసాయశాఖవారి నివేదిక తెలిపింది.

—రాజాజీ హాలులో భారత అధ్యక్షుడు రాజేంద్రప్రసాదు పండిట్ నెహ్రూ చిత్తరువు ఆవిష్కరించాడు.

ఆదివారం, ఏప్రిల్ 8:

—కాంగ్రెస్‌వారు కాంగ్రెసులో కక్షలూ, పార్టీలూ ఏర్పరచరాదని హెచ్చరిస్తూ వర్కింగ్ కమిటీ తీర్మానించింది.

—చైనావారు కొరియా శాంతి సంప్రతింపులకు సిద్ధంగా ఉన్నారని లేక్‌సక్సెస్‌లోని ఆసియా అరబ్బురాజ్యాల ప్రతినిధి తెలిపాడు.

—గత కొద్దిరోజులుగా 100 అమెరికన్ విమానాలు మంచూరియా గ్రామాలపై 28 సార్లు దాడులుజరిపి చాలానష్టం కలిగించినట్లు పెకింగ్ రేడియో ప్రకటించింది.

—చైనాకు ఐక్యరాజ్యసమితిలో స్థానం కలిగించడానికి బ్రిటను కృషిచేస్తూనే ఉంటుందని బ్రిటిష్ ఉపమంత్రి కెనెత్ యంగర్ అన్నాడు.

—ఝూన్సీలో పోలీసులకూ ప్రదర్శనదారులకూ జరిగినసంఘర్షణలో కాల్పుల ఫలితంగా నలుగురుచనిపోయారు.

—స్టాలిన్ శాంతి బహుమానకృతులు ప్రకటింపబడ్డాయి. బహుమతులు పొందేవారిలో ప్రొ. జోలియోక్యూరీ (ఫ్రాన్సు) డా. హ్యూలెట్ జాన్సన్ (బ్రిటను), మడామ్ సన్యట్ సెన్ (చైనా) ఉన్నారు.

★

★ అదీ - ఇదీ ★

ఫ్రాన్సు ఆర్థిక పరిస్థితి :

ఫ్రెంచి కార్మికుల జీవన ప్రమాణాన్ని కాపాడాలంటే ప్రస్తుత ఉత్పన్నాల విధానాన్ని యావత్తూ సంస్కరించటమే మార్గం... ఫ్రాన్సులో 10 లక్షలకుపైగా ప్రైవేటు కార్లు ఉన్నాయి. కాని 1,31,000 మంది మాత్రమే తమకు 850 పౌనులకంటే ఎక్కువ సాలీనా ఆదాయమున్నట్టు చెప్పుకుంటున్నారు. 40 లక్షల మంది మాత్రమే అసలు ఆదాయపుపన్ను అంటూ ఒకటి కట్టినవారు...1949 సంవత్సరంలో 25 కోట్ల పౌనుల ఆదాయంపన్ను ఎగకొట్టబడిందని ఖజానాశాఖవారు అంచనా వేశారు... పారిశ్రామిక యజమానుల్లో ఈ మధ్య వెర్రితలలు ప్రారంభమయ్యాయి. జనరల్ ఫ్రాంకో పద్ధతులమీద వారి కెక్కడలేని అభిమానం పుట్టుకొస్తోంది. ధరలను ఇష్టం వచ్చినట్టు పెరగనిస్తూ, జీతాలను ఘనీభవింపజేసే పద్ధతి నొకదాన్ని జనరల్ ఫ్రాంకో స్పెయిన్‌లో అనుసరిస్తున్నాడు. ఈ పద్ధతిలాంటిదాన్నే ఫ్రాన్సులో కూడా అమలు జెయ్యాలని భావించేవాళ్లు ఫ్రెంచి పారిశ్రామికుల్లో కొందరున్నారు. ఉదాహరణకు కొన్ని మాణిక్యాల్లాంటిమాటలివిగో :

"కార్మికుల ఇళ్లలో నీటి సదుపాయాలు ఏర్పాటు చెయ్యటం శుద్ధదండగ. కావలిస్తే వాళ్లేపోయి నీళ్లు తెచ్చుకుంటారు...కార్మికులకు ఎక్కువ జీతాలివ్వటం పొరబాటు. ఎక్కువ జీతాలిస్తే వళ్లుబలిసి పని చెయ్యరు. కార్మికుడికి రాత్రి దుస్తుల్తో అవసరమేముంది? వివస్త్రుడై పడుకోలేడా...... ఒక్కొక్క కార్మికుడికి అరటన్ను బొగ్గులా? ఎందుకు? ఫ్యాక్టరీనుంచి రాగానే పెళ్లాముతో కలిసి పడుకుంటాడు; కావలిసినంత వెచ్చదనం లభిస్తుంది."

ఇవి కల్పిత హాస్యోక్తులు కావు; కుటుంబాల బడ్జెట్లను చర్చిస్తూ ఇటీవల 'కలెక్టివ్ కాంట్రాక్టు కమిషన్ ఉపసంఘ సభలో' కొందరు చేసిన, ప్రసంగాల తునకలు.

(న్యూ స్టేట్స్‌మన్ & నేషన్‌లో అలెగ్జాండర్ వెర్త్)

* * * *

"అమెరికన్ వెధవలు"

ఇటీవల లండన్‌లో ప్రారంభమైన బ్రాడ్వే సంగీతనాటకం "కిస్ మి కేట్" తొలిప్రదర్శన మర్నాడు ఈ విలేఖరి ప్రమాదవశాత్తూ ఒక స్త్రీని ఒరుసుకోవటం జరిగింది. ఆమె గట్టిగా ఒక తోపుతోసి కోపంగా, "ఇంకో అమెరికన్ వెధవ," అని అరిచింది...ఇటీవలి సంఘటనల ఫలితంగా ఇంగ్లండులో ఏర్పడిన అమెరికన్ విద్వేషానికిది తార్కాణం. ఇది పార్లమెంటు చర్చలలోనూ కొన్ని (బ్రిటిష్) పత్రికలలోనూ మరింత బాగా కనిపిస్తుంది...

"కామన్స్ సభలో సోషలిస్టు వామపక్షీయులనుండి అమెరికా విద్వేషం దాదాపు ఎడతెగక దొర్లుతూ ఉంటుంది. ఈ పక్షానికి అగ్రగామి సామాన్యంగా సిడ్నీ సిల్వర్‌మన్....ఇటీవల పార్లమెంటులో తీవ్రమైన అమెరికా విముఖత్వం కూడినా లేఖ చదవగా లేబర్ పక్షంలోనివారు కొందరు చాలా ఆనందించారు.

వారపత్రికలలో న్యూస్టేట్స్‌మన్ అండ్ నేషన్, దినపత్రికలలో డెయిలీ మిరర్ దాని సోదర ఆదివారపత్రిక ది పిక్టోరియల్, హెచ్చుగా అమ్మడం కొరకేమో, అమెరికా విద్వేషం చూపిస్తాయి. ఇంగ్లండులో అమ్మే దినపత్రిక లన్నిటికన్నా డెయిలీ మిరర్ హెచ్చుగా అమ్ముతుంది. దాని అమ్మకం రోజుకు దాదాపు 50 లక్షలు.

...గడచిన నాలుగు మాసాలలో అమెరికాపై బ్రిటిషువారి విద్వేషం హెచ్చింది. కొన్ని కారణాలు :

చైనాపట్ల విభేదాలు, యుద్ధంలోకి లాగుతాడని మకార్థర్‌పై తీవ్రమైన అనుమానం.

యుద్ధప్రయత్నాలు - చాలా మంది బ్రిటిషువారు అమెరికా ఉత్తరవులనుబట్టి తమ దేశం యుద్ధయత్నాలు చేస్తోందని అపోహ పడుతున్నారు.

జర్మనీ - జర్మనులు యుద్ధసన్నద్ధుల కావటం చాలామంది బ్రిటిషువారికి ఇష్టం లేదు. అమెరికా వత్తిడిచేత ఇది జరుగుతుందని వారనుకుంటున్నారు. నాజీ యుద్ధఖైదీలను (అమెరికన్) హైకమిషనరు జాన్ మక్లాయ్ వదలిపెట్టినందుకు అన్నివైపులా నిరసించారు...

—న్యూస్ వీక్ లండన్ ప్రతినిధి

* * * *

చతుర్థసూత్ర ప్రణాళిక :

వెనుకబడిన దేశాల అభివృద్ధికి ట్రూమన్ 'పాయింట్ 4 ప్రణాళిక' క్రింద 4 కోట్ల డాలర్లను మాత్రమే అమెరికా ఇప్పటికి ఖర్చు పెట్టింది...... ఈ మొత్తం అమెరికన్ మిలిటరీ బడ్జెట్‌లో శతాంశంలో పదోవంతు, అంటే, వెయ్యోవంతు మాత్రమే ఉంది. (నేషన్, జనవరి 13)

మచ్చికకాని మకార్థర్:

జనరల్ మెకార్థర్ (కొరియాలో) స్వంతయుద్ధం ఎందుకు నడుపుతున్నాడో....అర్థంచేసుకోవటం అంత కష్టం కాదు. ట్రూమన్, ఎచిసన్, మార్షల్ అందరూ కూడా బాధ్యతని మెకార్థర్ చేతుల్లోంచి లాక్కోవటానికి భయపడుతున్నారు. ఎందుకంటే కథ అడ్డంగా తిరిగినప్పుడు తమని దూషించే అవకాశం మెకార్థర్‌కివ్వటం వారికిష్టంలేదు. అయితే మెకార్థర్ మనల్ని (బ్రిటన్) చైనా యుద్ధంలో ఇరికించినా, లేక చాంకైషేక్‌కు ఫార్మోజాలో సహాయంచేసి శాంతిప్రయత్నాలని భంగం చేసినా తమ మిత్రదేశాలతో పేచీ పెట్టుకోవలిసివస్తుందని కూడా వారు భయపడుతున్నారు...... అంచేతనే వారు క్లిష్టమైన నిర్ణయాలను తమంతటతామే చెయ్యటానికి వెనుదీస్తున్నారు. మెకార్థర్ తనంతటతానే బాధ్యతారహితంగా నిర్ణయాలు చెయ్యటానికి పూనుకోగా వారిప్పుడు తమకు వాటితో సంబంధం లేదని చెప్పివేస్తున్నారు. ఇదివరలో మెకార్థర్‌కు చాలాసార్లు మందలింపులు ఇవ్వటం జరిగింది. ఇదివరకు వాటిని లక్ష్యపెట్టనివాడు ఇప్పుడు లక్ష్యపెడతాడా అన్నది సందేహం......

యుద్ధాన్ని విస్తృతం చెయ్యటాన్ని మేము తీవ్రంగా ఖండిస్తున్నామంటే దానికి కారణం ఇదే: గొంతుచించుకుని అరిస్తేగాని మా మాట అమెరికాలోని పబ్లికన్ పత్రికలగోడలు దాటి వినిపించదు. టైమ్ (అమెరికా) పత్రికరాతల్ని కులాసా కబుర్లుగా పరిగణించేటంత రాజకీయపరిజ్ఞానం అమెరికాలో పారిశ్రామికులకందరికీ ఉన్నదని మేము విశ్వసించలేము.

మెకార్థరూ, చైనా లాబీ వర్గా... (చాంకైషేక్ అభిమానులు) అమెరికా అధ్యక్షుడుమీద, ఆయన సలహాదార్లమీద ప్రయోగించే "బ్లాక్ మెయిల్" మేము సూచించినదానికన్న ఉపద్రవకరంగా ఉంది.......చైనా లాబీ వర్గాలవారు 9 నెలలనుంచీ అమెరికాని, ఐక్యరాజ్యసమితిని తృతీయయుద్ధపు అఖాతంకేసి లాక్కుపోతున్నారు. ఈ ఒత్తిడినే మేము దుయ్యబట్టుతున్నాం కాని, అమెరికా "దేశాన్ని" అంతటినీ కాదు......అమెరికన్ విధానాలు "రాజకీయ ఉన్మాదుల ఒత్తిడికింద నిర్ణయింపబడటంలేదని అమెరికా ప్రభుత్వం మనకి హామీ ఇచ్చేటట్లు హెర్బర్టు మోరిజన్ (బ్రిటిష్ విదేశాంగమంత్రి) ఖండితంగా తెలపవలసిన సమయం వచ్చింది.

(న్యూస్టేట్స్‌మన్ & నేషన్ మార్చి 3 సంపాదకీయం)



సీసాల్గారి

శ్రీ కవికొండల వెంకటరావు

నేను ఎక్కడికైనా ప్రయాణమై బయలు దేరితే, కోటొకటి తప్పకుండా తొడుక్కు వెడతా! ఆ కోటు యొక్క పెద్ద జేబుల్లో ఒకదానియందు జేబురుమాలు, ఒకదానియందు ఒక తెల్లనిసీసాయున్ను, పైజేబులో కాగితమున్ను పెన్సలున్ను, లోపలజేబులో మనీపర్సున్ను పెట్టుకు వెడతాను.

అలాగానే మొన్నటిదఫా శ్రీరంగపట్నం వెళ్లినప్పుడు ఈ పరికరాలు అన్నీ తీసుకు వెళ్లాను. తిరుగ ఆ వూరినుండి వచ్చేటప్పుడు "పెద్దకాపు కొత్తగా ఎత్తైన, మేడ కట్టాడు, చూచి వెళ్లండీ" అని ఊరివారు అన్నారు., "మేడ ఊరంతకూ మహా ఠాల్త్ర్యంగా కేంద్రస్థానంగా కనబడుతూన్నప్పుడు, చూడకుండా వుండడం ఏలాగు! నప్పకుండా చూస్తాను" అని పెద్దకాపుతకు కబురుపెట్టి, అతనితో కూడా ఆ మేడ యెక్కి, చుట్టూచూచి మిక్కిలి ఆనందపరవశుండనై, అతగాణ్ణి అభినందించాను. ఏమని ? "ఓయీ ! మీ మేడమీదనుంచి చూస్తే ఎంతదూరమైనా కనిపిస్తుంది!" అని అన్నాను. అతను "దూరం చూడాలంటే ఈ మేడే అక్కర్లేదండీ! కొబ్బరిచెట్టు ఎక్కినా కనబడుతుంది" అన్నాడు. దాంతో నాకు ఆ ఊరనున్న ఎక్కడెక్కడి కొబ్బరిచెట్లూ లెక్కపెట్ట బుద్ధి పుట్టింది. అయితే అది ఆ వూళ్లో సాధ్యం కాని పని.

ఆదిలో ఆ వూరు అసలు పెద్ద విశాలమైన కొబ్బరితోటల ప్రదేశమై యుండవచ్చును. ఇళ్లుకాని వాకిళ్లుకాని, అవసరాన్నిబట్టి అక్కడక్కడ చెట్లు చెరిపి, ప్రజలు ఇళ్లుకడుతూవచ్చి, దాన్ని ఒక ఊరుగా చేశారనుకుంటూ. ఇప్పటికిన్నీ, అన్నిగాదులు, అన్నిలోగిళ్లు వెలిసిఉన్నా, మేడమీదనుంచి చూస్తూఉంటే, ఊరంతా,



కేవలం కొబ్బరిమూవుల పందిరి అల్లుకుపోయివుందా అన్నట్లు కనబడింది. అయినప్పటికీ అక్కడక్కడ బాగా వెలితిగావున్న స్థలాలు లేకపోలేదు.

ఎక్కువగా మాయింటివైపు చూచానో, ఆ యింటినంటి, పూర్వకాలంనుంచీ వుంటూవుండిన మూడు కొబ్బరిచెట్లు ముఖ్యంగాకనబడలేదు. ఆ లోటు తలపోసికుంటూ, జేబులోఉన్న సీసాయొక్క బిరడా ఊడిపోగా, చెయ్యి జేబులోకి పోనిచ్చి బిరడానొక్కుతూ, వెళ్లొస్తానని పెద్ద కాపునుండివీడ్కోలు అందుకున్నాను. రోడ్డు పుచ్చుకున్నాను. జాముపొద్దెక్కింది. ఎండ అంత వేడీకాకుండా చల్లనాకాకుండాసమశీతలంగా కొండలమీదా చెరువులమీదా చెట్లమీదా చేలకలమీదా తెల్లగా శాంతివంతమై కనువిందొదవ గూర్చింది.

ఒక్కనిమేషంలో దగ్గఱగా ఉన్న 'బస్సుస్టేండు'కు చేరుకోగల్గాను. కాని మొదటిబస్సులో చోటు లేక, రెండవబస్సు వచ్చేవరకు అక్కడ ఉన్న ఒకానొక కాఫీహోటల్ బల్లమీద నీడపట్టున కోర్చోవలసి వచ్చింది. అప్పటికప్పుడే పెసరట్లు పెనం పనిఅయి, పొయ్యీ పెనమూ కూడా చల్లారిపోయి ఉండెను. కాని పక్కనున్న మఱోపొయ్యి జాజ్వల్యమానంగా మండుతూ ఉండెను. ఆ పొయ్యిమీద పెద్ద మూకుట్లో, సగానికి పైగా నూనె కళపెళామంటూ వుంది. వండే అతడు, పకోడీలేమిటి, వడలేమిటి, గారెలేమిటి, పుణుకులేమిటి, అన్నింటినీ వేలువేలు వాయిలుగా తీస్తూ, పళ్లాలలోకి వేస్తూ, 'సర్వర్ల'ని ఎక్కడి పళ్లెం అక్కడ పంచమంటూ వున్నాడు. అంతల్లో ఒక అతడు, ఒక తెల్లనిచొక్కా తొడుక్కుని పైనొక శాలువాలాంటిది ఉత్తరీయంగా వేసుకుని, తనకుముందు వేఱుమనిషి వినయవినమ్రుడై దారిచూపిస్తూంటే, తిన్నగా వచ్చి, నేఁ గూర్చున్న కాఫీహోటల్లోనే ఎదరబల్లమీద కొంచెం దూరంలో ఆసీనుడయ్యాడు. అదేవేళకు ఒకానొక ముసలి రైతు ఎక్కడినుంచో వచ్చి నే నున్న బల్లమీద రెండవ చివర కూర్చున్నాడు. దారిచూపిన ఆసామీ కనుసన్నను 'సర్వర్లు' శాలువా మనిషిముందు నాలుగు పెసరపుణుకులు ఒక ప్లేటులోపెట్టి, మఱో ప్లేటులో అతనికోసమే నాలుగు ఆవడలు 'చెమ్చా' తీసి, 'చెమ్చా' సమేతంగా ఇచ్చే ఉద్దేశ్యంతో ఉన్నారు.

"నాకు చెమ్చా ఎందుకోయి? తీత ముంజె తీతముంజె, లోపలి నీళ్లుపోకుండా ఆపళంగా నోట్లోవేసుకు మింగేవాడికి?" అంటూ పుణుకుల ఫలాహారము పూర్తిచేసి, అర సెకనులో ఒక ఆవడ నాలికమీద వేసుకు చప్పరించేశాడు. మఱి అతణ్ణి తీసికొనివచ్చిన గృహస్థు ఆ వడ్డించేవాళ్లతో ఆయన కేమేమి కావాలో అన్నీ సుష్టుగా పెట్టండిఅంటూ, రైతుచేతి పిలుపున మా బల్ల చేరికకు వచ్చాడు. అదివఱకు అతడూ రైతూ అన్యోన్యం ఎఱిగివుండబోలు. రైతు అతణ్ణి ఇలా పలుకరించాడు. "మీ యింట్లో ఆడవాళ్లకు గాలి సోకిందనిఅంటూ దాన్ని వదిలించడానికి భూతవైద్యుణ్ణి తెప్పిస్తానన్నావుడవు. ఆయన ఈయనేనా ఏమిటి?" అన్నాడు. అవతలతను "అవును!" అన్నట్లు తలూపాడు. "గాలి ఆడదా మగవాడా?" అని రైతు అడిగాడు. "ఎవరో పేరంటాలుట! మా వూళ్లోనే సీసాలోకి ఎక్కించేశాడు" అని జవాబు. "ఆ సీసా అక్కణ్ణే పారేశాడా?" అని తిరుగ ప్రశ్న. "లేదు, కూడా తీసుకుపోతున్నాడు. అలాంటి భూతాన్ని తానే గాని భూదేవికూడా భరించలేదట" అని తిరుగ జవాబు. అదంతా విని నేను యాదాలాపంగా నా జేబులోవున్న బిరడాబిగించిన తెల్లటి సీసాను పైకితీసి అక్కడ బల్లమీద నాప్రక్కన పెట్టుకున్నాను. దాన్ని రైతు చూస్తూ "తమరూ భూతవైద్యులేనా?" అని అడిగాడు. నేను "మఱే" అని అందఱూ వినేలా "ఆయన చచ్చిన మనుష్యులయొక్క గాలిని సీసాలలోకి ఎక్కించి లకోటాచేస్తే నేను చచ్చిన చెట్లయొక్క గాలిని సీసాలలోకి ఎక్కించి లకోటా చేస్తాను" అన్నాను.

భూతవైద్యుడప్పటికప్పుడే ఆవడ పెరుగు మీసాల కంటుకుంటే ఇటూ అటూ తుడిచేసుకుంటూ, "ఏమండోయి! మీ రెవరో నాకు తెలియదుగాని-మీరు భూతవైద్యుల్ని గురించి అంత తేలిగ్గా మాటాడరాదు" అన్నాడు. అంటే నేను "మాటాడరాదు అని అనడమేనా? ప్రత్యక్షానుభవం ఏమైనా చూపిస్తారా?" అని అడిగాను.

"చూపించడానికి హోటల్ ప్రొప్రయిటరుగారు అంగీకరిస్తే, పందెం వేసి మఱీ నా మహిమ చూపిస్తాను" అన్నాడు ఆ భూతవైద్యుడు. "మఱి మీరు?" అన్నాడు పక్కరైతు అప్పటికప్పుడే "విమ్టో" ఒక గ్లాసుడు పుచ్చుకుని నా వంకకు తీవ్రంగా చూస్తూ, "అతడేం చూపిస్తాడో ముందు చెప్పమనండి!" అన్నాను. "ఏమి చూపిస్తానా? భూతాన్ని పైకివదలి చూపిస్తాను! ఇక్కడిప్పుడు అమ్మకానికున్న రెండు మళ్ళ పకోడీలు, నెయ్యిగారెలు, పదివేల పుణుకులు, రెండువేల ఆంవడలు, మఱి సంజానానుపులన్నవి లేకుండా పక్కొక్క లిప్తలో కాజేస్తుంది. ఇంకా" అని- అంటూ పప్పు రుబ్బే ఆడమనిషికేసి ఒకమాటుచూస్తూ-చుఱచుఱ మండుతూవున్న పొయిమీద చఱచఱ కాగే నూనిలో గిరగిర తిరుగుతూ వేగే పకోడీలు పరికిస్తూ, "పందెం - ఒక్క నిమేషంలో ఆ పప్పు అంతా రుబ్బి సముద్రపు నురుగులా చూపించి, మధ్య మధ్య సలసలమనే నూనెలో తన చేయి ముంచి కఱకఱమనే పకోడీ అలా పైకెత్తి గొంతుకలో వేసికొంటుంది. నేను పట్టిన భూతం తమాషా చూడాలీ అంటే చూడండి" అన్నాడు. "మఱి మీ సీసాశక్తి?" అని కూడా సవాలు వేశాడు ఆ భూతాలవాడు.

"నేను బిరడా తీస్తే గంటకు 70, 80 మైళ్ళ స్పీడ్‌న, తుపాను చెలరేగి, ఈ పాకను పందిరిని, బల్లల్ని, రుబ్బురోళ్లను ఎత్తిపార వేయడమే కాకుండా, మండుతూవున్న పొయిలోని అగ్నికణాలను రేగొట్టి, చంద్రవనిప్పులుగా ఆకాశంమీదకు విరజిమ్మి ఊళ్ళకూళ్ళనే నాశనంచేసి పారేస్తుంది" అన్నాను.

అనడంతోనే పొయిదగ్గఱ కూర్చున్న హోటల్ ప్రొప్రయిటర్ స్వయంగా లేచి ఒక కప్పు టీ తయారుచేసి భూతవైద్యుడికిస్తూ, "తమరు నాకు డబ్బు నివ్వనక్కఱలేదు. చల్లగా వెడితే చాలు" అనిచెప్పి, నా వంకకు తిరిగి "తమరున్న ఫలాహారం తీసికోండి ముందు. ఇవిగో గారెలు!" అని ఎనిమిది గారెలు ఒక ప్లేటులోపెట్టి తేబోయాడు. "గారెలు కావలిస్తే నాబోటిగాడు అప్పటికప్పుడు రుబ్బించి వాయతీయించుకు, బిళ్లబిళ్లలుగా పంపించి బొత్తాలు పెట్టించి, నూనెలో అలా జారేయించు, వేగుతూంటే "ఏమోయి ఇలా అవి పుంజెడు సది గుచ్చి పడెయ్యి" అని తాజా సరుకు మజాగా ఆరగిస్తాడుగాని, నిలవ సరుకు తినడు" అన్నాను. "అబ్బే! ఇవన్నీ మీరు వచ్చాక వేసినవే! గరమ్‌గరమ్ సరుకే" అన్నాడు షాహుకారు. అంతలో బస్సు వచ్చే జాడగా దుమ్ము లేచింది. నేను లేస్తూ

"నాకు ఏమీ అక్కర లేదు - థాంక్ యూ! హోటల్ మాత్రం మరికొంచెం శుభ్రంగా తుడిపించి, సర్వర్లు మంచి తెల్లని చొక్కాలు తొడుక్కునేలాగు చూడు. సాసర్లు, గ్లాసులు, చెమ్చాలు బాగా కడిగించు. సరుకు బాగానే వుంది జిగ్ జిగ్ మంటూ" అన్నాను. రైతు "అరు బాగా చదువుకున్న మారాజులు కాబట్టి అంత ధైర్యంగా నాకు సలహా యివ్వగలిగారు. లేకుంటే ఇవ్వగలరా? నేను గళాసులోకి ఏదో ఊక వొస్తే-ఊక ఎక్కడనుంచి వస్తుంది? పిడక మండి కాక! అని నేను నీదాకా ఫిర్యాదు చెయ్యక మరోదాంట్లోకి "కలరు" తిరగబోయించుకు తాగాను" అన్నాడు. అలా అతగాడు ఏమేమో అంటూనే వున్నాడు- నేను బస్సుఎక్కి సురక్షితంగా ఇల్లు చేరుకున్నాను.

మర్నాడు మా నాన్నగారి ఆబ్దికం. ఆబ్దికం యథాశాస్త్రీయంగా పెట్టాను. కాని అసుర సంధ్య వేళకు జ్వరం తగిలింది. మంచమెక్కాను. 'రగ్' కప్పుకున్నాను. ఇంట్లోవాళ్ళతో "ఉండండి! మందు మాటకేం? ఆ బిరడా వున్న సీసా తీసుకు రాండర్రా ఇలా" అని తాఖీదు ఇచ్చాను. ఒక పావుగంటో అరగంటో వాళ్లు విడ్డూరంగా నా ఆజ్ఞను గురించి ఆలోచించిన వారై "ఎందు కడిగానో" అని ఆ సీసా నాకు అందిచ్చారు. ఆ సీసా అందుకుని అందర్నీ కాస్సేపు దూరంగా పొమ్మని-బిరడా తీసి సీసాలోని గాలిని గురించి యోజింపసాగాను.

అసలు నే పెరిగినప్పట్నుంచీ మా యింట్లో పెరట్లోవున్న కొబ్బరిచెట్లు మూడేనా అని మొదట సందేహమేసింది. బాగా జ్ఞాపకంచేసుకుని-మా తండ్రి, పెద్ద పినతండ్రి, చిన్నపినతండ్రి-అని పూర్వులను తలపోసికొని, ఉండేవి మూడు కొబ్బరిచెట్లు, అని ఒక నిర్ధారణకు వచ్చాను. అయినా "పూర్వీకులు క్రమ ప్రకారం మొదటి మాతండ్రి, తరువాత మా పెద్దపినతండ్రి, తరువాత మా చిన్న పిన తండ్రి పోయారే-అలాగే క్రమం తప్పకుండా ఈ మూడు చెట్లూ నశించిపోయినాయా?" అనే ప్రశ్న కొంతసేపు క్లిష్టత గూర్చింది. "దానికేం! పోయిన వెనుకగాలి అన్నది విశ్వమందతటిదీ, చరాచర కోటిదీ ఒకటేగాని దానికి మరీ ముందు వెనుకలంటూ లేవు" అనే తీర్మానాలకు అనతి కాలంలో వచ్చాను. అనంత కాలవాహినిలో పయనింపసాగాను. అలా పయనిస్తూనే నేను మంచంమీదుండగా, ఆ చెట్ల కథొక్క రూపాలు కళ్ళముందు సాక్షాత్కారం కాసాగినాయి. అవి సాక్షాత్కారమైనకొద్దీ మూడుమూడు వ్యక్తులుగా నిరూపణ గొన్నాయి.

అందులో ఒక చెట్టు నూదమొక్క. అనగా అక్కడే మొలిచి అక్కడే మట్టి అయిన కొబ్బరిచెట్టు. మొదలు చాలా సన్నంగా వుండేది. దానికి చుక్కావు అనే ఒకావును కట్టేసేవారు. ఆ ఆవు యొక్క పాలరుచి ఆ చెట్టునుపట్టివచ్చిందో, ఆ చెట్టు కాయలోని నీళ్లరుచి ఆ ఆవును బట్టి వచ్చిందో-రెండూ బహుమధురాలు! నేను తఱుచు ఆ ఆవుకోసం దూడను విప్పినప్పుడల్లా దూడను లాగిపట్టి అన్నోయినోన్న గుమ్మ పాలు తాగేసేసి, చెట్టొంకమూచేవాణ్ణి, "ఎప్పటికైనా తాగలేకపోతామా ఈ చెట్టు కాయలోని నీళ్లు" అని. దూడల్ని పాలానికి తోలుకుపోయినప్పుడు మట్టమధ్యాహ్నము ఏలాగో ఒకటి రెండుకాయలు ఆ చెట్టువి తీయించుకు తాగేసేవాణ్ణి-కాయలు తీయడానికి మనిషి ఎక్కేటప్పుడు ఆచెట్టు జవజవలాడిపోయింది. అంత సన్నం అంత పాటవం కలిగింది అది. ఆచెట్టు మరి లేదిప్పుడు!

రెండవ కొబ్బరిచెట్టు ఉత్తరానికి పడమరకు మస్య మూలను వుండేది. అది కుంభం మాసుకట్టిన మొలకను ఎక్కడనుంచో తీసుకొనివచ్చి మావాళ్లు పాతించి, పెంచిన నారికేళవృక్షంలా ఉండేది. మొదలు లావుగా చూపుతూ, క్రమంగా పైకి వెళ్లినకొద్దీ అదొక వాటంగా ఎదిగి, సూదిమొనగా చివర తేలి, సూదిమొన చివర జుత్తు విరబోసికొన్న మాదిరిగా వుండి, మట్టలు, ఆకులు, ఆ మధ్యను గెలలు, గెలల నిండా కాయలు గలది! కానీ ఒకళ్లూ దాని కాయలు నాయొతికను తీయించిన జాడలేదు. కారణం దాని మొదట పెద్ద బోదిచేసి ఆ బోదిలోకి నిరంతరం నూతివాడకపు నీరు వచ్చేలా ఏర్పాటు చేశారు. కాబట్టి చెట్టెకాబలి అంటే బోదిమట్టెయ్యాలి. మరి కొబ్బరికాయ నీళ్లల్లో చేపలుంటాయి అనో ఆ బోదిలో చేపలుంటాయి అనో ఎప్పుడు కొంగలువాలినా ఆ చెట్టుమీదనే వాలేవి! తెల్లనికొంగలు! అయితే కాయలు కిందపడ్డప్పుడు ఆడించి చూస్తే లోపల కురిడీలు బడబడ చప్పుడయ్యేవి. ఇంతకూ నీటిరుచి చూడవద్దా అని లోపల వుండేది-ఎట్టకేల కొకనాడొక కొంగ గట్టిగా పొడిచింది కాబోలు ఒక ముచ్చెటకాయ ఊడిపడింది. ఆ కాయ కొట్టి నీళ్లుతాగి ముక్క చవిచూస్తునుగదా-అపూర్వమైన అత్యంతరహితమైన రసవరార్థంగా తోచింది. కాయ ఉరవు నిజంగా పట్టి చూస్తే పిల్లలకు పాఠంచెప్పే "గోళాకార" భూమ్యుపరితలం అంత వున్నట్లు తట్టింది. ఆ చెట్టూ లేదిప్పుడు!

మూడో చెట్టునుగురించి యోచిస్తున్నా. అది మాతచ్చిరాని యొతికను వేసిన లేత మొలకలాగే జ్ఞాపకం వస్తూవుంది. కారణం అదివీటూ ఎంత పెరిగేదో మేమూ ఏటేటూఅంతా ఎదిగాం అన్నట్టు ఎప్పుడూ ఒకే నిడివిగల గడవెట్టి ఆ చెట్టు యొక్క పుచ్చుల్ని, బొండాల్ని, ఏవి కావలిస్తే వాటిని పడగొట్టుకొంటూ ఆడుకుంటూ వాడుకుంటూ వుండేవాళ్లం. దాహంవేస్తే అదునుకు ఉపయోగపడేలా వుండేది ఆ కొబ్బరిచెట్టు. మరీన్నీ దాని ఆకులు అతి పచ్చగా, మిక్కిలి కళ్యాణవంతంగా ఉండి ఎక్కడలేని శోభ ఆ యింటికి చేకూరుస్తూ వుండేది. ఆ చెట్టూ లేదిప్పుడు!"

ఇలా అనుకుంటూ, "సీసాలో గాలి ఇంకా వుందా? అంతా అయిపోయిందా?" అని దీపం ముందుంచి చూచాను. "బిరడా, వెయ్యనంతసేపు పైగాలు లెన్నైనా సీసాలోకి ప్రవేశించి ఆ సీసాను నిత్యపూరణంగా చూపించగలదు" అని హెచ్చరిక గొన్నాను.

పోయిన మూడు కొబ్బరిచెట్లను తలపోస్తూ, ఇంత వ్రాశానేపోయిన మాతండ్రిని గురించి, ఆయన తమ్ములిద్దర్నీ గురించి ఎంత వ్రాయాలో అని అనిపించింది.

వారు శతాధిక ఎకరం కలిసి వ్యవసాయంచేసేవారు. ఇతరులకు లక్షలాది సలహాలిస్తూ అందుకు తగినట్టు కాగితాలు ఊళ్లోవారందరికీ వ్రాయించి పెడుతూ వుండేవారు. పెద్ద కొబ్బరితోటవున్న ప్రదేశంకొనివుండాలి కాపురంవుండడానికి-అన్నాగా-ఊరంతా ఆదిని కొబ్బరితోటల మేలిముసుగు వేసుకు క్రమం క్రమంగా దాన్ని తొలగించుకు వుండివుండాలి అని అందుకే ఆశ్చర్యం! ఇప్పుడా యింటినంటి ఒక్క కొబ్బరిచెట్టూ లేదు!

అలాగానే వారు చేసిన మహా కమతమున్ను మటుమాయమైపోయింది. ముప్ఫై మందికి పైగా పాలికాపులుండేవారు ఆరోజుల్లో. ఇప్పుడు కలంపట్టి వ్రాస్తూ వుంటే

(13-వ పేజీ చూడండి)

దాచలేని హృదయము

శ్రీ ఇసుకపల్లి లక్ష్మీనరసింహశాస్త్రి

‘అంతకనురుకుంటావే పిల్లలంటే. నీ పిల్లాడవుతే అట్లా అంటావు’

‘నా పిల్లాడేమిటి, నీ పిల్లాడేమిటి ఎవరైనా అంతే’

‘ఆ... చూస్తాగా’

‘ఏమిటి చూసేది, మొదటినుంచి నాకు పిల్లలంటే అసహ్యము. వాళ్ల యేడుపు చూశినా, వాళ్ల మారాము చూసినా–’

‘ఏ యేడుపు లేకుండా, యే మారాము లేకుండా యింతవాడయ్యావు గామాలు’

‘అదంతా అనవసరము. నాకు పిల్లలంటే యిష్టము లేదని చెప్పా. అంతే’

‘నీ మాదిరిగానే మీ అమ్మా వుంటే నీపని కనిపించేది.’

‘ఏం వుంటే, నేను వుండి దేశాన్ని వుద్ధరిస్తున్నానా.’

‘ఏమిటా మాటలు, అందరూ దేశాన్ని వుద్ధరించేవాళ్లే అయితే, యింక వుద్ధరింపబడేవాళ్లెవరు.’

‘అందువలన కొంతమంది అప్రయోజకులు వుండాలంటావన్నమాట.’

‘నేననే దేముంది. కనిపించటంలా.’

‘ఏడుస్తున్నాడు. తీసుకువెళ్లు అవతలకు. ప్రాణుకోటానికి వీల్లేకుండా, ఎప్పుడు చూసినా పిల్లల యేడుపే పీడ.’

‘ఏమిటా నోటిలొందర. పిల్లలు వుండకపోతే...’

‘అవున్లే. నువ్వంతమాట అంటావని నాకు తెలుసు. ఇక్కడనుంచి, తీసుకెళ్లు అవతలకు.’

‘సరేలే నేను వెళ్లుతున్నాగాని, వీణ్ణి తీసుకో’

‘ఏమిటా ఎగతాళి. పిల్లవాణ్ణి తీసుకెళ్లమని నేను చెపుతుంటే, వాణ్ణి నా దగ్గర వుంచి పోతానంటావేమిటి. పెద్దదానివి యేమీ అనలేకుండా వున్నాను కాని...’

‘అనేదేమిటో అను, మీ నాన్నగారి చేత యింతవరకు మాటలుపడనే పడలా. నీ చేతనా పడతా’

‘వాదన అనవసరంగా పెంచక. నువ్వు పిల్లాణ్ణి తీసుకెళ్లు.’

‘ఏమిట్రా అంతచిరాకు... చూడు చెయ్యిచాచి యెట్లా పిలుస్తున్నాడో మామయ్యను’

‘అడుగో పాపాయిపడ్డాడు...’

‘ఓహో ! నీ కొడుకనా...’

‘నా కొడుకేంగాదు—శకుంతల కొడుకు’

‘సరేలే, యెవరైతే, మొత్తంమీద పిల్లాడు పడ్డాడు అనేధ్యాస, ప్రేమ వుందన్నమాట’

‘పడ్డాడు అని చెప్పంగానే ప్రేమ అంతా కొట్టుకుపోయిందేమిటి... అడుగో.. వాడు కూడవస్తున్నాడు... వెళ్లు... నువ్వు’.

‘ఓహో నీ కొడుకుకూడ జారిపడతాడని నన్ను వెళ్లమంటున్నావు.’

‘పడతాడనికంటె, యేడుపు ప్రారంభిస్తాడని...’

‘మాడరా... యెట్లా నవ్వుతూ వస్తున్నాడో. పరాయివాళ్లనైనా యెత్తుకుంటారుగాని నువ్వు కదలవేరా.’

మాట్లాడడు.

‘ఏమిటి ఆలోచిస్తున్నావు... మాట్లాడవే... నేను వాణ్ణే అవతలకు వెళ్లతాలే. నువ్వెత్తుకో’

‘నాకు యిదేగొడవ. ఓస్నేహితుని సంగతి జ్ఞాపకంవచ్చింది. అది ఆలోచిస్తున్నా.’

‘ఎక్కడికి వెళుతున్నావు... ఎంత రాతిగుండెరా– అరె–వాణ్ణి విదుల్చుకుపోతున్నావే... ఏడవకమ్మ ఏడవక... తాత తాత అంటున్నాడు వచ్చిరాని మాటలతో. ఎంత ముద్దొస్తున్నాడో చూడు. పిల్లలో పిల్లలో అని యెంతోమంది అఘోరిస్తుంటే, పండంటిపిల్లాణ్ణి, యెత్తుకోమని వస్తుంటే, విదుల్చుకు వెళ్లటానికి నీకు చేతులెట్లా వచ్చినాయిరా.’

కన్నీళ్లు కార్చుకుంటూ సత్యంగడపదాటాడు. వీధిలో అన్నకొడుకు కనిపించాడు. బాబాయి బాబాయి అంటూ వెంటపడ్డాడు. సందుచివరిదాక వెళ్లినతర్వాత ఒక్కసారి వాణ్ణి యెత్తుకుని ముద్దులాడి, యిన్ని బిళ్లలుకొని పెట్టాడు. కొన్నికొన్ని జేబులోకొన్ని వేసుకొని వాడు యింటికి వచ్చాడు బాబాయి బిళ్లలు బాబాయి బిళ్లలు అంటూ.

ఎవరు కొనిపెట్టారమ్మ అని తల్లి అడిగింది.

‘బాబాయి కొనిపెట్టాడు. ఎప్పుడూ అంతే, నాకు, తమ్ముడికి, రాముకి, బిళ్లలు, కారప్పూస కొనిపెడుతూవుంటాడు. ఎవరితో చెప్పద్దంటాడు. నువ్వెవ్వరితో చెప్పద్దత్తా. నన్నెప్పుడెత్తాడు బాబాయి అన్నాడు.

ఇంతలోకి మళ్లీ సత్యం యింట్లోకి వచ్చాడు, ముగ్గురు పిల్లల్ని విదిలుచ్చుకుంటూ.

‘ఏరా స్నేహితుడు కనిపించాడా’

‘ఏదో కనిపించాడులే’

‘ఇంకా కొన్ని బిళ్ళలు తీసుకురాక పోయినావు యింట్లో యింకా పిల్లలు లేరు’

‘బిళ్లలేమిటి!’

‘రఘుకు కొనిపెట్టావని చెప్పాడులే’

‘ఈ పిల్లలతో యింతే, నేను అర్జంటుగా పోతుంటే వెంటబడి యేడుస్తో నాతో యెందుకు వెధవపేచీ అని యిన్ని బిళ్లలు కొనిచ్చా, పోతావేమి యింట్లోకని వీడు కాస్త వీళ్లందరికి చెప్పాడు గామాలు... పో అవతలకి’

పులిక్కిపడ్డాడు.

‘నీకేమొచ్చిందిరా అంతకనురుకుంటావు. బిళ్లలుపెట్టకపోతే పెట్టకపోయినావుకాని’

సత్యం మాట్లాడలేదు.

‘ఇక అన్నానికిరా యింకా గొడవ యెప్పుడూ వుండేదేలే’

‘అమ్మ, మేముకూడ వస్తామే అన్నానికి.’

‘అప్పుడే రెండోసారి వేళ అయింది. మీకూ పెడతాలే రండి.’

‘నేను యిప్పుడు అన్నానికిరాను, వీళ్లందరికీ కాని. ఎప్పుడు భోజనానికి వచ్చినా వీళ్లు తయారు’

‘మీరు వస్తే బాబాయి అన్నంతినడట కాని, ముందరమామయ్యకు పెట్టిన తర్వాత మీకు పెడతాలే’

‘వద్దు వద్దు. ముందర వాళ్లకుపెట్టు. తర్వాతే నేను తింటాన్లే నాకేం తొందర లేదు’

అందరి భోజనాలు అయినాయి. సత్యం

సీసాలో గాలి

(11-వ పేజీ తరువాయి)

ఒక్కొక్క పాలికాపు ఒక్కొక్క పాత విగ్రహంలా ఈనాడు నా కళ్లెదుట నిలబడుతూ వున్నాడు! బూరారామన్న, ఎడ్ల కృష్ణుడు, ఆళ్ల నర్సయ్య, దాడి రుద్రయ్య, అతగాడి అన్నో తమ్ముడో మహాలక్ష్మి, సూరిశెట్టి కొండయ్య, ఎల్లపు సోమన్న, రాజన్న, నూకయ్య, హలికం శెట్టి గంగయ్య, కామయ్య, మరిడయ్య, తిరపయ్య, ఆడారి వెంకన్న, ఈ రామమూర్తి, మతీన్నీ తోట దగ్గర కావలివుంటే అప్పుడు, ఏతాం తోడుతూ నూతిలోంచి పాటే కిల్లాడి పాలుపితికే గోవిందు, గాదెలదొడ్డి ఊడిచే మాలది పార్వతి, ఒకరేమిటి అనేకమంది ఇరవై నాలుగు గంటలూ రోజూ యజమానుల చెప్పు చేతల్లో మెలగేవారు. వాళ్ల భార్యలో, తల్లులో, అప్పచెల్లెళ్లో, ఎఱ్ఱమ్మ అని, కన్నమ్మ అని, ఒక నలభైమంది అమావాస్యకు పున్నానికి తట్టలేసుకు జీతం గింజలు పట్టుకుపోవడానికి గాదెబడ్డీ మెట్ల నుండి, వీధి మెల్లదాకా లోగిల్లోంచి నడచి వెళ్లి తాళాలు తెమ్మంటూ వుంటే వాళ్లు ఇంట్లోవాళ్లా పరాయివాళ్లా అని అనిపించేది.

"ఇప్పుడేం చేస్తున్నావు?" అని ఒకణ్ణి మొన్న అడిగాను. "ఏముంది మీ నాయనగారు పోయాక ఏదుంచేల కొనుక్కొని సొంత వ్యవసాయం చేసుకుంటూ వున్నాను. కాని స్వతంత్రం వచ్చాక మన దేశం ఎంతగా బలుపు తిండితింటూ వుందో నాలాంటి, తంతుకరణే అయిపోయింది" అన్నాడు. "బండి వుందా?" అన్నాను. "ఉందిగాని పోలుగర్ర విరిగిపోయింది" అన్నాడు. "ఎడ్లు?" అన్నాను. "అవీ వున్నాయిగాని రెండింటికీ గాళ్లు తగిలాయి" అన్నాడు. అతని ముఖంవంక చూస్తును గదా నాకంటె ముసలివాలకంతో నెరిసిన జుత్తుతో మీసంతో కనిపించాడు!

సీసాకేసి చూచాను తిరుగ. ఇంకా గాలి పూరించుకునే వుంది-సంతల్లో సుగాలీల దగ్గఱ కొన్న గిత్తలుండేవి. మతీన్నీ దుక్కి ఎడ్లు ఇరవై కాళ్ల వుండేవి. పోతులు పదిహేను కాళ్ల వుండేవి, ఆవులు పది, గేదెలు అయిదు వుండేవి. పోతుల్లో ఒక జత బొబ్బిలి పోతులు! ఆవుల్లో ఒకావు వడమటావు! గేదెల్లో ఒకటో రెండో గవిడి గేదెలు! బళ్లు మూడుండేవి. నాగళ్లు మున్నెయుండేవి. ఇవిగాక వెలుగుగాను గుమ్మెనం వుండేవి. గుగ్గిళ్లదాలి వుండేది కుడితి గోలెలుండేవి అయిదు. మతీన్నీ నట్టింట ఎక్కడ చూచినా ఉల్లిపాయలు, బెల్లపచ్చులూ, పెరుగుచట్టిలు, నేతిముంతలూ కనువిందు గావించేవి. పాకుండలు, అర్సెలు, మిన పసున్ని మా పొట్టలకు తెల్లారేసరికి నిత్య నైవేద్యాలు. మల్లెపందిరి వొకటుండేది! అది ఎన్ని మొగ్గలు తొడిగేదో చెప్పలేను ఫాల్గుణంనుండి ఆషాఢందాకా ఏటేటా! దేనికైనా కరువు కాటకం ఒకప్పుడు కాకుంటే ఒకప్పుడైనా వుండేదేమోగాని ఆ తీగల నాకు దూసినంతనే మొగ్గ తొడగడానికి అటంకమేమీ వుండేదికాదు. అలాగ్గానే శీతాకాలంలోని చేమంతి మడిని గూర్చి తలపోసినా! దాని పువ్వులు దండలు దండలుగా గ్రుచ్చబడి ముక్కోటికి కోరుకొండలోని శ్రీరంగనాయకులవారి మెడ నలంకరించినప్పుడు తప్పకుండా అనిపించేది. ఆ స్వామివారొక్కరే ఆ దండలయొక్క పసిమికి తూకానికి తగినవాడని! కాదా పీతాంబరధారి!

—ఊపరి ఊరగాయలు పెట్టుకుంటూ వస్తే, అట్టే లేదోట కవుల్దార్ గొల్లకోటి సుబ్బయ్య హవల్దార్లా వచ్చి పెద్దకత్తిపీటమీద కూర్చుని, భద్రయ్య చెలకలోని పెకపెకలాగే ఊరగాయల మామిడికాయలను తరిగేసేవాడు పూటన్నర! ఊరగాయల గూనలు ఒక వీధే యుండేవి చిన్నా పెద్దా, చిట్టటుకుమీదనీ, పెద్దటుకు మీదనీ, గూటిలోననీ, అడ్డంగోడమీదనీ! పదేళ్ల నాటి పాత చింతకాయ పచ్చడికూడా ఒక్కొక్కకుండ అడుగున వెంపు నంటిపెట్టుకు పైకితీస్తే రాకసేది- "ఎందుకులెండి, కుండ పగులగొట్టకండి!" అని అడిగినవాళ్లు గోంగూరపచ్చడితోనో, తొక్కుముక్కల్లోనో తృప్తిపడి వెళ్లిపోయేవాళ్లు-మా పెద్ద మేనత్తగారి వూరినుంచి కన్నప్ప, మా చిన్న మేనత్తగారి వూరినుంచి గంగన్న ఎప్పుడైనా వచ్చేవారు. వచ్చినప్పుడు వాళ్లు తప్పకుండా మొదటివాడు గోధుమలమూట రెండవవాడు తేనెపాకం తెప్పాలా పట్టుకువచ్చేవారు. ఎందుకు? మావాళ్ళనుండి పొగాకు గరపాకో పదిచట్టలు పట్టుకుపోవడానికో, అరటిగెలలు బరువైనవో రెండు తీసుకుపోవడానికో!

సీసావంకకు చూచాను. ఇటూ అటూ పరకాయించాను. ఇంట్లో వాళ్ళందరూ నిద్రపోతూ వున్నారు. సీసాలో గాలి అలాగే వున్నట్టుంది. "ఓ! ఈ గాలి ఎలా పోతుంది. ఈ సీసాలోనుంచి?" అని నిమీలితాక్షుణ్ణై యోజించసాగాను. "నేను ఆ సీసాలోకి నా ఊపిరి వదిలేస్తేతప్ప అందులో కెక్కినగాలి స్థలాంతరం కానేరదు" అని సమాధి విచింతనానికి వచ్చాను.

అయితే నేను నా ఊపిరి ఆ సీసాలోకి వదలినవెనుక ఆ సీసాకు బిరడా వేసేవారెవరు? రెండూ ఒక్కసారిగా జరిగేదెట్లా? "జరుగనేరవు! జరుగనేరవు! నా గాలి ఏ సీసాలోకి ఎక్కబోదు" అని అనుకుంటూ నిద్రించాను.

తెల్లారి చూచేసరికి సీసా మంచం క్రిందకు జారిపడి ముక్కలై వుంది. బిరడా ఏమందేమో! వీధిలోకి తుడిచివేయబడిందో దానంతటదే ఎగిరిపోయిందో, మరి కనిపించలేదు. ★

తనగదిలో కూర్చున్నాడు. ఏదో వ్రాస్తున్నాడు. 'కడుపుతీపి' అని వ్రాశాడు. కొట్టేశాడు. 'కన్నకడుపు' అదీ కొట్టేశాడు. 'పిల్లలుఅంటే' అది కొట్టేశాడు. పిల్లలమీద ఓ కథ వ్రాద్దామని, తన ప్రేమ ఆ కథ ద్వారా తెలియచేద్దామని 'పాపాయి' అని వ్రాశాడు. బాగానేవుంది శీర్షిక అనుకున్నాడు. ఇక వ్రాయటానికి కలం కాగితంమీద పెట్టాడు. మేనల్లుడు, కొడుకు గదిలోకి వచ్చారు, మూడు, నాలుగేండ్ల వాళ్లు యిద్దరూ. అటు ఇటూ చూశాడు. ఓ సారి సావిట్లోకి వెళ్లి చూశాడు. అక్కడ యెవరు లేరు. గబగబవచ్చాడు. ఇద్దర్ని చెరో చంకన యెత్తుకొని హృదయానికి హత్తుకున్నాడు. 'రఘుకు బిళ్లలు కొని పెట్టానని కాదూ, మీకుకూడా కావాలన్నారు. మంచి మంచి మిఠాయిలు, కారప్పూస, బిళ్లలు, కొనిపెడతాగాని ఎవ్వరితో చెప్పకండి చెపితే కొనిపెట్టను.' అని వాళ్లిద్దర్ని కౌగలించుకొని ఆనందసముద్రంలో మునిగి వున్నాడు.

'రఘును యెత్తుకోవటం చూడక పోయినా, వీళ్లిద్దర్ని యెత్తుకోవటమన్నా చూస్తున్నారా. ఎన్నాళ్లుదాస్తావు' అంది అక్క, కిటికీ చువ్వల్లోంచి తొంగిచూస్తూ. ★

అతివృష్టి

పెద్దకథ

శ్రీ టేకుమళ్ల కామేశ్వరరావు

ఆకాశాన్ని చూసి హడిలిపోతున్నారు పెళ్ళివారు! పెళ్ళి ముహూర్తం వచ్చి శ్రావణమాసంలో పడింది. శ్రావణ భాద్రపదాలని పేరే ఉంది వర్షానికి. అరోజున పెద్ద విందు ఏర్పాటు చేసుకొన్నారు. పందిరి పెద్దదే కాని వర్షానికి అడ్డేమిటి! "ఏపాటి ముహూర్తబలం!" అంది పెళ్ళికొడుకుతల్లి. "మన అదృష్టమెలాగుందో!" అంది వియ్యపురాలు. "ఆ నాలుగు ఘడియలూ వర్షం ఎత్తిపెట్టినా బాగుండును!" అన్నారు అందరూ. పందిరిలో కూడా వడ్డించడం తప్పనిసరి అయింది. పంచల పెంబడి, వసారాలలోను ఎంతకని సర్దుతారు! భోజనాలు సగపడ అయేయి. కొత్త ఉరుములు, కొత్త కొత్త మెరుపులు కనబడ్డాయి. గబగబ మజ్జిగ వడ్డన అయింది. పందిరిమీద టప్పుటప్పుమని మొదలు పెట్టింది. విస్తళ్లలో మజ్జిగ పల్చనయింది. ఎవళ్ళమట్టుకు వాళ్లు లేచిపోయి అక్కడా, అక్కడా తలదాచుకొన్నారు. ఇక వానలు కురవనియ్యండి, చావనియ్యండి! మనికెందుకు? మనపని ఎదో రకంగా పూర్తిఅయింది. అన్నాడు పెళ్లికొడుకు తండ్రి. 'అహా?' అన్నారు దగ్గర ఉన్న వాళ్ళు. "ఏదయినా మొత్తంమీద ఈ సంవత్సరం వర్షాలు అధికమని పంచాంగంలో రాసే ఉందిట!" అంది పెళ్ళికొడుకు తల్లి.

రెండువైపులా ఏవాళ్లు ఏమీ ఇబ్బంది లేకుండానే కాలక్షేపమయి పోయేయి.

తులసెమ్మ, అంటే పెళ్ళికొడుకు తల్లి, వంటచేస్తూంది. పక్కనే పీటమీద కూర్చున్నాడు ఆమె భర్తఅయిన సన్నిధిరావు.

"అమ్మాయిని దాని పినతల్లి నాలుగు రోజులపాటు తమఊళ్లో తమదగ్గిర అట్టేపెట్టుకొని పంపిస్తానంటూ పెళ్లినుంచి పెడుతూ తీసుకుపోయింది. ఇల్లు బోరు మంటూంది!" అందితులసెమ్మ.

"అలాగేమరి! పిల్లలు ఇంటిలో లేకపోతే?" అన్నాడు సన్నిధిరావు.

"కోడల్ని ఇంటికి తీసుకురావాలి!" అంది తులసెమ్మ, కర్రలు ఎగసనతోస్తూ.

"పెళ్లికాలమందే శ్రావణమాసంలో మొదటివారం జరిగిపోయింది గాదుటే! తతిమావారాలలో నోము నోచుకొన్నా లెక్కకి రాదు కాదుటే!" అన్నాడు సన్నిధిరావు.

"సరే! లెక్కకి రాకపోతే మట్టుకు, వేడుకకి చేసుకోకూడదా ఏమిటి!" అంది తులసెమ్మ.

"దానికేమంత అర్జంటు అని" అన్నాడు భర్త.

"మన ఇంటికి మనపిల్లని తెచ్చుకోడానికి తొందర అక్కరలేదేమిటి! లేకపోతే పుట్టింటిలోనే పడేసి అట్టేపెట్టండి! ఏదో సామెత చెప్పినట్లుగా ఉంది. రాకపోకలకి అడ్డులేకుండా పోతుందనేకాదూ పెళ్లిలోనే కార్యంకూడా జరిపేశాము. వాళ్లు మట్టుకు ఎంతకాలముంచుకొంటారు, ఎదిగినపిల్లని!" అంది భార్య ఉపన్యాసధోరణిగా.

"సరే పంపమని ఉత్తరం రాస్తాను!" అన్నాడు సన్నిధిరావు.

సన్నిధిరావు రాజమహేంద్రవరంలో స్థిరగుమాస్తా. ఏదో బ్రహ్మిని తిమ్మి, తిమ్మిని బ్రహ్మిచేసి తంటాలు పడుతూంటాడు. అతనికంటె అతని భార్య తులసెమ్మ పేరు మోగిన మనిషి. "అల్లో! ఆవిడా!" అంటారు తెలిసిన పెద్దమనుష్యులందరూ. మరేంలేదు, నోరు పెద్దదిట!

తల్లిదండ్రులు సంభాషిస్తూన్నప్పుడు కొడుకైన చెన్నారావు ఇంటిలో లేడు. అతను బజారుపనిమీద వెళ్లాడు. అతను సన్నగా, ఎర్రగా ఉంటాడు. అంటకత్తెర. చిన్నపిలక.

కోడలైన రామామణి పుట్టిల్లు రాజోలు. ఆమె తండ్రిపేరు బలభద్రం. అతను వ్యవసాయదారుడు. పాడిపంటలకేమీ లోటు లేదు. అతనికి రామామణి ఒక్కర్తే సంతానం. అన్ని ప్రాణాలూ, ఆ అమ్మాయి మీద పెట్టుకొన్నారు తల్లిదండ్రులు.

సన్నిధిరావు రాసినఉత్తరం బలభద్రానికి చేరింది. అతను చదువుకొని "ఏమేవ్!" అంటూ అరిచాడు.

"ఎందుకు నాన్నా!" అంటూనే కూతురు అయిన రామామణి వచ్చింది.

"నిన్ను కాదమ్మా! మీ అమ్మనిరమ్మను త్వరగా" అన్నాడు బలభద్రం.

"వచ్చా! వచ్చా!" అంటూ భార్యయైన బంగారమ్మ సావిటిలోకివచ్చి "ఏమిటి?" అని అడిగింది.

"ఇదిగో మీ వియ్యంకుడి దగ్గిరనుంచి వచ్చిన తాఖీదు!" అన్నాడుభర్త.

"నావియ్యంకుండే గాని మీ వియ్యంకుండు కాడేమిటి!" అంది భార్య.

"రెండు రోజులలో అక్కడికి తీసుకువచ్చి దిగబెట్టాలిట! అర్జంటు!" అన్నాడు భర్త, ఉత్తరం వేళ్లమధ్య ఆడిస్తూ.

"అల్లుడు ఏమిపాటు పడుతున్నాడని ఇంటిదగ్గర! వచ్చి, రెండురోజులు ముచ్చటగా ఉండి, పిల్లని తనతో తీసుకువెళ్ల రాదూ!" అంది భార్య.

"అలాగు పంపిస్తుందిటే మీ వియ్యపురాలు, అబ్బో! తాతలు దిగిరావాలి! మొదటిమాట వాళ్లకి మర్యాదలు చాల వద్దూ!" అన్నాడు బలభద్రం.

"వారి ఇంటిదగ్గిర వారికి నిత్యమూ మర్యాదలు జరుగుతూనే ఉన్నాయి కదూను!" అంది భార్య.

"నువ్వు చెప్పేది బాగానే ఉంది! ఎవరి ఇంటిదగ్గిర వారికి మన్నాపన లేమిటి! సభలో ఉన్నప్పుడే పూజ్యత! అల్లుడికి మూడురోజులే మర్యాద! ఇలాంటి శాస్త్రాలు కొల్లలుగా ఉన్నాయి" అన్నాడు భర్త.

"సరే! పంపించండి. మధ్యనినా అభ్యంతరమేమిటి!" అంది భార్య.

కుమార్తెయైన రామామణి తల్లిదండ్రుల సంభాషణ శ్రద్ధగా వింటూంది.

"దిగబెట్టేవారు ఎవరు?" అన్నాడు బలభద్రం.

"ఎవరంటే?" అని బంగారమ్మ ప్రశ్నించింది.

"ఇంటి పనులన్నిటికీ ఎవరు పెద్దలో, వాళ్ళే తీసుకువెళ్ళి దిగబెట్టడానికి కూడా పెద్దలు!" అన్నాడు బలభద్రం.

"నేను వెళ్లలేను సుమండీ! లేనిపోని జట్టీలు? ఆ తులసెమ్మతో ఎవరునోరు పెడతారు?" అంది భార్య.

"చేసుకొన్నాక తప్పుతుందిటే!" అన్నాడు భర్త.

"తప్పించుకుంటేనే వాళ్లకి తప్పక ఏమవుతుంది! ఇప్పుడు వాళ్లకి చక్కగా తప్పలేదూ! ఒక్కకొర్రు ముక్కతోసరి!" అంది బంగారమ్మ.

"కార్డు అంటావు కార్డు! ఇది టెలిగ్రాం ఇంకా ఆపైన ఏదేనా ఉంటే అదిగా కూడా భావించుకో! రూపాయిల నోటుకి కాగితం ముక్క విలువా చూస్తాం! ఇదీ అట్లాంటిదే" అన్నాడు బలభద్రం.

"వాళ్లది పైచెయ్యి, మనది కింది చెయ్యి!" అంది.

"కన్యధార పోస్తున్న క్షణంలో ఎవరి చెయ్యి పైదో కాస్త జ్ఞాపకం తెచ్చుకో!" అన్నాడు.

"కలలో బంగారు గిన్నెలతో తాగే డన్నట్టుగానే ఉంది!" అంది భార్య.

"పిల్లని ఇచ్చుకొన్న వాళ్లపని అంత గాక మరేమి!" అన్నాడు బలభద్రం.

"ఏమోబాబూ! నేను వెళ్లలేను" అంది బంగారమ్మ.

"ఈ పొలంపనులన్నీ పాశుచేసుకొని. నన్ను వెళ్లిరమ్మంటే వెళ్లి వస్తాను!" అన్నాడు భర్త.

"ఏదో తీరుబాటు చేసుకోండి?"

"తీరుబాటు చేసుకోవడం వస్తే అంతా తీరుబాటే! మరితిరిగి పొలంవైపు చూడక్కరలేదు! అందుచేత నువ్వే ఒక్కమారు వెళ్లి వియ్యపురాలి కేమేమి పిండివంటలుచేసి పెడతారో, ఏమేమి మర్యాదలు చేస్తారో, అవన్నీ పుచ్చుకొని, నాలుగు రోజులే ఉంటావో, నాలుగువారాలే ఉంటావో, నీ ఇష్టం ఉండి—"

"వారాలు కూడాను. నే నే వెళితే పిల్లని దిగబెట్టి చక్కావస్తాను. నేను అక్కడ ఒక్కక్షణం ఉండను. మన మర్యాదమనం మొదటినుంచీ కాపాడుకోవాలి" అంది భార్య.

"సరే! ఎల్లుండి మంచిరోజుగా కనబడుతూంది పంచాంగంచూస్తే! అంతా సిద్ధం చేసుకోండి మరి" అని.

"ఎందుకేనా మంచిది ఉత్తరం ముక్క ఒకటి ఇప్పుడే పోస్టులో పడేస్తా "అంటూ బలభద్రం కార్డురాసి పోస్టులో పడవేశాడు.

సన్నిధిరావుకి ఉత్తరం అందింది. భార్యయైన తులసెమ్మతో "ఏమేవ్! కోడలు ఎల్లుండి బయలుదేరి వస్తుందిట!" అన్నాడు కొడుకైన చెన్నారావుకూడా దగ్గరే ఉన్నాడు.

"వెంట ఎవరు వస్తున్నారు?" అని అడిగింది తులసెమ్మ.

"ఎవరేమిటి? మీ వియ్యపురాలు" అన్నాడు సన్నిధిరావు.

"సరే? బాగానే ఉంది! అన్నిటికీ ఆవిడే కాబోలు పెద్ద! మగపనులకీ, ఆడపనులకీ కూడా! ఇంటిలో ఆయన గారేమి పాటుపడుతున్నాడు. తాను వచ్చి దిగబెట్టి పోరాదూ!" అంది భార్య.

"ఏమో వాళ్లకేమి ఇబ్బందులున్నాయో, మనకేమి తెలుస్తుంది!" అన్నాడు సన్నిధి రావు.

"పిల్లకి పెళ్ళిచెయ్యడమే మొదటి ఇబ్బంది" అంది తులసెమ్మ.

"కోడలికి ఏమేమి మప్పుకుంటావో, ఏమిటో" అన్నాడు సన్నిధిరావు.

"మొక్కప్పుడు కాకపోతే మానప్పుడు వంగుతుందా ఏమిటి!" అంది భార్య.

చెన్నారావు తల్లిదండ్రుల సంభాషణ వింటూ గ్రహిస్తున్నాడు.

"మనకి పేరు ప్రతిష్ఠలు తెచ్చేదే అవుతుందో, రాలుగాయే అవుతుందో!" అన్నాడు సన్నిధిరావు.

"అయ్యగారు నెత్తిని ఎక్కించుకోకుండా ఉంటేసరి!" అని కొడుకువైపు చూసింది తల్లి.

కొడుకు అర్థంచేసుకొని ఊరుకొన్నాడు.

"మొదటినుంచి ఖాయిదాలో ఉంచితేనే మాట దక్కడం?" అన్నాడు తండ్రి కొడుక్కి కూడా సలహాగా.

"గీచిన గిరి దాటకూడదు మరి. ఇంతకీ మనం లొంగతీసుకోడంలోనే ఉంది... మెత్త, మెత్త, మెత్త, మెత్త అంటే మెడ ఎక్కి కూర్చోమంటున్నారు కమోసు అనుకొని మెడమీద ఎక్కగా కూర్చుంటుంది" అంది తులసెమ్మ.

వీధిగుమ్మంలో తపాలా మనిషి 'సా-ఆ-ఆ-ఆ-ర్" అని పిలవగా, చెన్నారావు వెళ్ళి ఉత్తరం అందుకొని లోపలికి వచ్చి "అమ్మాయి ఇవాళ సాయంత్రం వస్తుందటేవ్!" అన్నాడు.

"బాగుంది!" అంది తల్లి.

"ఇంకేం! ఇటు కూతురు, అటు కోడలు వస్తూంటే మళ్లీ ఇల్లు కలకలలాడుతూంటుంది" అన్నాడు తండ్రి.

"పిల్లలేక ఇల్లు చిన్నబోయిందమ్మా!" అంది తల్లి. తర్వాత కోర్టుపనిమీద సన్నిధి రావు వెళ్లిపోయాడు. చెన్నారావు టైపు, షార్టుహాండు నేర్చుకొంటున్నాడు. అందుచేత అతడు ఇన్‌స్టిట్యూట్‌కి వెళ్లిపోయాడు.

తులసెమ్మ కూతురుపేరు సింగమ్మ. ఆ అమ్మాయికి పదిహేనేళ్లు ఉంటాయి. పెళ్ళికోసం సంబంధాలు వెతుకుతున్నారు. కాని ఇంకా ఎక్కడా కుదరలేదు. తులసెమ్మకూ తొందరనో ఏమో మరి! ఆ అమ్మాయి అన్నివిధాల తల్లి పోలికే అని చెప్పుకొంటారు.

బలభద్రం భార్యని కూతురిని పడవ ఎక్కించాడు. చిటపట చినుకులు మొదలు పెట్టగా గొడుగు విప్పి ఇంటికి చేరుకొన్నాడు. హోరుమంటూ వర్షం కురిసింది. రాధారి పడవలో ప్రయాణికులు నానా ఇబ్బంది పడ్డారు పాపం. కళాసులసంగతి వేరే చెప్పనక్కరలేదు. జారుడు కాలవగట్టు మీద పడడం లేవడం!

వాకిటిలో బండిఆగగా చెన్నారావు ఇవతలకి వచ్చిచూసి "రాజోలు నుంచి వచ్చిందేవ్, మీ వియ్యపురాలు" అంటూ తల్లికి చెప్పాడు. "రాకేంచేస్తారు! నుయ్యా! చెరువా!" అందితల్లి.

రామామణి గుమ్మంమెట్లు ఎక్కి గడప దగ్గరనిలుచుంది. తులసెమ్మ వీధిగుమ్మం దగ్గరకి వెళ్లి "కుడికాలు పెట్టితల్లీ!" అంది.

రామామణి పమిటికొంగు పళ్లలో పట్టుకొంది.

తలఎత్తి చూసింది బంగారమ్మ.

మగవాళ్లు భోంచేసి వాళ్ల వాళ్ల పనుల మీద వెళ్లిపోయేరు. అమ్మలక్కలు వడ్డించుకొన్నారు. భోంచేస్తున్నారు. సంభాషణ తిరిగి తిరిగి పెళ్లిలో మంగళహారతి పళ్లెం మీదికి వచ్చింది.

"ఏదయినా, మీకున్న గడుసుతనం మాకు లేదు" అంది తులసెమ్మ.

"ఏంచేత?" అని తెలియగోరింది వియ్యపురాలు.

"లగ్గంనాటి మంగళహారతి పళ్లెంలో పాతిక రూపాయల డబ్బులేనా చేరలేదని మాపిల్లగోల పెట్టింది" అంది తులసెమ్మ.

"పోనీ, మీపిల్లకి ఇయ్యకుండా మీరే తీసుకోలేక పోయేరా?" అంది వియ్యపురాలు.

"అయితే ఇహ ఆడపడుచుకి ఏమీ ఇయ్యనక్కరలేదంటారేమిటి?" అంది తులసెమ్మ కూతురు.

"ఇయ్యవద్దని చెప్పడంలేదమ్మా. లగ్గం నాటి మంగళహారతి పళ్లెం ఆడపడుచుకే విధిగా ఇయ్యాలని ఆచారం లేదుకదా!" అంది వియ్యపురాలు.

"సదస్యంనాడు మంగళహారతి పళ్లెంలో మేము వేసింది చూడండి! ముప్పై పడవేశాము. మీలెక్కని వేస్తే ఇరవైతో సరిపుచ్చవలసిందే!" అంది తులసెమ్మ!

"అంతే చెయ్యలేక పోయేరా" అంది వియ్యపురాలు.

"ఒకరు చెప్పుకోరికితే, ఒకరు సిద్ది కొరుకుతారా?" అంది తులసెమ్మ.

(26-వ పేజీ చూడుడు)



దొంగమొహం

శ్రీ మా. గోఖలే

కుంటికాలు దొంగపాపడు వొంటి పక్షి. పాపడిమొగం దొంగమొగానికి మల్లేవుంటదని సానామంది పాపణ్ణి దొంగపాపడంటారు. దొంగమొగాలకి పెళ్లిళ్లుకావు; పెళ్లేగాంది పిల్లలు మటుకు యాణ్ణుంచి వొస్తారూ? మొదలు పాపడికి నా అనేవోళ్లుంటమే పెద్ద అనుమానమైనయిసయం. అసలు పాపడు ఏ జనమలోనో బహు పాపంచేసుకునుంటాడు. అందుకే వాడ్డి దొంగమొగం.

కుంటికాలు పాపడి కడుపు కొట్టింది. మరి ఎప్పుడేం పాపకరమం జేసుకుంటే ఏ దేవుడేం ఆ కాలుకొత్తా అట్టజేసిపొయ్యాడో-మొత్తానికి అదేదో జబ్బులో తన కాలు కాత్తా కొటికికూటికి కొకుండా పడిపోయిందని సెప్పుకుంటాడు పాపడు.

ఆ వూరి బజాల్లో తింటానికి కొత్తే వన్నా దొరుకుద్దేమోనని కుంటికాలు యీడ్చుకుంటా పద్దాకా మలుపులన్నీ తిరుగుతా వుంటాడు పాపడు. తనది దొంగమొగమని ఆరీరు సెప్పుకుంటుంటే సానాసార్లుయిన్న పాపడు ఎందుకయినా మంచిదని పెకండెవాతో మొగం సానామటుకు సాటుసేసుకుని తిరుగుతా వుంటాడు అటిటు బిత్తరసూపుల్లు సూసుకుంటా.

ఓనాడు సందెసీకట్లో ఎంకటసుబయ్యగోరి యింటి ముంగలగా కాలుయీడ్చుకుంటా ఎల్తుండాడు పాపడు. అప్పటిదాకా మూసుకునుండ తలుపు పెటేమని తెరిసి తుస్సుబుస్సు నుంటా గుమ్మంలోంచి తల బయిటికిబెట్టి ఒక శేమయిన సీదరించుకుంటుండది ఎంకటసుబ్బయ్యగోరి పెల్లాం సీతామా లచ్చుమమ్మగోరు.

తోకుమీద సరిచి లేపినట్టు సీతామాలచ్చుమమ్మ దూకుడుకు ముంగల కొత్తె అదిగి పడ్డా ఎంటనే తెప్పరిల్లుకుండ పాపడు 'హొండంటి కాపరానికి ఏం సిక్కులొచ్చిపడ్డయ్యో' అనుకుండాడు మా లచ్చుమమ్మను కొత్తె నిదానంగా సూసి.

"ఎవర్రా పొయ్యేదీ?" అంది మా లచ్చుమమ్మ బరిసె యిసిరేసినట్టు.

"నేనేలే దొర్సానమ్మగోరూ, పాపణ్ణి." అన్నాడు పాపడు కొత్తె అరుగు దగ్గిర కొస్తా.

"మీద కొస్తావేం కాస్త దూరానచావు-అయినా అసలీ మనిషితో ఎట్టా కాపరం చెయటం? రామరామరామ ఓ పెళ్లాం, పిల్లలూ, కొంపా గోడూ - అసలు ఏదీ పట్టించుకోకుండా తుడిచేసుకుపోతుంటే నా బొంద నేనేం వెలగబెట్టనూ యీ కొంపలో? వుద్యోగ్యం సద్యోగం లేకపోయినా వూహా ఆ వీధులన్నీ ఆ పాడుం ముక్కెసుకుని బలాదూరు చుట్టి రావుంటే సరి అదే మనకు యిహం, పరం! వూళ్లో వాళ్లేం కాపరాలు చేసుకోటంలా? వాళ్ళకూ పెళ్లాం బిడ్డలేరూ? అవ్వ, ఎవళ్ళన్నా వింటే యిట్టే నవ్విపోతారు! యింటికొచ్చేసరికి అన్నీ అమరిగ్గావార్చి సిద్ధంచేస్తే బ్రునచిది, బ్రేవుమని త్రేణ్చి శతకోలు వర్తించుకుంటూ పవళించేసరికి జన్మలు తరించిపోతుండె! వూం, వారుస్తారు సిద్ధంగా! ఒక్కటంటే ఒక్క పదార్థం యింట్లో మంటబెట్టరు, తింటానికి అన్నీ వొర్రగావుండాలి! బొందమీద ఇంత బెల్లంగడ్డ పారేసిపొమ్మని వారంరోజుల్నుంచి కోడై కూస్తున్నా, ఏదీ?" అనావజాన ముంగలంలో పేలాలు ఏపినట్టు పెటపెటలాడిస్తుండది మా లచ్చుమమ్మ.

"పుల్చులో బెల్లం పడకబోతే దాని రుచేపోయె!" అన్నాడు పాపడు బెల్లం మాట యినేతలికి.

"ఎవర్రా నువ్వూ చుంచుకు మల్లే అక్కణ్ణుంచున్నావూ చీకట్లో కనపడకుండా?" అన్నది మా లచ్చుమమ్మ పాపణ్ణి అప్పుడికప్పుడు సూసినట్టు.

"నేను పాపణ్ణి గదటండి దొర్సానమ్మగోరూ." అన్నాడు పాపడు.

"పాపం బద్దలయినట్టే వుంది - ఒరేయ్ పాపడూ?" అన్నది మా లచ్చుమమ్మ పాపణ్ణి నిలువునా చూస్తూ.

"యీలాగే వుండా దొర్సానమ్మగోరూ." అన్నాడు పాపడు మనిషి నిలదొక్కుకుంటా.

"యీాయ నేడున్నా కనుపించారట్రా నీకూ?"

"యీాయి నెవరండి దొర్సానమ్మగోరూ?" అన్నాడు పాపడు.

"నా బొందా నీ బొందా - మా వారు ఎక్కడన్నా కనుపించారట్రా?"

"అబ్బే, అగుపిస్తే సెప్పనంటండి దొర్సానమ్మగోరూ?" అన్నాడు పాపడు.

"ఎక్కడన్నా వూరేగనీ - యిదిగో పాపడు, పాపడూ నీకు పుణ్యముంటుంది కాస్త ఆ వెంకటస్వామి కొట్టుకువెళ్లి ఓ సవాపావుబెల్లం మా అయ్యగారి పేరుచెప్పి తెచ్చిపెడ్తావుట్రా?"

"అబ్బే, అదెంత పనండి దొర్సానమ్మగోరూ యిమానం ఎల్లినట్టు ఎల్లిరానూ."

సీతామాలచ్చుమమ్మ బెల్లంకోసం గుమ్మంలో అటనే కూకుండది.

"ఈ శూద్రనుఘన్నాసివాళ్లనంతా బతిమాలాల్సిన ఖర్మం పట్టిందంటా? పులుసులోకి బెల్లంలేకబోతే యీ అడ్డమైన అంటపక్షులా యిహదికూ-అవ్వ వెంకటసుబ్బయ్య తండ్రీ-" అంటూ తపన పడ్తుండ మా లచ్చుమమ్మ యింకూసేపిట్లో పాపణ్ణి సూసింది.

"ఏమిరా యిచ్చిచచ్చారట్రా బెల్లం-ఏదీ చూద్దాం-అదేమిటిమీద పడ్తాడా ఏం ఖర్మ-అక్కడ కిందపెట్టిచావు-యిదే మిటే బరువేలేదేం! ఎంతదిరా యీ బెల్లం?" అంది సీతామాలచ్చుమమ్మ పాపడు తెచ్చిన బెల్లం చేతికి తగిలే తగలంగానే అటనే దిగజారిపోతూ.

"ఎంకటసామి యిచ్చింది అటనే తెత్తినిగా!" అన్నాడు పాపడు సేతులు మెలిక లేసుకుంటా.


"ఎంతని చెప్పి యిచ్చాడ్రా వెంకటస్వామి?" అంది సీతామాలచ్చుమమ్మ వూపిరి బిగబట్టి.

"తవురు చవాపావు తెమ్మంటిరీ అయిన చవాపావు తూసియిచ్చె, యింతలో ఏమయిద్దీ?" అన్నాడు పాపడు.

"అయ్యో యిక నేనేం జేతునూ - యిది సవాపావు బెల్లంట్రా దొంగపక్షీ? అసలు పొట్లం అట్టాకట్టివుంటేనే అనుకున్నా ఖర్మకాలిందని! ఎంత తిన్నాడో ఏమో! కొరికి తిన్నాడా ఏమిటి ఖర్మ? ఎంగిలి మంగలం-

(21-వ పేజీ చూడండి)

కథానిక:



బ్రిటిష్ రాజసింహాసనంకింద ఉండే రాతిపలకను ఎవరో ఎత్తుకునిపోయినారు. దానిని స్కాట్లండ్ జాతీయవాదులు ఎత్తుకునిపోయి ఉంటారనీ, దానికి చాలా మహత్యం ఉన్నట్లు వాళ్ళు నమ్ముతారనీ కొందరు ఇంగ్లీష్‌వాళ్లు ఆరోపించారు. దానిని తాము ఎత్తుకుని పోలేదనీ, తమ దేశానికి చెందిన ఆవస్తువును ఎత్తుకుని పోవటానికి తాము వెనకాడేది లేదనీ స్కాచ్ ప్రజలు కొందరు జవాబిచ్చారు. కాని అది మాత్రం ఇంకా దొరకలేదు.

ఈవిషయంమీద ఏమయినా రాస్తే బాగా ఉంటుందే అనుకుంటూ విశ్వరూపం విలేఖరి మేను వాలుస్తాడు.

*　　*　　*　　*

(అకస్మాత్తుగా విలేఖరికి ఏదోవింత భవనం కనిపిస్తుంది. పరకాయించి చూడగా అదొక పెద్ద సభామందిరంగా ఉంటుంది. దానికి ఒక పక్కన ఒక పెద్ద సింహాసనం, దానికింద మెట్లమీద ఒక రాజవేషధారి కూర్చుని ఉంటారు. సింహాసనానికి బిగించబడ్డ రెండు వరసల బొమ్మల్లో కొన్ని కనిపించటం లేదు)

రాజవేషధారి (తలెత్తి) :—ఎవరది అనుమతి లేకుండ వచ్చారే! ఎవగురా అక్కడ!

విలే : దయచేసి మీరెవరో ముందు చెప్తారా?

రాజు (ఆశ్చర్యంతో):—మేమెవరమో తెలియదూ?

విలే : క్షమించండి, మీదర్శనం దొరకటం నాకూ వింతగానే ఉన్నది. ఒక్కసారికళ్లు తెరిచేటప్పటికి మీరుకనిపించారు

రాజు : (కొంచం ఆలోచించి, పకాలున నవ్వాడు)

విలే : ఏమిటి స్వామీ?

రాజ : మీరు ఇక్కడికి రావటంకొత్త. అందుకని నన్ను తెలుసుకోలేక పోయినారు. మమ్మల్ని భోజమహారాజు అని పిలుస్తారు.

విలే : అయిన నిచ్చట దిగాలుపడి కూర్చుంటిరేల— అయ్యయ్యో! ఎప్పుడూ లేని ఈ కవిత్వం నాకు పట్టుకున్నదేమండీ.

భోజ : భోజరాజు ముఖంచూస్తే-

విలే : కవిత్వమేనా ? కవిత్వప్రాప్తి-

భోజ : (చిరునవ్వుతో) అయితే మీరు అటులిరిగి కూర్చుని మాట్లాడండి - మీరు విక్రమార్క చక్రవర్తినిగురించి విన్నారా?

విలే : భట్టీ విక్రమార్కులకథలు చదివానండీ.

భోజ : సింహాసన ద్వాత్రింశిక చదవలేదూ?

విలే : ఆ భాగ్యంపట్టలేదు.

భోజ : అయితే వినండి. విక్రమార్క మహారాజు మహాధర్మపరుడు. కాలక్రమేణా ఆయన సింహాసనం- ఇదుగో ఇదే- భూమిలో కప్పబడి పోయింది. పైదిబ్బమీద కూర్చున్నా సరే- సింహాసనం మహత్తువల్ల- ఎట్లాంటివాళ్ల నోట్లోనయినా ధర్మమే పలికేది.

విలే : అట్లాగా?

భోజ : మారాజ్యంలో గొడ్లుకాచుకునే కుర్రాడొకడు, ఈ విధంగా దిబ్బమీద కూర్చునే టప్పటికి, ఎక్కడలేని తెలివితేటలూ పుట్టుకొచ్చినయ్. అదివిని, ఆదిబ్బ తవ్వించి సింహాసనాన్ని సంపాదించాను.

విలే : అయితే మీరు ధర్మాన్ని అదనంగా తెచ్చుకోవలసి వచ్చిందన్నమాట.

భోజ : ఏదయినా అనుకోవయ్యా! స్వతహాగా లేకపోతే ఇతరత్రానయినా సంపాదించాలిగదా.

విలే : అవును లెండి.

భోజ : సింహాసనం మీదకూర్చుందామని ప్రయత్నించాను. ఇంతలోకి పీటి ఇల్లు బంగారంగానూ, ఈబొమ్మలు అడ్డుపడ్డవి.

విలే : అదేమిటండోయ్ ?

భోజ : ఏముందీ? సింహాసనం ఎక్కబోయే సమయానికి ఒక్కొక్క బొమ్మ రానూ, నువ్వు విక్రమార్కుడిలో నూరోవంతుకూడా లేవు అని ఒక కథ చెప్పనూ, తుర్రున ఎగిరిపోనూ.

విలే : వాటిని సెట్టేసి ఎక్కకపోయినారా ?

భోజ : అదీ చేశాను. ఏముంది ? అన్ని బొమ్మలూ కలిసి యావత్తు సింహాసనాన్నే ఎత్తుకుని పోవాలని ప్రయత్నించినయ్. అప్పుడు వాటి కాళ్లా వేళ్లా పడి, ఆపి, విక్రమార్కుడితో సమానం కావాలని ప్రయత్నించాను. ఇంతలో మాకు మీలోకంతో ఋణం తీరింది. - ప్చ్ - చిట్టచివరకు విక్రమార్కుడి సింహాసనం ఎక్కనే లేకపోయినాను.

విలే : (బిగ్గరిగా నవ్వాడు)

భోజ : ఏమిటయ్యా, వేళాకోళం.

విలే : కోపమెందుకు బాబూ! అంత గొప్ప పండితులకు మీకు కూడా ఈ చాదస్తం ఏమిటి ?

భోజ: చాదస్తం ఏమిటి?

విలే: విక్రమార్కుడి సింహాసనం, ఎక్కితే ఆయన తెలివి తేటలు వస్తయి అనుకోటం.

భోజ: హహ్హహ్హ! అది చాదస్తం అనే వాడివి నువ్వెంత చాదస్తుడివో? మీ వేమన్న చెప్పలేదూ, 'స్థాన బలిమి కాని తన బలిమి కాదయా' అని.

విలే: అసలు—

భోజ: మీరు ఇట్లా చెపితే లాభంలేదు. అట్టే చూస్తూ ఉండండి... హ్రాం హ్రీం... ఫట్!

(పాటపాడుతూ ఒకవ్యక్తి ప్రవేశిస్తాడు. ఆయన ఛాయలో చాలసార్లు చూసినట్లు విలేఖరికి తోస్తుంది.)

వ్యక్తి:—
మంత్రి తన ఆఫీసు
మందిరము వెడలెన్ ॥
భోజరాజే ఇపుడు
పిలువనంపాడని ॥మం॥
శాఖహీనపు మంత్రికే
బల్ శాఖలన్నీ మోపులయ్యె.....

భోజ: శాఖహీనామాత్య ఇట్లారండి!

మంత్రి: నమస్కారం భోజరాజుగారూ! భోజనం అయిందా!

భోజ: ఆహా! మీదయవల్ల! ఇదుగో మంత్రిగారూ! మన స్నేహితుడికి ఈ సింహాసనం విషయంలో సందేహం ఏర్పడెది, మీరు కొంచెం—

విలే: బాబూ! ఇటుతిరిగి కూర్చోండి, ఇప్పుడు చెప్పండి.

మంత్రి: ఇదుగో బాబూ! ఈ ప్రపంచంలో మనం ముందు ఒకస్థానంలోకి ప్రవేశిస్తే, తరవాత దానిని స్థిరపరుచుకోవచ్చునని అంగీకరిస్తావా?

విలే: కొంతవరకూ నిజమేనని అంగీకరిస్తాను.

మంత్రి: ముందు ఒకచోట జేరితే, అక్కడి నుంచి పైకి ఎగబాకవచ్చును. కింది కొమ్మమీద నుంచి పైకొమ్మ మీదకు వెళ్లటం సులభంకదూ, సూదిదూరే సందుంటే దబ్బనం ఎక్కించాలి.

విలే: ఆచరణలో అది వీలవుతుందా?

మంత్రి: నన్ను చూడండి. మొదట నేను పార్టీలో ముఠాలు కట్టటం మొదలుపెట్టాను. నాయకుల బెదిరింపుల్ని లక్ష్య పెట్టలేదు. కాబినెట్ సభ్యులు నన్ను మొదట్లో తోసిరాజన్నట్లు చూశారు కాని, తరవాత తట్టుకోలేక పోయినారు. పార్టీవిప్ చేస్తామన్నారు. ఊహుఁ! నేను వినలేదు. మళ్లీ కాబినెట్ని మార్చేటప్పుడు ఒక శాఖ ఇస్తామన్నారు. అప్పుడు ఊహుఁ అన్నాను. పార్లమెంటరీ సెక్రటరీగానో, స్టేట్ మంత్రిగానో చేస్తామన్నారు. నేను ఒప్పుకోలేదు.

విలే: మొత్తంమీద చాలా గట్టివాళ్ళేనండీ!

మంత్రి: అవును. ఆ తరవాత మనల్ని కాబినెట్లో చేర్చుకోక పోతే లాభం కనిపించలేదు. చివరకు పోర్ట్ ఫోలియో లేని మంత్రిగా చేశారు.

విలే: అందులో లాభం ఏమున్నది?

మంత్రి: కావలసినంత ఉన్నది. శాఖ ఉన్న మంత్రికి ఒక్క శాఖే ఉంటుంది. శాఖలేని మంత్రి అన్ని శాఖల్లోనూ వేలు పెట్టొచ్చు. తిమ్మిని బ్రహ్మి, బ్రహ్మిని తిమ్మి చేయొచ్చు- నేను హోంమంత్రిని కూడా కాబోతున్నాను. ఒక్కసారి కాబినెట్ లోకి జొరబడితే చాలు. తరవాత తతిరిగం చాల సులభం. ముఖ్యంగా మనబోటి వాళ్లకు మహాసులభం.

విలే: మీరు చెప్పింది కొంత సబబుగా ఉన్నది కాని నమ్మకం కలగటం లేదు.

భోజ: అయితే ఇప్పుడు చూడండి.

(దృశ్యం మారుతుంది. గగలాం, గగలాం అని గజ్జల కాళ్లు చిందులు తొక్కుతున్న మోత. మిలిటరీ యూనిఫారంలో జనరల్ మెకార్థర్, అతని వెనకాల రెండువైపులా చాంగ్ కైషేక్, సింగ్మన్‌రీ వస్తారు.)

మెకార్థర్:- వచ్చినాడయా,
గడబిడరాయుడు
డగ్ డగ్ డగ్లస్
మెకార్థరాయుడు
భగ్ భగ్ భగ్ భగ్ బాంబులు పేలగ.
ఘా, మా, షూ, జూ అపరమికాడో
డగ్ డగ్ డగ్లస్ మెకార్థర్ రాయడు

చాంగ్:— చాంగ్ కైషేకును
డింగ్ డాంగ్ డింగ్ డాంగ్

సింగ్మన్: సింగ్మన్ రీనీ
కుయ్యో మొర్రో, కుయ్యో మొర్రో

విలే: ఎవరు మెకార్థర్? తెలుగు నాటక ఫక్కీలో వొస్తున్నాడేం?

మెకా: తెలుగదేలయన్న
దేశంబు తెలుగేను,
నీవు తెలంగివి, నేను ఫరంగిని.

చాంగ్: వీరు ఫిరంగిని చేస్తారు.

సింగ్మన్: మాకు ఫిరంగిని ఇస్తారు.

చాంగ్ & సింగ్మ:
టూగోక్ బొమ్మలు తెస్తాము.
ఊళ్లకు ఊళ్లూదోస్తాము
పడమటి పల్లకిమోస్తాము.
డాలర్లను మింగేస్తాము.

విలే: మీరు దారితప్పి వచ్చినట్లున్నారు. మా తెలంగీలకు మీ ఫిరంగీలవసరంలేదు.

మెకా: ఫిరంగి లమ్మటానికి రాలేదయ్యా తెలంగీ! సందేహం తీర్చటానికి వచ్చాను.
వినవయ్యా చెపుతాను
వీనుల విందుగ ॥విన॥
జపానుకే నను పంపిస్తే
నేమికాడోనయి కూర్చున్నాన్,

చాంగ్: } మికాడో అయి కూర్చున్నార్.
సింగ్మ: }

మెకా: నాకు మరొక్కరి తాకీదా?
సుప్రీం కమాండ్ నా హోదా

చాంగ్: } వారికొకరి తాకీదా!
సింగ్మ: }

మెకా : యుద్ధం లేనిచో కనాంతు ఏమిటి?

పబ్బంగడవని పాోడాడేనికి?
డబ్బులుకురవని రాజ్యం ఏమిటి?

చాంగ్ :
సింగ్లు : } డబ్బులుకురవని రాజ్యం ఏమిటి?

మెకా : డబ్బులు పోసే ఎద్దులకుంపుకి
ఎర్రగుడ్డలంటే సెహాడల్!

చాంగ్ :
సింగ్లు : } ఎర్రగుడ్డలంటే సెహాడల్

మెకా : ఎర్రగుడ్డనూ ఎదుతుగ చూపితె గలగలరాలును డాలర్స్

చాంగ్ :
సింగ్లు : } జలజలరాలును డాలర్స్

మెకా : కనబడ్డవాడిని కాల్చేస్తాన్
ఎర్రరంగు నీ పులిమేస్తాన్
ఎర్రవాడి తలకాయ ఒకటికీ
వైట్ మార్కెట్లో వెయ్యివరాల్

చాంగ్ :
సింగ్లు : } ఎర్రవాడి తలకాయ ఒకటికీ వైట్ మార్కెట్లో వెయ్యివరాల్.

మెకా : ఏడుకోట్ల ఎర్రభూతాలను పేర్చి కూర్చి మాడ్చేశాన్.

చాంగ్ : ఏడులక్షల ఎర్రదయ్యాలను తీసి తన్నితగిలేశాన్

సింగ్మన్ : ఎనభైవేల ఎర్ర పిశాచాలకు పిశాచలోకం చూపించాన్.

మెకా : సుప్రీంకమాండు ఢంకా దెబ్బకు వడవడవణికెను వాషింగ్టన్.

చాంగ్ :
సింగ్మన్ : } గజగజవణికెను యూ. యన్. ఓ.

మెకా : ఈ విధంగా నన్ను తీసుకెళ్లి సుప్రీంకమాండ్ స్థానంలోకి తీసుకునివెళ్లేటప్పటికి, నాపదవిని సార్థకం చేస్తూ,
ఏకేమేకయినాన్

మెకార్థర్ ఏకేమేకయినాన్.

(గగలాం, గగలాం అని గజ్జలమోత చేసుకుంటూ వాళ్లువెళ్లిపోతుంటారు)

విలే : ఇదిగో జనరల్! జనరల్! ఇంతకీ—

ఎవరిదోగొంతు : ఎవరది పిలుస్తున్నాది?

(జనరల్ 'ఐక్' ఐసన్‌హోవర్ ప్రవేశిస్తాడు. బ్రిటిష్ ప్రధాని అట్లీ, ఫ్రెంచి ప్రధాని ప్లవాన్ అతడి వెనుకాల హంగు చేస్తూ ప్రవేశిస్తారు.

ఐసన్ : ఐకూ వెథాలె యూరపుకూ
అణుశ్రేణులకు లెథరగ
ఐకూ వెథాలె యూరపుకూ—
ఐకువెథలె అణుశ్రేణులధరగ.

కుడి యెడమల అట్లీ ప్లవాన్‌లూ అంతరిక్షమున హిట్లర్, ముస్సోలీనీ దెయ్యాలు ఆడిపాడగా, అడుగులో త్తగా తాలుకల్లగా—

అట్లీ :
ప్లవాన్ : } ఐకూ వెథాలెయూరపుకూ

(అట్లీప్లవాన్ ఐసన్ హోవర్ కి ఎదురుగా నిలబడతారు)

అట్లీ : చైనాలో మీకు కూరుకుపోతే ఇక్కడ మాపని హుళక్కి.

ప్లవాన్ : ఇప్పుడే మాపని గుటుక్కు.

అట్లీ : అసలు శత్రువూ రష్యావాడే. తొందరమీకది వద్దు.

ప్లవాన్ : దెబ్బలు మాకవికద్దు.

విలే : క్షమించాలి. ఇంతకూ మీరనేది ఏమిటి?

అట్లీ : బాంబు ఫిరంగుల తయారితో మా వ్యాపారం భల్ బాగు పడ్డది.

ప్లవాన్ వ్యాపారంభల్ బాగుపడ్డది.

అట్లీ : డాలర్ వ్యాపారంలో తొర్రలు అన్నీ పూడుకుపోయినవి.

ప్లవాన్ : చాలా పూడుకుపోయినవి.

అట్లీ : తూర్పున యుద్ధంవస్తేనా? మా మలయా మాయం కాళీ

ప్లవాన్ : ఇండోచైనా అసలే ఖాళీ

విలే : అందుకని?

అట్లీ : తూర్పువైపునా యుద్ధం వస్తూ పడమటివైపున రావాలి.

పడమటివైపున రావాలంటే స్పెషల్ ఉద్యోగి ఉండాలి.

ప్లవాన్ : సుప్రీంకమాండ్ రావాలి.

అట్లీ : అందుకోసమే ట్రూమన్‌గారూ పంపిన వీరులు ఐసన్ హోవర్

ప్లవాన్ : వచ్చిన వీరులు ఐసన్ హోవర్.

ఐసన్ : ఐసన్‌హోవర్ దెబ్బఏమిటో
కెమ్లింకుతానె చెప్పన్
మెకార్థరాయుడు, హడావుడేకాని
ప్రయోజనం పూజ్యం
చైనాసైనిక వెల్లువలోపల
తికమకలాడు మెకార్థర్.

అట్లీ : గిలగిలలాడు మెకార్థర్

ప్లవాన్ : బెకబెకలాడు మెకార్థర్

ఐసన్ : రష్యావిప్లవ వాహినికడ్డం నిలగలడు ఈ ఐసన్‌హోవర్

అట్లీ : నిలవవచ్చు మా మాంట్‌గోమరీ.

ప్లవా : నిలబడతాడాకార్పెంతీర్!

విలే : ఇందాక మెకార్థర్‌ని అడగబోతుండగా దూసుకుని వెళ్లాడు. మీరయినా చెప్పండి, మీకు అసలు అధికారులెవరు?

ఐసన్ : మా రాజులు వ్యాపారస్థులు
మా ప్రభువులు వ్యాపారస్థులు
అధికారులు వ్యాపారస్థులు.
మా గురువులు వ్యాపారస్థులు.

విలే : వారుఉండేదెక్కడ?

ఐసన్ : అట్లాంటిక్ పడమటితీరంలో ఉన్నది న్యూయార్క్ పట్నం.

అట్లీ :
ప్లవాన్ : } పేరుగన్నదాపట్నం.

ఐసన్ : ఆకాశంఅంటే మేడలు
పాతాళం చూపే గోతులు
భూతాలన్ మించే శక్తులు
గోతాలకునిండా డబ్బులు.

అట్లీ :
ప్లవాన్ : } గోతాలకు నిండా డబ్బులా!

ఐసన్ : అంకెలు తప్పకుండా లేకు న్యూయార్క్ పట్న పువీధులకు.

అట్లీ :
ప్లవాన్ : } అహా! న్యూయార్క్ పట్న పువీధులకు.

ఐసన్ : కాని –
పేరున్నది ఒక పెద్దవీధికీ
వాల్‌స్ట్రీట్ అన్నది ఆ పేరు.

అట్లీ : మాకు ఉన్నది లంబార్డ్‌స్ట్రీట్.

ప్లవాన్ : మా వీధే మిటో నే మరిచిపోయినా

ఐసన్ : వాల్‌స్ట్రీట్ కబంధులకు అరకైవేల ఫాక్టరీలు
ఆటంబాంబులు, నపాంబాంబులు
మారణ హోమపు మర ఫిరంగులు
అర నిమిషంలోనే తయార్.

అట్లీ :
ప్లవాన్ : } గుట్టలుగుట్టలు తయార్!

ఐసన్ : ఫాక్టరీలకు సరుకు
చాకిరికి కూలీలు
అమ్మటానికి మార్కెట్
మూలగటానికి డబ్బు
మాకబంధులకు కావాలి

అట్లీ :
ప్లవాన్ : } తప్పకుండ కావాలి.

విలే : అవెట్లా లభిస్తవి?

విసన్ : } యుద్ధం యుద్ధం యుద్ధం
అట్లీ : } యుద్ధం ప్రపంచయుద్ధం
ప్లవాన్ : } మరణహోమం.

విసన్ : ఇజ్రేల్ మీదికి అరబ్ దండ్లు
కాశ్మీర్ మీదకు షాక్ - ఇ - పాక్
సూయజ్ మీదికి ఇంగ్లీష్ సేనలు
ఇండోచైనలో ఫ్రాజ్ - ఇ - ఫరాస్
మలయా మీదికి గూర్ఖాగుంపులు
కొరియా మీదికి మిత్రమండలి

చైనామీదికి జపాన్ రాక్షసులు
మీదికి జర్మన్ వీరులు
నవాగినీపై శ్వేతజాతులు
ఎగిరి దూకారు.
అట్లీ : దూకుతున్నారు.
ప్లవాన్ : దూకనున్నారు.
విసన్ : ఇది అంతా కబంధతంత్రం
అట్లీ : ....లీల.
ప్లవాన్ : ....మాయ.
విసన్ : వ్యక్తిగత స్వాతంత్ర్యరక్షణకు
చాంగ్ కై, సింగ్మన్, ఫ్రాంకో, టిటోల నే
మహావీర ప్రతిష్ఠాపనం
కమ్యూనిస్టు ప్రతిఘటనోద్యమ
మహాచార్య బిరుదప్రదానం
మహోక బంధుల మహద్విలాసం

విసన్ : } యుద్ధం యుద్ధం యుద్ధ,
అట్లీ : } 'యుద్ధం'
ప్లవాన్ : }

(అంతా వెళ్లిపోతారు)
భోజ : ఈ తపోవమన దేశపు సరుకు సు
చూపండి.
(ఒకపోలీసు ప్రవేశిస్తాడు. ఒక చేతిలో
చిన్న పుస్తకం. రెండో చేతలో లాఠీ)
పోలీసు : కనిస్టేబునండీ నేను
కనిస్టేబునండీ
కునిష్ఠి జీతపు కనిస్టేబును
ఎదటివాడి కష్టాలు ,ఎరగని అధికారులకూ
దిష్టి బొమ్మను.
విశే : మీకథ ఏమిటిబాబూ?
పోలీసు : నేలాగితే మాదొక్కొడదు
పారాతప్పితే మాబతుకేమిటి
డెయరీ నింపి తేమాకుడబ్బులు.
పూరానిండదా ! మా పదొబ్బులు.
విశే : ఏమిటి. ఆడయరీ?
పోలీసు : మేము కొన్ని కేసుల్ని ఎప్పు
డూ పట్టుకుంటూ ఉండాలి. లేక పోతే
ప్రమోషన్ ఉండదు. బ్లాక్ మార్కులు
కూడా వేస్తారు. ఒక డయరీని వ్రాస్తూ కనీ
సం రోజుకి అరడజన్ కేసుల్ని ఇరికించ
చాలి.
విశే : నేరాలు జరక్కపోతేనో ?
పోలీ : ఎందుకు జరగవ్ బాబూ !అధి
కారులే దారిచూపుతుంటే, నేరాలకు
కొదవా ? అయితే గొప్పవాళ్ల నేరాలను
పట్టుకోటానికి దమ్ములుండవు అందుకని
బక్కవాళ్లని ఇరికిస్తాం.
విశే : ఏంచేస్తా రేమిటి ?
పోలీ : నేరాలు జరుగుతూఉంటే
పొంచుండి చూసి, జరగనిచ్చి తరవాత
పట్టుకుంటాం.
విశే : ఇదా మీరు చేసేది, నేరంజర
క్కుండా ఆపాలికాని ?
పోలీ : ప్రివెంటివ్ డిటెన్షన్ వద్దని
మీరే అంటారుగా ? మీ బంగారం
మంచిదే అయితే పోలీసులు ఎందుకుమీకు.
విశే : లేకపోతే మీ ఇష్టమే నంటారు?
పోలీ : కాకపోతే మరి చేసేదేమిటి
నేరస్థులనూ పట్టుకోవలె
లేకపోతే మరిగిట్టిపోవలె
అందుకోసమే మాదొక పద్ధతి
నేరాలే జరిగేట్లు చేస్తాం
పక్కన నిలబడి అన్నీ చూస్తాం
బర బర డయరీలో వింపేస్తాం
జరజర లాకప్‌లో కూలేస్తాం.
కోర్టులకీ పని ఉండాలి ?
మాకు ప్రమోషన్ అక్కర్లా ?
(లాఠీ జళిపిస్తూ వెళ్లిపోతాడు)
భోజ : ఇంకొక్కరిని చూద్దురుగాని.
(సూట్, బూట్ ధరించి ఒక వ్యక్తి
ప్రవేశిస్తాడు.)
కొత్త : యస్ ! నో ! అల్ రైట్ ! యువ
రానర్ !
మై మాస్టర్స్ వాయిస్ యువరానర్ !
మీరు చెప్పేదే రైట్ యువరానర్ !
మీతప్పే ఉండదు యువరానర్ !
విశే : మీరేం చేస్తూఉంటారు ?
కొత్త : శాఖలేని మంత్రిగారికి ప్రత్యేక
కార్యదర్శిని. మంత్రిగారికి ఏదోపని కల్పి
స్తూ ఉంటాను.
విశే : దాని అవసరం ఏమిటి ?
కార్య : మంత్రిగారి కీర్తి
దిశదిశలకే పాకుతుంది.
మంత్రిగారి ఓర్పు
సామెతల్లో ఎక్కుతుంది
మంత్రిగారి జోరు
పేపర్లను నింపుతుంది
మంత్రిగారి పేరు
పదికోళ్లలో నానుతుంది.
మంత్రిగారి పదవి
పైపైకెట్టుకి పోతుంది.
విశే : ఒక ఉదాహరణ ఇవ్వండి.
కార్య : ఊళ్లపేర్లకు గుణింతా లం
దిద్దుతాం
ఆఫీసుల్ని ఢిల్లీనుంచి దేవగిరికిమార్చేస్తాం
గుబులు తిరిగితే మళ్లీ వాటిని
ఢిల్లీకే బదలాయిస్తాం
ఇసుకలోంచి తైలాన్ని
పాలలోంచి గడ్డిని
ఊకపేని తాడుని
చెయ్యాలని సూచిస్తాం
విచారణ సంఘాలంటే చాలు
ఊపిరి పోస్తూఉంటాం
(కార్యదర్శి వెళ్ళిపోతాడు)
విశే : అబ్బ ఎంత పితలాటకం. ఒక
మనిషిని ఒక పదవిలో నిలబెడితే పొంగాకూ
తప్ప దన్నమాట. అల్లాడా అని పిలిస్తే
కూలిపోయిన తాటిచెట్టూ చటుక్కున నిల
బడుతుందంటారు ఇందుకనే కామాలు.
(భోజరాజు వైపుతిరిగి)
భోజరాజుగారూ రూరండీ మెప్పులందు
కొండీ
భోజ : నే చెప్పినదానికి ఒప్పుకుం
టారా ?
విశే : కాకేం లేదండీ మరి గద్దెనెక్క
రండీ
(భోజరాజు విశేఖరి సాయంతో
సింహాసనం ఎక్కుతాడు. వెంటనే
బొమ్మలు అతణ్ని కిందికి దొల్లించి సింహా
సనంతో పైకి ఎగురుతయ్. విశేఖరి వాటి
కాళ్లను పట్టుకుని పైకి వెడతాడు. బొమ్మల
కాళ్లు ఊడి విశేఖరికిందికి కూలిపోతూ
ఉంటాడు)

*   *   *

విశ్వరూపం విశేఖరి నిద్రలేచాడు.

★

దొంగ మొహం

(16-వ పేజీ తరువాయి)

అయ్యో నేనేం జేతునూ! పుణ్యానికిపోతే పాపమెదురైనట్టు వీధిలోకి రాంగానే యీ దొంగమొహంపక్షి ఎదురైనాగు. అయ్యో భగవంతుడా - యిదిగో వారు రానే వొచ్చారు సమయానికి - ఏం వొస్తే ఏం లాభం అంతా భగ్గున మండిపోయినాక? అసలు యింట్లోనే వుంటే నాకీ ఖర్మ ఎందుకు పట్టుండీ - ఏమండీ చూశారా యీ అన్యాయం? పులుసులోకి యింతంటే యింత బెల్లప్పుక్క లేకపోతే యీదరిద్రపక్షి యిట్లా వీధిగుమ్మందగ్గిర కనుపిస్తే పోనీగదా అని కొట్టుకువెళ్లి మీ పేరు చెప్పి సవాపావు బెల్లం తెచ్చి పెట్టిపొమ్మన్నా - ఆ తెచ్చిందంతో మీరే విచారించి యీ కాపరం యీదుకోండి, నా దార్ని నేను సెత్తిన కొంగేసుకుని ఏ కాశో రామేశ్వరమో వెళ్లిపోతా -" అన్నది సీతామాలచ్చుమమ్మ ఎంకటసుబ్బయ్యగోరు లోనకి వచ్చీ రాకతలికే.

లోనకొచ్చిన ఎంకటసుబ్బయ్యగోరు అటనే కాసేపు కళ్లు మూసుకు నిలబడి - ఎల్లి నడవ తంబానికి బోరగిలబడ్డ మాలచ్చుమమ్మనూ చిత్తరనూపులు నూత్తుండ పాపణ్ణీ ఒక్కతుణం పరకాయించి నూశాడు.

"యిదిగో, నువ్వు కాశీరామేశ్వరాలు గనక వెళ్లదల్చుకుంటే మంచిరోజు చూసి అట్లాగే రైలెక్కించి వస్తాగానీ - అయినా ఎప్పుడు చూసినా యీ పులుసులోకి బెల్లాలు లేకపోటమేమిటే మరీ యిదిగా వుంది నీతో? యిహ ఎన్నాళ్లుబోయినా కాపరం యిట్లాగే సాగించదల్చుకున్నావా ఏమిటి? ఎప్పుడు చూసినా ఏ మెరపకాయతోడిమో తక్కువయిందని నడిబజార్లోకొచ్చి గంట మోగించందిగాన్ని నువ్వు వంట చెయ్యవా ఏమిటి ఖర్మా?" అన్నాడు వెంకటసుబ్బయ్యగోరు సిరాగ్గా.

"ఎన్ని రైలెక్కొచ్చి వీధులన్నీ తిరిగి మీ గంట మోయించిరండి - అక్క ఎవరన్నా వింటే యిక్కే నవ్విపోతారు - ముందా సవాపావు బెల్లం సంగతేమిటో విచారించండి తరవాత లోపలకొచ్చి వొలకపోద్దురుగాని. అంది" మాలచ్చుమమ్మ తంబంకొణ్ణుంచి.

ఆ బెల్లం ఎంతరా పాపడూ?" అడిగాడు ఎంకటసుబ్బయ్యగోరు.

"సవాపావు యిచ్చారని యింకాకనే దొర్సానమ్మగోర్తో సెప్పానండి దొరా -"

"నిజం సెప్పు."

"తూకం ఏపియ్యండి దొరా."

"పొట్లం సహం విప్పివుంటే యింకా తూకమేమిటి నా బొండా -" అంది మాలచ్చుమమ్మ తంబంకొణ్ణుంచి.

"అ దెందుకయిందో దొరా-" అంటున్నాడు పాపడు - ఎంటనే పాపడి యీపు మీన పెట్టీపెటీమంది వరస వరసన ఎంకటసుబ్బయ్యగోరి సెయి.

మరసనాట్నుంచి వూళ్ళో సానామంది జనానికి పాపడిమొగం అచ్చంగా దొంగమొగానికి మల్లే అగుపించింది. కొన్నాళ్లకి అనుకుండాడు పాపడు తన మొగం దొంగమొగాని మల్లే వుండెదని.

* * * *

ఓనాడు కొలు లాక్కుంటూ వూరు చివరున్నండ లంబాడి కొట్టు దగ్గిరికి సేర్తుండాడు పాపడు.

"ఒరేయ్, ఒరేయ్ రాములా దొంగ పాపడు వొస్తున్నాడ్రోయ్." అంది సుబ్బులు రాములుకు కన్ను మలుపుతూ తన సేతిలో బెల్లపులడ్డు వెనక్కి దాచుకుంటూ.

"పసిపట్టినట్టొచ్చాడే పీడ్డుంపతెగా!" అన్నాడు రాములు తన లడ్డును రెండు చేతుల్లో కప్పిపెడ్తూ.

కొట్టుమీన తంబాలసాటున కూకుని నిక్కినిక్కి నూత్తుండ పిల్లకాయ రాముల్ని, సుబ్బుల్ని సల్లగా ఓనూపు నూసివొచ్చి ఆళ్లకి కొత్తె అసంటగా కూకుండాడు పాపడు మొగమిమ్మనకి కండవాలాక్కుంటూ.

సుబ్బులు రాములు కళ్లు నూసింది. రాములు ఓరగా పాపణ్ణి నూసి సుబ్బులుకు కన్ను మలిపాడు. తన లడ్డు తీసితింటూ. కొత్తె రాములుకు దగ్గరగా జరిగి పాపణ్ణి నూసీనూడనట్టు లడ్డు తీసి పంటికాడికి పోనిచ్చింది సుబ్బులు.

"ఒరేయ్ నీకు డబ్బు లెక్కడివిరా రాములూ?" అంది సుబ్బులు మెల్లిగా.

"మా నాన్నకు తెలియకుండా తెచ్చా అణా" అన్నాడు రాములు మెల్లిగా.

"తెలుస్తే చంపట్రా మీ నాన్నా?" అంది సుబ్బులు.

"బలపం కొనుక్కున్నానంటా" అన్నాడు రాములు.

"ఒరేయ్ కానీకి ఒక్క బలపంగదా యింకా ముక్కాణీ ఏంచేశావని మీ నాన్న అడుగుతే?" అంది సుబ్బులు.

"నాలుగు బలపాలు కొనుక్కున్నానంటా" అన్నాడు రాములు.

"బలపాలు ఏవంటే?"

"అనదుగా."

"అంటే?"

"అంటే బళ్ళో దస్తరంలో పెట్టుకుంటే ఎవరో ఎత్తుకుపోయినారంటా."

"అంటే వీపు పెళ్ మంటుంది."

"ఏమందులే. అంటే మా అమ్మ వుందిగా. హుఁ, మా అమ్మ లేకపోతే నే అణా తీసుకురాకేం!"

"ఒరేయ్ తెలియకుండా డబ్బులు తీసుకురావటం దొంగతనం కాదుట్రా?"

"ఆ దొంగతనమేగానీ, కోమటి అక్కమ్మ అప్పుడే లడ్డుకడ్తుంటే నోరూరిందే సుబ్బులూ - నీగ్గూడా తెచ్చిపెట్టాను గామ్మ పాపం?" అన్నాడు రాములు లడ్డు చప్పరిస్తూ.

"అవున్రా రాములూ బలే రుచిగా వుంది లడ్డు! యీసారి నేనూ అణాతెస్తే నీకూ లడ్డుపెడ్తాగా! ఒరేయ్ చూడ్రా నా లడ్డు యింకా వేడిగా వుంది." అంది సుబ్బులు రసం చీకుతూ.

"ఎహెపో నా వొంటికంతా రాస్తున్నావు-చొంగంతా" అన్నాడు రాములు.

"చొంగ కాదురా, పానకంరా!" అంటున్నది సుబ్బులు నవ్వుతూ.

"ఏం పానకమో మోచేతిదాకా కారుతున్నది-" అంటున్నాడు రాములు.

వడదెబ్బ తిన్నవోడికి నీలగాలి తగిల్నట్టు, కడుపుకాక మీన ముసుగేసు కూకుండ పాపడిముక్కుకు అదేమయిన బెల్లప్పాకం వాసనా సెవులకు సప్పరింతలూ గాటుగా తగిలేతలికి దప్పికను తట్టుకోలేక వగ్గాం తెంచుకుపడ్డ గిత్తకి మల్లే గబిక్కిన లెగిసొచ్చి రాములూసుబ్బులుకు ముంగల నిలబడ్డాడు రొప్పుతా నోటెంట నీలుగారుస్తా.

"కొత్తె ముక్క పెడ్తే తప్పేట్రా?" అన్నాడు పాపడు కళ్లు మెరుస్తా.

వూఁ-" అన్నాడు రాములు.

"అమ్మ-" అంది సుబ్బులు.

తెలవకుండానే కొట్టుమీన్నుంచి దూకిన దూకటం సందుమలుపునబడి అరుస్తా లగెత్తారు రాములూ సుబ్బులూ ఎనక్కి తిరక్కుండా.

"ఏందిరది పాపడూ?" అన్నాడు బజార్నపోయే రాగవయ్య.

"పిల్లవెంటపడ్డాడూ." అన్నాడు బజార్నపోతుండ బసవయ్య.

"పసిపిల్లలు భయపడి పరిగెత్తుతుంటేనే!" అన్నాడు బజార్నపోతుండ కనకయ్య.

"ఎహె దొంగమొగాన్ని లంబాడికొట్టోపదేదాకా ఓ పోటు పొడవండసె చూస్తారు?" అన్నాడు ముల్లుగర్రతో పొలంబోతుండరాం కిట్టయ్య.

* * *

అనాడు పాపడివొళ్లు కొంకతగిల్నట్టు గుంది. లంబాడికొట్టు మీనగోడకు అదుము కుని కండవా కప్పుకుని కొత్తెకొత్తె వొను కుతా ముడుసుక్కూకుంటాడు. బయట ఓ పక్క నెలవంక పొడిసి ఎన్నెల అగుపిస్తుంటే యింకో పక్కనించి మేగాలుకమ్మి గాలి యిసుర్లో వానతుప్పర పడ్తుంటది.

తన బతుకు ముదనష్టకంగా వుండనుకుంటాడు పాపడు. యీ పెపంచకంలో రెక్కలిర్సుకుని కట్టపడే వోడి బతుకే అంతంతమాత్రం; యింకుంటిపచ్చితన బతుకింకెట్టుండాల? అమ్మ బతికుంటే ఇప్పుడు తనకి ఎట్టున్నేదో? అమ్మ బతికుండప్పుడు తనకాలు యింకా. పడిపోలామార్కెట్టులో కూల్నాలిసేసుకుని బీడీముక్క గిడీ ముక్కకు కాణీ, అర్ధణాపోయినా దినానికి అర్ధరూపాయో పదణాలో అమ్మ సేతిలో పెట్టేవోడు తను. అమ్మ దొగ్గిలాకు పుల్సు కూర ఎంత కమ్మగాసేసేది! కారం మెకుకులు పెట్టినాకడు పునింజేది. హుం-సచ్చి యాడుందో! నా పెల్లికని-మరి ఎట్ట కూడబెట్టిందో ఏమో యిరవై రూపాయిబిల్లలు దారంసంచీలో గట్టిగాకట్టి యాడోనక్లో పెట్టిందంట! అట్నె కొత్తా ఎలికలు యీడ్సుకుబోయి నయ్యని ఓనాడు లబలబమంది. సేసింది తెలివితక్కువ పనయితే ఏడవటం దేనికని నేనంటే యినకనే పోయిందిగా? యిగ అటనే రాలిపోయింది నా పెల్లి కాలేదనుకుంటా. పోటమే మంచిదయిందిలే - ఒకటికి రెండు పానాలు అడుక్కుదింటా మాట్టం దేనికి? అయినా అమ్మ ఏమూర్తాన పోయిందో ఆనాట్నుంచే తను దిక్కులేని పచ్చయిపోయినాడు. తన కాలు పడిపోయింది. కాలు పడిపోకుండా ఎనుకంటి వైద్దికం సేత్తే నయమవుద్దో. వైద్దికుడికి తెలవాల్సిందేగాని తనకెట్ట తెల్సుద్ది? యింతకీ తన మొగమ్మీన ఏందో రాసుండది. అట్ట రాసుండక నేబోతే పెత్తోరూ తన మొగం కల్లి అట్టెందుకు సూత్తారూ? అనుకుంటా కొకరిచ్చి వుమ్మూసి, కండవాయింకొత్తె బిగలాక్కుని వొనుకుతా కూకుంటాడు పాపడు.

ఈదురుగాలి కొత్తె తగ్గి వానజల్లు సాగింది. నెలవంక మబ్బుల్లోకి దూరి అటిటు లగెత్తుండది. ఎవురో కర్రపోపు మీన వొంగిపోయి వొనుకులు పక్కడొంక మలుపుతిరిగి సల్లగా రాటం సొష్టంగా సూశాడు పాపడు.

సుందు నాయకుల కక్క జొంరుకుంది ఆ మడిసిని సూశి. ఆ మడిసి మాట్టాడకుండా వొచ్చి లంబాడికొట్టుకాడ ఆగింది.

"యీ కొట్టుమీన కూకుంటే ఎవురేం అనరుగా?" అండా మనిసి కొట్టు అరుగు ఎక్కుతా.

"కూసుని సూత్తే అదే తెల్సుద్ది" అన్నాడు పాపడు ఆ మడిసిని యిడిక కుండా. అటనే సూస్తా. గొబ్బిరికీసు పాయలు దీసినట్టు ఆ మడిసి జుట్టు అట్టుండదే యనుకుండాడు పాపడు.

సన్నగా తీగకి మల్లే వొంగిపోయిన ఆ మడిసి సల్లగా ఆ కొట్టు మూలకిసేరి గలగల మంటూ ఏందో సంచీకి మల్లే దింపుకుని ఆడే నక్కకూకుండది.

"ఏవూరేం?" అన్నాడు పాపడు కొట్టు మూలకి సూస్తా.

"ఏవూరయితే ఏం బాబూ యింత అడుక్కుదింటానికి?" అంది ఆ మడిసి.

"చరేలే! అయితే అడుక్కుదింటాని కన్న మాట నువు యీడకి సేరింది - అయితే చరేలే! అన్నాడు పాపడు.

"ఏం బాబూ అట్టంటావ్? నాబోటోరికి యాణ్ణోకాడ అడుక్కుదినకబోతే ఎట్ట గడుసుద్ది బాబూ?" అంది ఆ మడిసి.

"బాదేంది బాబూ? యీడ యీ లంబాడి కొట్టుమీన బాబు లెవురయినా యిట్ట వొనుకుతా కూకుంటారెట్టా? యిప్పుడంటే అన్నావుగానీ తెల్లారి లెగిసినాక నన్ను బాబు గీ బనమాక. నీ పేరేందేం?" అన్నాడు పాపడు.

"జుత్తుపోలి" అంది జుత్తుపోలి.

"యిహోయిహో-మూ బాగుందిలే" అంటా నవుకుండాడు పాపడు.

మరసనాడు తెల్లారంగానే జుత్తుపోలి జోలి తగిలించుకుని ఓసేత్తో తాడుగట్టిన చీనా రేకుడబ్బా, యింకో సేత్తో కర్రా పట్టుకుని ఒంటెకి మల్లే మెడ జాపుకుంటా వూళ్ళోకి నడిసెల్లింది.

"తసరియ్య ఆడగూతురంటే అట్టుండాల!" అనుకుండాడు పాపడు.

మరదేందో జుత్తుపోలిని ఆటే సూత్తుండ కొద్దీ పాపడికి కడుపులో ఏళ్లుబెట్టి కెలుకుతుండట్టయితుండది. అట్ట ఒంటెకి మల్లే పెతిదినం ఎల్లి అడీడ ఏం గిరుకొచ్చుద్దో ఏమో ఆ మూలకి సేరి మాట్టాడకుండా, సప్పుడికాకుండా కూకుని ఏందేందో సప్పరిత్తున్నట్టుండది. అడుక్కుదిసేదానికి అంత సాటు దేనికి? పాడబడి పీక్కుదింటారెట్టా? అడుక్కుని యింత దొరికితే తినేదీ లేకబోతే పస్తుపండుకు నేదీ, అంతే గాని అడుక్కుదినేవోరికాడ ఎవురన్నా గిరుకుదింటారెట్టా? మరియిగనేంది యీ జుత్తుపోలి? అడుక్కుదింటానే తనని నీడ రిచ్చుకుంటుండది. ఏ వూరన్నా ఎల్లి అడుక్కుదింటే బాగుండు జుత్తుపోలి. వుండట్టుండి పాపడికి అనుమానం ఏసింది. జుత్తుపోలి తన మొగాన్ని వూళ్ళో వోరికి మల్లే నే సూత్తుండదని - కడుపులో కెలికినట్టయింది పాపడికి.

ఆ రేత్తిరి యీదురుగాల్తో వానజల్లు పడ్తుండది వొనుకు పుట్టిస్తూ. ఆ రోజంతా పొండుకున్న పాపడు లెగవలేదు. సీకటి పడ్డాక వొకటిరెండుసార్లు కళ్లు దెరిసి కొట్టు మూలసూత్తే జుత్తుపోలి అగుపించలా. ఆపైన మత్తులో వొల్లు తెలవలేదు పాపడికి.

ఎంతరేత్తిరయిందో ఏమో - ఏందో సల్లగా తగిల్నట్టయింది పాపడికి. కళ్లు దెరిసి సూశాడు పాపడు. ఒక యిగ్రహం తన పక్కన కూకుని సల్లగా తాకుతుండది. ఒక్కపాలి పాపడి నోరు తడారిపోయింది.

"ఎవరూ-?" అన్నాడు పాపడు యిన పడకుండా.

"నేనేలే జుత్తుపోలిని. ఘయ్యాల ఏం తిన్లేదానువ్వూ?" అంది జుత్తుపోలి.

నోటమాట రాటంలేదు పాపడికి. తన వొంటిమీన జుత్తుపోలి సెయి సల్లగా జివ్వుజివ్వులాగుతుండది!

"లెగు-నాకాడ పుల్సుముద్ద వుండది తిందువుగానిరా." పాపడి రెక్కపట్టుకుండది జుత్తుపోలి.

తన ఒల్లు ఎందుకో వొంగుతుండ దనుకుండాడు పాపడు. తనని జుత్తుపోలి ఎలేసిందనుకుండ పాపడు సీకట్లో జుత్తుపోలి మొగం కల్లి సూశాడు.

సల్లగా సెయిపట్టుకుని కొట్టుమూలకి నడిపిచ్చుకెల్లింది పాపణ్ణి జుత్తుపోలి.

★

సినిమా వార్తలు

సారథీవారి

అగ్నిపరీక్ష

[తెలుగు జానపదచిత్రం]

★

సారథీవారి నూతన జానపదచిత్రం "అగ్నిపరీక్ష" ఏప్రిల్ 4 న మద్రాసు శ్రీకృష్ణా టాకీస్‌లో పత్రికా విలేఖరులకు చూపబడింది. ఉగాదికి విడుదలకానున్న ఈ చిత్రంలో రఘురామయ్య, సి. యస్. ఆర్., శివరావు, రాజ్యం, మాలతి, లక్ష్మీకాంత, రేలంగి, కనకం, రామ్మూర్తి, సీతారాం మొదలైనవారు నటించారు.

కథానాయిక అయిన సుశీల నిప్పులో దూకి తన పాతివ్రత్యాన్ని నిరూపించుకుంటుంది గనక "అగ్నిపరీక్ష" అని చిత్రానికి పేరు పెట్టారు. సుశీల పాతివ్రత్యమే కథలో ప్రధానాంశం.

ఉజ్జయినీ యువరాజు కుమారవర్మ కళావతి అనే వేశ్యను ప్రేమించి తన భార్య సుశీలను చూడ నిరాకరిస్తాడు. సుశీల అందచందాలకు యువరాజు చలిస్తాడేమోనని కళావతి సుశీల చిత్తరువులో సుశీల కుడి కంటిలో మచ్చ ఉన్నట్టు చిత్రించి ఆమె అవలక్షణవతి అని యువరాజుకు తోపిస్తుంది.

యువరాజు తల్లికికూడా తన కొత్తకోడలిపై కోపమే. ఆమె తన కొడుక్కు తన మేనకోడలైన రూపవతిని చేసుకుందామనుకున్నది.

యువరాజు బాల్యస్నేహితుడు శంకరవర్మ ఒక్కడే యువరాజు కాపురం చక్కబెట్ట చూస్తాడు. కారణం - యువరాజుకు పూర్వం కళావతి శంకరం స్నేహితురాలు.

భర్తపై ఆశ వదులుకొని సుశీల ఆత్మహత్య చేసుకోబోతుంది గాని ఆమె అభిమానదైవం నాగరాజు ఆమె కాగండం తప్పిస్తాడు. తరవాత ఆమె అత్తగారిచే బాధలు పడలేక అడవులపాలైపోతుంది.

కళావతిని మరొకవిధంగా స్వాధీనం చేసుకోలేక శంకరం యువరాజుకు మత్తుమందిప్పించి నౌకర్ల చేత అడవిలో యువరాజును వదిలిపెట్టిస్తాడు. యువరాజు జాడ కానక కళావతి అడవులపాలవుతుంది. ఆమెను వెతుకుతూ శంకరం, కళావతి తమ్ముడూ కూడా అడవులవెంట పడతారు.

కుమారవర్మ మేనమామ కూతురు రూపవతికూడా తన చెలికత్తె లవంగితో సహా పురుషవేషం ధరించి అడవులకు వస్తుంది. ఆమె తలిదండ్రులామెకు వేరువేరు సంబంధాలు నిశ్చయించటమే ఆమె అడవులు పట్టటానికి కారణం.

యువరాజు కుమారవర్మ రూపవతికి దొరుకుతాడు. ఇరువురూ ప్రేమించుకుంటారు. ఈలోగా రూపను పెళ్ళాడాలని వచ్చిన జయవిజయులు రూప తప్పించుకుపోయిందన్న కోపంతో ఆమె తల్లిదండ్రులనూ, మంత్రినీ ఖైదు చేస్తారు. మంత్రి ఖైదు తప్పించుకుని రూప ఉన్నచోటికి వెళ్ళి వార్త తెలుపుతాడు. రూపతో సహా కుమారవర్మ వచ్చి తన మేనమామనూ భార్యనూ విడిపించి జయవిజయులను సాగనంపుతాడు.

అరణ్యంలో కళావతికోసం వెతికే శంకరానికి సుశీల కనిపిస్తుంది. అతడామెను కామించగా నాగరాజే కుమారవర్మ రూపంలో వచ్చి ఆమె వెంట ఉంటాడు. ఆయన మహాత్మ్యంవల్ల శంకరం కుక్క అయిపోతాడు. కళావతికి కళ్లు పోతాయి.

తానే భర్త అనుకుని అడవిలో సకల కష్టాలూ పడే సుశీలను చూసి నాగరాజు జాలిపడి ఆమెను ఉజ్జయినికి తీసుకుపోయి అక్కడ తన పట్టాభిషేకానికి ఆహ్వానాలు పంపుతాడు. ఈ ఆహ్వానం అందగానే రూప తనవెంటఉన్న కుమారవర్మ మరొకడని అనుమానపడుతుంది. ఆమె సందేహం నివృత్తి చెయ్యటానికి కుమారవర్మ ఆమెతో సహా ఇంటికి వస్తాడు. నిజమైన కుమారవర్మ సభలోకి రాగానే అతని రూపంలో సింహాసనంపైఉన్న నాగరాజు అంతర్థానమవుతాడు. తన భార్య సుశీల మరెవరితోనో జీవిస్తున్నదని కుమారవర్మ శంకిస్తాడు. సుశీల అగ్నిప్రవేశంచేసి తన పాతివ్రత్యం నిరూపించుకుంటుంది. నాగరాజు దర్శనాన శంకరానికి కుక్క రూపమూ, కళావతికి గుడ్డితనమూ పోతాయి.

కుమారవర్మ పాత్ర రఘురామయ్య, శంకరవర్మ పాత్ర సి. యస్. ఆర్, సుశీల పాత్ర రాజ్యం, కళావతి పాత్ర లక్ష్మీకాంతా ధరించారు. రూపవతిగా మాలతీ, లవంగిగా కనకం, విజయుడుగా రేలంగీ, కళావతి తమ్ముడుగా శివరావూ, కళావతి తల్లిగా గంగారత్నం, ఉజ్జయినీ రాజుగా శ్రీవత్స నటించారు. రామమూర్తి, సూర్యకాంతం, సీతారాం మొదలైనవారు ఇతర పాత్రలు ధరించారు.

చిత్రం నిర్మించినది కోవెలమూడి భాస్కరరావు. డైరక్టరు మాణిక్యం. కామెరా బి. సుబ్బారావు. సంగీతం గాలి పెంచలయ్య. ఆర్టు వాలి. రచన తాపి. పాటలు కే. జి. శర్మ.



నారణీవారి "అగ్నిపరీక్ష"లో
లక్ష్మీకాంత, రఘురామయ్య



జెమిని - తప్వా, తప్వా - తీయున "సౌదామిని"లో శేలంగి.



రాజరాజేశ్వరి గారి ''సౌదామిని'' లో

★

అతివృష్టి

(15-వ పేజీ తరువాయి)

"ఇక్కడ చెప్పుకోరక వలసిన పనీలేదు, సిగ్గుకోరక వలసినపని అంతకన్నా లేదు" అంది వియ్యపురాలు.

"ఏమిమాట చమత్కారమమ్మా" అంది సింగమ్మ.

"ఆడపెళ్ళివారికేమి తెలుస్తాయి. ఎప్పటికేనా మా చెయ్యికిందే!" అంది బంగారమ్మ.

"అంతా అమాయికత్వమే! నోట్లో వేలు పెడితే కరవలేరు, వెన్న పెడితే మింగలేరు!" అంది సింగమ్మ.

"ఇదిగో! అమ్మాయీ! నువ్వు చిన్నపిల్లవి! నీకెందుకు ఊరుకో. పెద్దవాళ్ళ మాట్లలు నీకెందుకు! నీ ఈడుపిల్లలు అన్నిటిలోను కలిగించుకుంటే ఎలాగు!" అంది వియ్యపురాలు.

"ఇప్పుడు మంగళహారతి పళ్ళెంలో తక్కువయితే ఎవరు నష్టపోయేరు?" అని అడిగింది సింగమ్మ.

"నాకు అక్కరలేదని మీ అమ్మగారికే విడిచిపెట్టలేకపోయేవు?" అంది వియ్యపురాలు.

"అదీ మీ సలహా! బాగానే ఉంది! మళ్ళీ ఇక్కడ అక్కడా కూడా మేమే నష్టపోతాము! మీ బదులు మేము ఇచ్చుకుంటాము!" అంది తులసెమ్మ.

"ఏమో ఒక దాంట్లో ఎక్కువవుతుంది. ఒకదాంట్లో తక్కువవుతుంది. అన్నీ చూచి సరిపుచ్చుతారా ఎక్కడేనా? మీరు చేయించిన మంగళసూత్రం చిన్నది, మేము చేయించినది పెద్దది ఎవరి ఇంటి ఆనవాయితీ వాళ్ళది. దానికేం చేస్తాం చెప్పండి!" అంది బంగారమ్మ.

"ఎవరు చేయిస్తే ఏమిటి అది వచ్చేది మా అబ్బాయికే కదా! మా చేతితో మేము పెట్టుకొన్నా మాదే, పెట్టుకోకపోయినా మాదే!" అంది తులసెమ్మ.

"అంచేతే పెట్టుకున్నారు కాదే మనకేం?" అంది బంగారమ్మ.

"ఎవరు చెప్పినట్లుగా మేము చేసేమని, మీరు చెప్పినట్లుగా చెయ్యడానికి" అంది సింగమ్మ.

"అది కాదమ్మా! ఎక్కువ తక్కువ సంగతి నేను, చెప్పాను. కాని నేను చెప్పినట్లు మీరు చెయ్యండి, అని చెప్పడం లేదు" అంది వియ్యపురాలు.

"అమ్మా! వియ్యపురాలు వచ్చిందని మన్నాపన చెయ్యక ఈ రాద్ధాంతమంతా ఎందుకమ్మా!" అంది సింగమ్మ వెటకారంగా.

"మీరు ఎన్ని అడిగినా, నేను ఎన్ని సమాధానం చెప్పినా ఈ ఒక్కపూటే కదా!" అంది బంగారమ్మ.

"సరి! బాగానే ఉంది! అడగడమే తప్పు వచ్చిందా ఏమిటి! ఇహ అడగం లెండి, నాలుగు రోజులుండి మరీ వెళ్ళుదురుగాని" అంది సింగమ్మ.

"నాలుగు రోజులుంటే అక్కడి పను లేమవుతాయమ్మా?" అని "ఇంతకీ మీ పిల్లని మీ ఇంట దిగపెట్టడం ముఖ్యంగాని మా ఉండడానికేమివచ్చె!" అంది వియ్యపురాలు.

"ఉండకపోతే ఎవరికివట్టం, ఎవరికి ఉద్ధరింపు!" అంది తులసెమ్మ.

అదే నేను అనడమున్నా!" అంది బంగారమ్మ.

భోజనాలు పూర్తిఅయి ఎవరిదారిని వారు లేచి తమతమ పనులు చేసుకొన్నారు.

రామామణి తల్లి ఆ మన్నాడే రాజోలుకి ప్రయాణమయింది. వెళ్ళేముందు కూతురితో "నీ దగ్గర ఉన్న కార్డులు, కవరు వాడి అప్పుడప్పుడు నీ క్షేమ సమాచారాలు రాస్తూండు" అని చాటుగా చెప్పింది.

బంగారమ్మ రాజోలు చేరుకొన్నాక జరిగిన సంభాషణంతా బలభద్రంతో చెప్పింది.

"అన్నా! మంగళహారతి నేర మొకటి మనమీద వచ్చిందా? పోనీ ఒక పదిహేనుపాయలనోటు ఆపిపడుచు చేతిలో పెట్టిరాలేకపోయేవూ?" అన్నాడు బలభద్రం.

"అలాగు పుచ్చుకొంటారేమిటి?" అంది భార్య.

"సరే! ఈ మాటు వెళ్ళేటప్పుడు చీర ఒకటికొని ఆ అమ్మాయికి ఇస్తే సరిపోతుంది" అన్నాడు బలభద్రం.

సాయంత్రంపూట తులసెమ్మ దేవాలయంలో పురాణం వినడానికి వెళ్ళింది. సింగమ్మ అల్లికసూదితో దారంఅల్లుకొంటూంది. రామామణి బియ్యం ముందు పోసుకొని వడ్లు, బెడ్డలు ఏరుతూంది.

"మరింత చలిమిడి తేలేకపోయేవుటో. ఓవిడా!" అంది సింగమ్మ.

"ఏమో! మా అమ్మ అంతే ఇచ్చింది" అంది రామామణి.

"సారె మరింత తెస్తే ఏమిటి పోతుందనో! నువ్వూ, నీ మొగుడూ తింటారు కాని ఎవరకేనా కావాలా ఏమేనా!" అంది సింగమ్మ.

"ఏమో మా అమ్మ అంతే ఇచ్చింది. ఈ మాటు మా ఇంటికి వెళ్ళినప్పుడు మరింత ఇమ్మంటాను" అంది రామామణి.

"అప్పుడే మీ ఊరికి పంపిస్తారని అనుకొంటున్నావు కామోసు పాపం! ముద్దరాలివి!" అంది సింగమ్మ.

"ఎప్పటికీ ఇక్కడే ఉంచేస్తారేమిటి" అని అడిగింది రామామణి అమాయికంగా.

"మరి అత్తవారిల్లంటే ఏమిటనుకొంటున్నావు?" అంది సింగమ్మ.

"కొన్నాళ్ళయేక మా అమ్మకి ఉత్తరం రాస్తాను రమ్మని" అంది రామామణి.

"నువ్వెంతటి దానివేనా అగుడువమ్మ, చదువుకొన్నదానివి, ఉత్తరాలు రాయిస్తావు, పత్తరాలు రాస్తావు!" అంది సింగమ్మ.

"మా నాన్న క్లీడరుమాస్తా పని చెయ్యడం లేదు, పత్తరాలు రాయడానికి" అంది రామామణి.

"అదంతా మా మీద వెటకారం కామోసు. అదీ తప్పేవచ్చిందీ?" అంది ఆడపడుచు.

"తప్పని చెప్పడం లేదమ్మా! నాకు రాదని చెప్తున్నాను" అంది రామామణి.

"ఎన్నటికైనా సమర్థురాలివి! కప్పని కరిపించాగలవు, పాముని విడిపించాగలవు!" అంది సింగమ్మ.

"ఏమో, అదంతా నువ్వే చెప్పాలి" అంది రామామణి.

"మావన్నీ మాటలు, మీవన్నీ పనులు. పైకి మాత్రం ఏమీ ఎరగనట్టు కనపడతావు" అంది ఆడపడుచు.

ఇంతటిలో తల్లి వచ్చింది. చెన్నారావు కూడా వచ్చాడు. జరిగిన సంభాషణంతా సింగమ్మ వాళ్ళిద్దరితోను చెప్పింది. "అలాగ ఉంది దానిపొగరు!" అంది తులసెమ్మ. ★

కౌంట్ ఆఫ్ మాంట్ క్రిస్టో

అలెగ్జాండర్ డ్యూమా

23

చిరకాలం క్లేశమనుభవించిన వారికి అకస్మాత్తుగా అదృష్టం అబ్బినట్లు, డాంటీకి చిరకాల వాంఛితమైన అవకాశం దానంతటదే, సహజంగా, సులువుగా లభించింది. ఎవ్వరికీ అవంత అనుమానం కలక్కుండా ఇప్పుడా ద్వీపానికి వెళ్లగలుగుతున్నాడు. బయలుదేరడానికి ముందు ఒకరాత్రి ఇంకా గడవాలి. ఆరాత్రి డాంటీ భావావేశం చెప్పతరంకాదు. కన్నులు ముయ్యగానే కార్డినల్ స్పాడా లేఖలోని అక్షరాలు గోడపై జ్వాలాలేఖినితో లిఖించినట్లు డాంటీకి మనోగోచరమైనాయి. కునుకుపట్టితే స్వప్నాలు ముసురుకువచ్చి, మనస్సు కల్లోలిత మాతోంది. గుహలలో రత్నాలు పరిచిన నేలపై నడుస్తున్నట్లు, కెంపులు, పచ్చలు, వజ్రాలు తాపిన గోడలను చూస్తున్నట్లు కలలు వస్తున్నాయి. వర్షపు నీటిబిందువుల వలె ముత్యాలు రాలుతున్నట్లు కనిపిస్తోంది. దిగ్భ్రమ చెంది, పరవశుడై జేబులన్నీ అమూల్యమైన వజ్రాలతోను, రత్నాలతోనూ నింపుకుంటున్నట్లు కలగన్నాడు. పగటి వెలుగులో చూసే సరికి అవన్నీ గులకరాళ్లుగా మారిపోయినాయి. తిరిగి ఆ అద్భుతమైన గుహల్ని ప్రవేశించడానికి ప్రయత్నించాడు. కాని ఈమారు దారి వంకరటింకర్లు తిరిగి అయోమయమైపోయింది. బైటపడేదారి కూడా కనపడలేదు. ఆలీబాబా కథలో గుహద్వారాన్ని తెరవడానికి ఏమంత్రం పలికాడో దానిని జ్ఞప్తికి తెచ్చుకోడానికి ప్రయత్నించాడు. కాని అంతా నిరర్థకమయింది. అంతర్థానమైన అమూల్యవస్తు నిక్షేపం మళ్ళీ రక్షిస్తున్న భూతంవశమయింది కాబోలు. క్షణకాలంపాటు కనపడి దిగ్భ్రమ కలిగించిన ఆ భాగ్యరాసిని దొంగిలించాలన్న ఆశ అంతరించింది.

మరునాడు ఉదయం మేలుకునే సరికి డాంటీ మెదడు కుతకుత ఉడుకుతున్నట్లుంది. భ్రమాపరి కల్పనలో అల్లల్లాడిన డాంటీ క్రమంగా తెలివిలో పడ్డాడు. కొంతకాలంగా ఊగులాడుతున్న ఒక ఉపాయాన్ని ఇప్పుడు నిర్వర్తించాలని నిశ్చయించుకున్నాడు. పగలంతా క్రమంగా గడిచింది. చీకటిపడిన తరవాత ప్రయాణ సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ సందడిలో డాంటీ తన ఉద్రేకాన్ని పైకి కనపడనియ్యలేదు. క్రమక్రమంగా నావికులపైన పెత్తనం సంపాదించాడు. హద్దుమీరని అతని ఆజ్ఞల్ని నావికులు సంతోషంతో వెంటనే నిర్వర్తిస్తున్నారు.

ఏడుగంటలకి అంతా సిద్ధమయింది. మరి పదినిమిషాలలో, దీపస్తంభం ఇంక వెలిగించబడుతుందనగా అప్పుడే ఓడ దాటింది. సముద్రం ప్రశాంతంగా ఉంది. ఆగ్నేయ దిశనుండి శుభ్రవాయువులు వీస్తున్నాయి. డాంటీ చుక్కాని పుచ్చుకుని, అందరూ నిద్రపోవచ్చునని చెప్పాడు. డాంటీ చుక్కాని పుచ్చుకున్నాడంటే అందరికీ తృప్తి కలిగింది. అందరూ పడకలు చేరారు. కారాగారంలో ఏకాంతవాసంనుంచి బైటపడి నలుగురిలోనూ మసులుతున్నాడంటే, ఇప్పుడు తరుచు ఏకాంతంగా ఉండాలని కోరుకుంటున్నాడు. ఈమారు ఈ ఏకాంతంలో అతన్ని అనేక ఆలోచనలు ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. అంధకారనిశీధి అతని భావ పరికల్పనతో జాజ్వల్యమానమయింది. మాటిమాటికీ అత డుచ్చరిస్తున్న ప్రతిజ్ఞా వాక్యాలు నిశ్శబ్దతను భంగపరుస్తున్నాయి. తెరచాపలన్నీ ఎత్తి ఉన్నాయి. నౌక అతి వేగంగా అధిగమిస్తోంది.

చిట్టచివరికి ఆకాశంలో ఒకమూల మాంట్ క్రిస్టో ద్వీపం ప్రత్యక్షమయింది. డాంటీ చుక్కానిని ఒక నావికుని కిచ్చి, లోనికివెళ్లి శరీరాన్ని పడకపై చేర్చాడు. రాత్రి నిద్రలేకపోయినప్పటికీ డాంటీకి ఇప్పుడూ నిద్రపట్టడంలేదు.

తిరిగి రెండుగంటల్లో డాంటీ డెక్ మీదికి వెళ్లాడు. నౌక ఎల్బా ద్వీపాన్ని దాటుతోంది. వెనుక నీలి ఆకాశంవల్ల, మాంట్ క్రిస్టో పర్వతశిఖరం స్పష్టంగా కనబడుతోంది. క్రమంగా ద్వీపం చేరువౌతోంది. ఓడను సూటిగా ద్వీపం దిక్కుగా తిప్పివదిపాడు డాంటీ.

సాయంకాలం అయిదుగంటలవేళకి ద్వీపం సమీపించింది. డాంటీ కాంక్షతో ద్వీపంపై కొండల్ని పరిశీలిస్తున్నాడు. సంధ్యాకాంతులతోపాటు కొండలు కూడా ఎర్రని ఎరుపునించి నీలివర్ణానికి మారుతున్నాయి.

రాత్రి పడింది. పదిగంటలకి నౌక తీరం సమీపించింది. డాంటీ ఆత్మనిగ్రహం ఇంక సడలిపోయింది. డాంటీయే మొట్టమొదట తీరంపైకి దుమికాడు. ఇతరు లున్నారనే భయమే లేకపోతే అతడు నేలను ముద్దుపెట్టుకునేవాడే.

పదకొండు గంటలకి చంద్రు డుదయించాడు. వెండివెన్నెల కొండలన్నిటినీ ముంచివేస్తోంది. సముద్ర కెరటాలు వెండినురుగులు కక్కుతున్నాయి.

ఈ ద్వీపం జాన్ ఎమిలీ నావికులకు పరిచితమైనదే. తరుచు వారిక్కడ మజిలీ చేసేవారు. డాంటీ తన ప్రయాణాలలో ఈ ద్వీపాన్ని తరుచు చూచేవాడు. కాని ఎన్నడూ ఇక్కడ దిగలేదు. ఇదే అతనికి మొదటిసారి. జకోపోని పిలిచి డాంటీ అడిగాడు : "ఈ రాత్రి ఎక్కడ గడుపుదాం ?"

"నౌకలోనే. ఇం కెక్కడ ?"

ద్వీపంలో గుహల్లో పడుకోకూడదూ ?"

"ఇక్కడ గుహ లేవీ ఉన్నట్లు తెలియదే!" అన్నాడు జకోపో.

డాంటీ నిరుత్తరుడైనాడు. తరవాత బహుశా ఏప్రమాదం వల్లనో గుహలు కప్పబడిపోయుండాలని తలపోశాడు. లేదా క్షేమమని భావించి కార్డినాల్ స్పాడా పూడ్చిఉండాలనుకున్నాడు. ఏమయితే నేం ? రాత్రివేళ వెతకడం నిరర్థకం. ఉదయం వెతకా

అనువాదం: సీతారామ్

లనుకున్నాడు డాంటే. ఇంతలోనే మైలున్నర దూరంలో ఒక దీపం కనపడింది. అది సంజ్ఞ ఇవ్వగానే ఇంక పనికి ఉపక్రమించవలసి ఉంటుందని తెలుసుకున్నాడు. జూన్ ఎమిలీ ప్రతిసంజ్ఞ చేసింది. మరొక నౌక వచ్చి పగ్గం వేసే దూరంలో లంగరు వేసింది. చీకటిలో వ్యాపారం చకచకా జరిగిపోయింది.

మరునాడు ఉదయం డాంటే చేత తుపాకీ తీసుకుని, కొంత తుపాకిమందు, గుళ్లు భద్రపరుచుకుని వేటకి బయలుదేరాడు. గుట్టల మీద దుమికి పరుగులెత్తుతున్న కొండమేకల్ని వేటాడాలని కోరి కున్నట్లు మిత్రులికి చెప్పాడు. ఒంటరితనాన్ని అపేక్షించి డాంటే వెడుతున్నాడని వారనుకున్నారు. జకోపో ఒక్కడే కూడా వస్తానని పట్టుబట్టాడు. డాంటే వద్దన్నా వినలేదు. వద్దని మరీ బలవంతం చేసినట్లయితే అతనికి అనుమానం కలగవచ్చుననే భీతివల్ల డాంటే నివారించలేకపోయాడు. కొండమేకను చంపడానికి చాలదూరం వెళ్లవలసి వచ్చింది. ఒక మేకని చంపగానే దాన్ని జాకోపోకి ఒప్పగించి మిత్రులవద్దకు తీసుకువెళ్లి వండించమని డాంటే చెప్పాడు. వంట పూర్తి కాగానే తుపాకి పేల్చినట్లయితే, ఆ సంజ్ఞ అందుకుని డాంటే తిరిగివెళ్లడానికి నిర్ణయించుకున్నాడు.

డాంటే మాటిమాటికీ వెనక్కి తిరిగిచూస్తూ ముందుకి సాగిపోయాడు. ఒక కొండ శిఖరం ఎక్కి డాంటే కిందికి చూశాడు. వెయ్యి అడుగులకింద, దూరంలో వంటచేస్తున్న జకోపో, అతని మిత్రులూ కనపడ్డారు. వారందరికంటె తాను అధికుడన్న భావంతో చిరునవ్వు నవ్వి డాంటే వారి వంక చూశాడు.

“రెండు గంటల్లో ఏభై స్పానిష్ డాలర్లు సంపాదించి అందరూ మళ్ళీ బయలుదేరతారు.” అనుకున్నాడు డాంటే. “ఇంకొక ఏభై సంపాదించడానికి ప్రాణాపాయానికైనా వెనుదియ్యరు. ప్రాణాలకు వెరవక సంపాదించిన ఈ ధనాన్ని నవాబుల మాదిరిగా వెదజల్లుతారు. ఈ రోజున నా ఆశలతో పోల్చి వారి భాగ్యాన్ని అల్పంగా పరిగణిస్తున్నాను. వారి ఈ ధనం దారిద్ర్యంకింద లెక్కగట్టుతున్నాను. రేపటికి నా యీ ఆశ అంతరించవచ్చును. వారి దారిద్ర్యమే మహాభాగ్యమని భావించవలసినగతి పట్టవచ్చును. కాని అదెలాగ? అన్నిటా సూక్ష్మబుద్ధి, మేధా సంపన్నుడైన ఫెరయా ఈ ఒక్క విషయంలోనూ మోసపోలేదు కదా! అదికాక ఈ నికృష్ట జీవనం గడిపేకంటే మరణించడం మేలు.”

మూడు మాసాలక్రిందట స్వేచ్ఛ లభిస్తే చాలునని వాపోయిన డాంటే, ఇప్పుడు స్వేచ్ఛతో తృప్తి చెందలేకపోతున్నాడు. భాగ్య సంపదలకోసం పరితపిస్తున్నాడు. కాని దోషం అతనిది కాదు. భగవంతుడే మానవునికి పరిమితశక్తి నిచ్చికూడా, అంతులేని వాంఛల్ని పురిగొల్పాడు.

తరవాత డాంటే రెండు కొండల మధ్య నుండీ, పైకి కనిపించని ఒక మార్గాన్ని అనుసరించి నడిచాడు. ఏ సెలయేటివల్లనో ఏర్పడిన ఈ మార్గం, ఇంతవరకూ మానవుడెవడూ అడుగుపెట్టలేదన్నట్లుంది. నిజంగా ఉన్న ఆ గుహలకి ఇదే దారితీస్తుందని డాంటే భావించాడు.

ప్రతి చిన్న వస్తువునీ అతి శ్రద్ధతో పరిశీలిస్తూ వెడుతున్న డాంటేకి, కొండలపై దూరాన కొన్ని గుర్తులు కనిపించాయి. అవి ఎవరో లోతుగా గీసిన గీతలవలె కనిపించాయి. కాలం ఆ గుర్తుల్ని చెరిపివెయ్యలేదు. అవి ఒక క్రమాన్ని అనుసరించి ఉన్నట్లు డాంటేకి తోచింది. అవి ఒక దారిని చూపుతున్నట్లు కూడా తోచింది. అక్కడక్కడ పొదలమాటున అవి మాయమయేవి. పొదలు తొలగించి రాళ్ళపై పట్టిన నాచు గీసివేసి గుర్తులకోసం వెతికాడు. ఈ గుర్తులతనిలో ఆశను రేకెత్తించాయి. ఇవి కార్డినల్ స్పాడా తన అన్నకుమారునికోసం పెట్టిన గుర్తులు కాకూడదా, అని డాంటే అనుకున్నాడు. ధననిక్షేపాన్ని దాచాలనుకుంటే, ఈ ఏకాంతమైన స్థలం తప్పకుండా అనుకూలమైనదే.

తీరందిగినచోటికి దాదాపు అరవైఅడుగుల దూరంలో గుర్తులు ఆఖరైనట్లు కనిపించింది. ఆచోటు మిట్టగా ఉన్నందువల్ల అతను మిత్రులకు కనిపించడు. కాని ఈ గుర్తు ఏ గుహాద్వారికీ తీసుకుపోలేదు. గుర్తుల దారినే వెళ్లి ఒక గుండ్రని రాతివద్దకు చేరాడు. తీరా దారికి చివరకొసచేరే బదులు మొదటికి వచ్చినట్లు డాంటే అనుమానించాడు.

ఈ వ్యవధిలో అతని మిత్రులు, చిన్న సెలయేటినుంచి నీరు తీసుకువచ్చారు. ఓడలోనుంచి రొట్టె, ఫలాలు తీసుకువచ్చారు. కొండమేకను వండి, నిప్పులపైనుంచి తీస్తున్న సమయంలో వారికి దూరంలో రాళ్లపై గంతులువేస్తూ వస్తున్న డాంటే కనపడ్డాడు. జకోపో వంటయిందని తెలపడానికి తుపాకి పేల్చాడు. డాంటే ఇదివిని మిత్రులవద్దకు పరుగుతీశాడు. గుట్టలు దిగి దూకుతూ వస్తున్న యువకుని నావికులు చూస్తున్నంతలో, అతనికి కాలుజారింది. ఒక కొండమీదపడి, కేకపెట్టి డాంటే మాయమైనాడు.

అందరూ ఒక్క ఉదుటున లేచి దూసుకుని పరుగెత్తారు. డాంటే అంటే వారందరికీ ప్రీతి.

ముందుగా జకోపో యువకుని సమీపించాడు. నెత్తుటిలో స్పృహతప్పి పడిఉన్నాడు డాంటే. పన్నెండు పదమూడడుగుల ఎత్తునుంచి పడిఉంటాడనుకున్నారు. డాంటే నోరు తెరిచి, కొద్దిగా సారాయి పోశారు. డాంటే కన్నులు తెరిచాడు. మోకాలు, వెన్ను తీవ్రంగా నొప్పి పెడుతున్నాయని చెప్పాడు. తల దిమ్ముగా ఉంది. మిత్రులతన్ని తీరంవద్దకు మోసుకు వెళ్లాలనుకున్నారు. లేవతియ్యడానికి జకోపో అతన్ని ముట్టుకున్నంతలోనే బాధ అధికమయింది. ఏపాటి కదిపినా సహించలేని స్థితిలో ఉన్నట్లు డాంటే చెప్పాడు.

ఇంక ఇప్పుడాహారం తీసుకునే ఆశ డాంటేకి లేదు. మిత్రులుమాత్రం విందు మానకూడదని డాంటే పట్టుబట్టాడు. తనకి విశ్రాంతినిస్తే చాలునన్నాడు. తిరిగివారు వచ్చేసరికి నొప్పి తగ్గవచ్చును. నావికుల్ని ఆట్టే బలవంతపెట్ట నవసరం పోయింది. వారికి అమితమైన ఆకలి వేస్తోంది. గంటసేపటిలో విందు ముగించుకుని వచ్చారు.

ఒక రాతిపైన ఆనుకోడానికి రెండు గజాలు దేకాడు డాంటే. నొప్పి అంతకంతకు అధికమాతున్నట్లుంది. ఓడ సరుకు తీసుకువెళ్లి ఫ్రాన్సులో ఒప్పగించక తప్పదు. డాంటే ఎలాగైనా సరే లేచిరావాలని కెప్టెన్ పట్టుబట్టాడు.

డాంటే శక్తినంతా వినియోగించి లేవడానికి ప్రయత్నించాడు. కాని ప్రతి పర్యాయం క్రిందపడిపోతున్నాడు. ముఖం పాలిపోయింది. మూలుగు ఎక్కువయింది.

“వెన్నుకి దెబ్బ తగిలింది” అన్నాడు కెప్టెన్ మెల్లిగా పక్కవారితో. “అయితేం! పాపం మంచివాడు. మనం ఇతన్ని విడిచిపెట్టెయ్యకూడదు. ఓడ దగ్గిరికి మోసుకు వెడదాం.”

కదిపితే కలుగుతున్న బాధ భరించేకంటె, అక్కడే చచ్చిపోవడం మేలని డాంటే అన్నాడు.

“ఏమయినా సరే, నీవంటి ధైర్యశాలి అయిన మిత్రుణ్ని ఆపదలో విడిచేసి వెళ్లిపోయామనే మాట మాకు రాకూడదు. ఇవాళ సాయంకాలం బయలుదేరనే వద్దు:” అన్నాడు కెప్టెన్.

డాంటే ఒప్పుకోలేదు. "తప్పు నాది. దానికి ఫలితం నేను భరించవలసిందే. నాకు కొన్ని బిస్కట్లు, ఒక తుపాకి, గుళ్ళు, మందు, ఒక పలుగు, కత్తి, ఉంచి వెళ్ళిపొండి. మేకల్ని కొట్టుకోడానికీ, ఆత్మరక్షణకీ తుపాకి అవసరం. మీరు మళ్ళీ రావడానికి చాలా రోజులు పట్టవచ్చు. అందువల్ల ఆవాసం నిర్మించుకోడానికి పలుగు, కత్తి అవసరం."

"నువ్వు ఆకలితో చచ్చిపోతావు" అన్నాడు కెప్టెన్.

"కదిల్చినట్లయితే పడే బాధకంటె అలా చచ్చిపోవడమే మంచిది. ఒకటి రెండు రోజుల్లో, మీదారిలో ఈ ప్రాంతాలకి వచ్చే పడవేదైనా కనబడితే, ఇక్కడికి వచ్చి నన్ను తీసుకువెళ్ళమని చెప్పండి. నన్ను లెగ్‌హారన్ తీసుకువెళ్ళడానికి పాతిక స్పానిష్ డాలర్లు చెల్లిస్తాను."

కెప్టెన్‌కి ఇది నచ్చలేదు. తల అడ్డంగా తిప్పాడు.

జకోపో అన్నాడు: "నేనొక ఉపాయం చెప్తాను. నేనితనిదగ్గిరుండి కాపాడతాను."

"నాకోసం లాభాలలో నీ భాగాన్ని వొదులుకుంటావా?" అన్నాడు డాంటే.

"ఫరవాలేదు. నాకు ఆ చింత లేదు."

"నా మాట విను జకోపో" అన్నాడు డాంటే. "నీ దాక్షిణ్యానికి భగవంతుడు నిన్ను దయతో చూస్తాడులే. నా కెవ్వరి సహాయం అక్కరలేదు. ఒకటి రెండు రోజులు విశ్రాంతి తీసుకున్నట్లయితే కుదిరిపోతుంది. ఈ కొండల్లోనే మంచి మూలికలు దొరుకుతాయి. వెతికి తీసి చికిత్స చేసుకుంటాను."

డాంటే ముఖంలో ఒక వింత చిరునవ్వు కనపడింది. జకోపో చేతిని ఆప్యాయంగా పట్టుకున్నాడు. కాని ఒక్కడే ఉండిపోవాలని పట్టుదల విడిచిపెట్టలేదు. అవసరమైన సామాను అంతా ఇచ్చి, అందరూ వెళ్ళిపోయారు.

అందరూ కనుమరుగైన తరవాత డాంటే తనలోతాను నవ్వుకున్నాడు. "ఎంత చిత్రంగా ఉంది. ఇటువంటి అక్రమ వ్యాపారులుకూడా స్నేహానికీ, ప్రీతికీ కట్టుబడి ఉండడం ఎంత చిత్రంగా ఉంది!"

ఒక గుట్ట అంచుకి దేకివెళ్ళాడు డాంటే. అక్కడనించి అతను వాళ్ళకి కనపడడు. ఓడ అతనికి కనపడుతోంది, ఓడ లంగరు ఎత్తి మెల్లిగా బయలుదేరింది. క్రమంగా గంటసేపటిలో ఓడ కంటికి కనిపించనంత దూరం వెళ్ళిపోయింది.

డాంటే లేచాడు. తుపాకి, పలుగు, కత్తి చేత పుచ్చుకున్నాడు. కొండమేకలకంటె చురుగ్గా గుట్టలపై దుముకుతూ వెళ్ళాడు. గుర్తులు మాయమైనచోట ఆ రాతివద్దకు వెళ్ళాడు.

"అమ్మయ్య" అనుకున్నాడు డాంటే. ఫెరయా చెప్పిన అలీబాబా కథ అతనికి జ్ఞప్తికి వచ్చింది. "నువ్వు సింజా, ద్వారం తెరు" అన్నాడు.

24

సూర్యుడు ఉదయిస్తున్నాడు. గడ్డి పురుగులు సన్నని రొద చేస్తున్నాయి. చెట్ల ఆకులు మెల్లిగా కదలాడుతున్నాయి. డాంటే వేస్తున్న ప్రతి అడుక్కీ బల్లులో, పురుగులో చెదిరి పరుగులు తీస్తున్నాయి. కొండమేకలు గుట్టలమీద కెగబడి పారిపోతున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే ద్వీపమంతా మేలుకుంది. చైతన్యం ఉబుకుతోంది. అయినా, ఏకాకియైనట్లు, భగవంతుడు తప్ప మరొక తోడులేనట్లు డాంటేకి అనుభవమౌతోంది. ఏదో తెలియరాని భీతి అతన్ని ఆవహించింది. ఎడారిలో కూడా వెయ్యికన్నులై పరికిస్తున్నట్లుండే పగటివెలుగును, డాంటే భరించలేకుండా ఉన్నాడు. ఈ ఆవేగం అతన్ని వివశుని చేసింది. పని ప్రారంభించబోతూ ఆగిపోయాడు. పలుగు కిందపడేశాడు. తుపాకి పట్టుకుని, ద్వీపంలో కెల్ల ఎత్తైన కొండ ఎక్కి, చుట్టూ చూశాడు. దూరాన నౌక, చుక్కవలె కనిపిస్తోంది.

డాంటేకి విశ్వాసం చిక్కింది. సమీప ప్రాంతాన్ని ఒకసారి పరికించాడు. బ్రహ్మాండమైన పీఠంపైన నిలబడిఉన్నాడు డాంటే. దగ్గరలో ఒక ప్రాణికూడా లేదు. కొండల చరియలపై విరుచుకుపడి వెండినురుగులు కక్కుతున్న కెరటాల నీలిసముద్రం తప్ప ఇంకేమీ కనపడలేదు. చివరికి డాంటే కొండ దిగాడు. గబగబా దిగాడు. కాని అడుగులు జాగ్రత్తగా వేస్తున్నాడు. నటించిన ప్రమాదం నిజమౌతుందనే భయంతో జాగ్రత్తగా గుట్టలు దిగాడు. ఈ మాటు ఆ గుర్తుల్ని వెనక్కి చూసుకుంటూ వెళ్ళాడు. సముద్రంలోనికి చొచ్చుకుని సన్నని పాయగా ఏర్పడిన ఒక చోటుకి గుర్తులు దారితీశాయి. ఈ సముద్రపుపాయ అట్టే వెడల్పుగా లేదు. కాని ఒక చిన్న బోటు రావడానికి వీలుగాఉంది. సముద్రమునుంచి కనిపించకుండా చాటుగా కూడా ఉంది. ఫెరయా నేర్పిన పరిశోధనా చాతుర్యంవల్ల డాంటే సంభవాలు, అసంభవాలు అన్నీ ఆలోచించి తూచి నిర్ధారించడం మొదలుపెట్టాడు. కార్డినల్ స్పాడా, ఎవరి కంటనూ పడకూడదని జాగ్రత్తపడి, ఇక్కడ ఈ పాయలోకి వచ్చి దిగి, బోటు దాచి, మార్గాన్ని అనుసరించివెళ్ళి, ధనాన్ని దాచిఉంటాడని డాంటే భావించాడు. ఇప్పుడీ భావం తోచినందువల్ల డాంటే తిరిగి ఆ గుర్తులవెంట ఆ గుండ్రని రాతివద్దకు వెళ్ళాడు. ఒక్కటే చిక్కు వస్తోంది. అనేక టన్నుల బరువుండే ఈ రాతిని, తగినంత బలం, బలగం లేకుండా ఎలా కదిల్చిఉండగలడు?

డాంటే మనస్సులో ఒక ఆలోచన తటుక్కున మెరిసింది. "ఈ రాతిని పైకి తియ్యడానికి బదులు, లోపలికి గెంటాలేమో!" అమాంతంగా ఆ రాతినెక్కి, అది దేనిపైన నిలిచిఉందో చూశాడు. పక్కనే వాలు కనపడింది. అంటే ఈ రాతిని మెల్లిగా ఈ కొద్దిమేరా దొర్లించి ఉండాలి అనుకున్నాడు. ఈ రాతినికింద మరొక రాతికిందపెట్టి, ఎత్తి, దొర్లించిఉండాలి. చుట్టూ పడిన నెరదల్ని కప్పిపుచ్చడానికి, రాళ్లు మట్టిపోసి ఉండాలి. వాటిపైన ఈపాటికి గడ్డి మొలిచిఉంటుంది. అక్కడ కొంత మట్టితీసి చూచాడు. ఇప్పుడాలోచించినదంతా నిజంగా జరిగి ఉంటుందనుకున్నాడు. పలుగత్తి రాతికింద రాతిని బద్దలుగొట్టడం ప్రారంభించాడు. పది నిమిషాలలో రాయి కొంచెం ఎడమిచ్చింది. చెయ్యి దూర్చగలిగినంత ఎడం ఏర్పడింది. తరవాత దగ్గరలో కనిపించిన వృక్షాన్ని ఒక కొమ్మకొట్టి తెచ్చాడు. ఆకులూ, రెమ్మలూ దూసివేశాడు. దానిని రాతికింద ఏర్పడిన రంధ్రంలోకి చొనిపి రాతిని కదిలించడానికి ప్రయత్నించాడు. కాని రాయి బరువుగా ఉంది. కింది రాతిలో కూరుకుపోయి ఉన్నందువల్ల కదల్చడానికి అలవికాలేదు. ఇంక కింది రాతినే బద్దలు కొట్టక తప్పదని తేలింది. కాని అదెలాగ? అటూ ఇటూ చూశాడు. జకోపో తుపాకిమందు దట్టించి ఇచ్చిన కొమ్ము కనపడింది. డాంటే నవ్వుకున్నాడు. మారణ హోమంకోసం కనిపెట్టబడిన ఈ మందు తన కిప్పుడుపకరించాలి. పలుగు తీసుకుని పై రాతికీ కిందిరాతికీ మధ్య చిన్న గొయ్యి తవ్వాడు. మానవుల కాయ కష్టాన్ని తగ్గించడానికి దేశదేశాలా ఈ ఉపాయం అనుసరించబడు

తోంది. గోతిలో మందు దట్టించాడు. చేరుమాలు చించి, పెట్లుప్పులో ముంచి, ఒక చివర నిప్పుముట్టించి పెట్టి, దూరానికి వెళ్లి నిలబడ్డాడు. మందు అంటుకోడానికి ఆట్టే సేపు పట్టలేదు. అంటుకుని పెద్దపెట్టున పేలింది. పైరాయి బ్రహ్మాండమైన శబ్దం చేస్తూ కదిలిపోయింది. కిందిరాయి ముక్కముక్కలై పోయింది. అక్కడనుంచి రకరకాల పురుగులు పిలపిలమంటూ బైటపడి నలుదిక్కులకూ పారిపోయాయి. ఒక పెద్దసర్పం తలెత్తిచూసి వెళ్లిపోయింది. ఇప్పు డాధారం లేక పెద్దరాయి సముద్రంవంక వొరిగింది. పట్టువిడువక, యువకుడు పరిశీలించాడు. ఆధారం ఎక్కడ బలహీనంగా ఉందో పరిశోధించాడు. అక్కడ కొమ్ము చొనిపి బలంగా ఎత్తాడు. ప్రేలుడువల్ల స్థానభ్రష్టం చెందిన రాయి కదిలింది. డాంటీ మరింత బలంగా కొమ్ముతో కదిపాడు. చివరికి రాయికదిలి దొర్లిపోయింది. దొర్లి సముద్రజలంలో పెద్ద పెట్టునధ్వని చేస్తూపడిపోయింది. ఇప్పుడు డాంటీకి గుండ్రని మార్గం ఏర్పడింది. మధ్య ఇనుపవంకీ తగిలించిన చతుర్భుజాకారపు శిల కనపడింది. డాంటీ సంతోషంతో వెర్రికేక పెట్టాడు. తొలిప్రయత్నంలోనే ఈరీతిగా అద్భుత ఫలితాలు కలిగిన దెన్నడూ లేదు. డాంటీ ఆనందాతిరేకంతో కంపించిపోయాడు. గుండె గబగబ కొట్టుకుంది. కన్నులు చిరతలు కమ్మాయి. క్షణకాలం అలా ఉండిపోయాడు.

డాంటీ వెంటనే తేరుకున్నాడు. కొమ్మును ఇనుప వంకీలో దూర్చి పలకరాతి నెత్తడానికి ప్రయత్నించాడు. అది మెల్లిగా కదిలివచ్చింది. అది తియ్యగానే వాలువమెట్లు కనపడ్డాయి. మెట్లు దిగి డాంటీ ఒక గుహ ప్రవేశించాడు. గుహలో కొంత దూరం దిగిన తరవాత ఇంక అక్కడ అంధకారంలో అతని కేమీ కనపడలేదు. ఈ స్థితిలో మరొకరుంటే, ఆనందంతో ఉప్పొంగుతూ ముందుకు వెళ్లివలసిందే. కాని డాంటీ నిలిచిపోయాడు. అతని ముఖం పాలిపోయింది. గట్టిశంక కలిగింది.

"ఇది తగదు. నేను పురుషుణ్ని ధైర్యం చిక్కబట్టుకోవాలి" అనుకున్నాడు తనలో. "నిత్యం ప్రతికూల పరిస్థితులకి అలవాటు పడిన నేను, మోసానికి లోబడకూడదు. లేదా, పడిన శ్రమంతా వృధాకాకమానదు. ఆశతో ఆకాశసౌధాలు కట్టిన మనిషి క్రూర వాస్తవికతను తెలుసుకుని గుండె బ్రద్దలు చేసుకోవలసి వస్తుంది. ఇదంతా కేవలం ఫెరయా భ్రమమాత్రమే. కార్డినల్ స్పాడా ఈ గుహల్లో ఏమీ దాచిపెట్టలేదేమో. అసలిక్కడికి రానేలేదేమో. వచ్చినా, అసాధారణ సాహసంకల సీజర్ బోర్గియా తరవాత ఇక్కడికి వచ్చి మార్గం కనిపెట్టి ఆరాతి నెత్తించివచ్చి సంపద కొల్లగొట్టి ఉంటాడు."

యోచిస్తూ డాంటీ కదలకుండా నిలబడిపోయి ఉన్నాడు. చీకటిలో అతని చూపు కేంద్రీకరించి ఉంది. మళ్ళీ ఇలా అనుకున్నాడు: "ఇటలీదేశం అరిటిపండు వంటిదని చెప్పిన సీజర్ బోర్గియా, తన కాలాన్ని వ్యర్థపుచ్చి మళ్ళీ ఈ పెద్దరాతినెత్తి గుహద్వారాన్ని మూసివేసేటంతటి అవివేకి కాడు. కిందికే పడతాను."

మానవుని వేదాంతంలోని తుదిపదమైన "కావచ్చు" పలికి డాంటీ, శంకవల్ల వక్రమైన చిరునవ్వుతో కిందికి దిగాడు.

అంధకారబంధురమై ఊపిరాడకుండా ఉంటుం దనుకున్న గుహలో చిత్రమైన నీలికాంతులు కనిపిస్తున్నాయి. పై మార్గంలో నుంచే కాక, చుట్టూ రాళ్లలో చెక్కబడిన రంధ్రాలలోనుంచి వెలుగు, గాలి వ్యాపిస్తున్నాయి. ఆ రంధ్రాలు బైనుంచి చూస్తే కనపడవు.

తేమతో దుర్భరంగా ఉండవలసిన గుహలో వెచ్చగా ఉంది. చక్కని పరిమళం లోపల వ్యాపించి ఉంది. డాంటీ కొన్ని క్షణాలు నిలిచి గుహ చివరికొసవరకూ చూశాడు. కఠినమైన నల్లని రాతిగోడలలో అంచులు తేరి నునుపైనచోట్ల, వజ్రాలు మెరుస్తున్నట్లుంది.

కంఠస్థమైన మరణశాసనంలోని వాక్యాలు డాంటీకి జ్ఞప్తికి వచ్చాయి: "రెండో ద్వారం దాటివెళ్లిన తరువాత చివరమూల" ఇప్పటికింకా అతను మొదటి గుహలోనే ఉన్నాడు. రెండో గుహ ద్వారం ఎక్కడుందో ఇంకా కనిపెట్టాలి. అంతటా కలయ చూశాడు. రెండో గుహ దీపంలో మధ్యకి వ్యాపించి ఉండాలనుకున్నాడు. రాతి గోడల్ని పరీక్షించాడు. భద్రతకోసం గోడల్లో ద్వారం దాచిపెట్టబడి ఉంటుం దనుకున్నాడు. ఒక గోడపైన మోగించి చూశాడు. పలుగుదెబ్బకు ప్రతిధ్వని వచ్చింది. కాని అది ఓటి మోత కాదు. బరువుగా సగం చచ్చివచ్చింది. డాంటీ నుదుట చెమట ధారలు కట్టింది. అంతటా మోగించి చూశాడు. చివరి కొక చోట ప్రతిధ్వని వాయుకెరటాలమీద వచ్చినట్లు తోచింది. అక్కడ అతి జాగ్రత్తగా పరిశీలించాడు. ఇక్కడే ఎక్కడో మార్గం ఉంటుం దనుకున్నాడు. అయితే తన శ్రమ వృధా కారాదని భావించి తుపాకి మొదలుతో గోడల్ని నేలనీ తాటించి చూశాడు. అనుమానం తగిలిన చోటెల్ల మన్ను తీసి చూశాడు. కాని ఎక్కడా అవకాశం కనిపించలేదు. తిరిగి మొదట ఓటిదెబ్బ తగిలిన గోడదగ్గిరికి వచ్చాడు. ఈమారు మరింత బాగా కొట్టాడు. ఇక్కడొక చిత్రం జరిగింది. సున్నపుగోడ బెల్లులు రాలినట్లు మెత్తని మన్ను రాల నారంభించింది. రాలిన మన్ను వెనుక మెత్తని తెల్ల రాయి కనపడింది. అక్కడ డాంటీ పలుగుతో పొడిచాడు. అంగుళం లోతు దిగింది. తవ్వవలసిన చోటు ఇదే నని తేలింది.

కాని మానవస్వభావం విచిత్రమైనది. ఫెరయా కథనం సత్యమని నిరూపించే తార్కాణాలు కనిపిస్తున్నకొద్దీ, డాం విశ్వాసం మరింత సన్నగిల్లుతోంది. కొత్తగా కనిపెట్టిన ఈ ద్వారం వల్ల అతనికి కొత్త ఉత్సాహం కలగవలసిందిపోయి, సత్తువ క్షీణించ నారంభించింది. గునపాన్ని కింద పడవేశాడు. ముఖాన చెమట తుడుచుకున్నాడు. మెల్లిగా తిరుగుదారిపట్టి గుహనుంచి బైటకి వచ్చాడు. ఎవరైనా కనిపెడుతున్నారేమోనని సందేహంతో చుట్టూ చూశాడు. వాస్తవానికి అతనికి విశ్రాంతి అవసరమయింది. శోష వస్తుందని భయపడ్డాడు.

గుక్కెడు సారాయి తాగాడు. కొంత సత్తువ తేరుకున్న తరవాత మళ్ళీ గుహ ప్రవేశించాడు. ఇప్పుడు పలుగు ఎత్తాడు. ఇంతకుముందు బరువై జారిపోతుందన్నట్లున్న పలుగు ఇప్పుడు తేలికైనట్లుంది. కొద్ది దెబ్బలతో అక్కడ రాళ్లు కదిలిపోయాయి. ఈ రాళ్లు సిమెంటు దట్టించబడలేదని తేలింది. అవి ఒకదానిపైన ఒకటి పేర్చబడినాయి. ఒక నెరదలో పలుగు దూర్చి రెండో చివర గట్టిగా నొక్కాడు. పెద్ద రాయొకటి ఊడి అతని పాదాలముందు పడింది. తరవాత మిగిలిన రాళ్లని చేతితో తీసేశాడు. మనిషి ప్రవేశించడానికి తగిన పెద్దరంధ్రం ఏర్పడిం దక్కడ.

రెండో గుహ మరింత చీకటిగా ఉంది. వాయుచలనం లేదు. కొంతసేపాగి, ప్రవేశించాడు.

ఈ ద్వారానికి ఎడమచేతి వైపున గోడలమూల ఒకటుంది. అక్కడనించి గుహ నంతటినీ పరికించాడు. మొదటిదానివలెనే ఇదికూడా ఖాళీగా ఉంది. ఆ సంపదే నిజంగా ఉన్నట్లయితే, ఈ చీకటిమూల పాతిపెట్టబడి ఉండాలి. అతనికి పరీక్షా సమయం ఆసన్నమయింది.

రెండడుగుల లోతు నేల తవ్వాలి. ఉత్కృష్టవాంఛా పరితృప్తో, లేక దురంతమైన ఆశాభగ్నమో నిర్ణయమై పోతుంది. ఈ నిర్ణయానికి ఇంక రెండడుగుల లోతు నేల మాత్రం అవధి. ధైర్యంతో పలుగుతీసి తవ్వడం ప్రారంభించాడు. అయిదారుదెబ్బల తరవాత పలుగు ఇనపవస్తువుపైన పడి ఖంగున మోగింది. ఇంతవరకూ ఏ ధ్వనీ శ్రోత నింత దిగ్భ్రమ చెందించలేదని చెప్పవచ్చును. మళ్లీ అక్కడే పలుగువేశాడు. ఈమారు మెత్తని వస్తువుపైన పడింది. "అది ఇనపరేకులతో బిగించిన కర్రపెట్టె" అనుకున్నాడు.

ఇంతలో ఉన్న కాస్త వెలుగూ మాసుకుపోయింది. ఏదో అడ్డువచ్చింది. డాంటే వెంటనే పలుగు కిందపడవేసి తుపాకి పుచ్చుకుని పైకి వెళ్లాడు. కొండమేకొకటి వచ్చి అక్కడ నిలబడింది. ఆహారం సంగతి జ్ఞప్తికి వచ్చింది. ఇదే మంచి అదను అనుకున్నాడు. అయితే తుపాకిమోత విని ఎవరైనా రాగలరని భయపడ్డాడు. క్షణంసేపు ఆలోచించాడు. ఒక చెట్టుకొమ్మకోసి, తన మిత్రులు వంటచేసుకొన్న చోటికి వెళ్లి, అక్కడింకా రాజుతున్న నిప్పులో పడవేశాడు. మరొక కొమ్మతీసి దివిటీలా ఉపయోగించడానికి మంట అంటించి తెచ్చుకున్నాడు. గుహప్రవేశించి తవ్వుతున్న చోటును దివిటీ వెలుగులో చూశాడు. అతను పొరపడలేదు. పలుగుదెబ్బలు కర్రచెక్కమీదా ఇనపబద్దీలమీదా తగిలాయి. మూతమధ్యలో, వెండితో తయారుచెయ్యబడిన ఇటాలియన్ ఆయుధచిహ్నం, స్పాడా వంశనామం ఉన్నాయి. మట్టితో కప్పినా వెండి [illegible]గు తరగలేదు. డాంటే ఇట్టే గుర్తుపట్టాడు. ఈగుర్తుని ఫెరియా తనకెన్నిసార్లు గీసిచూపలేదు!

క్రమంగా పెట్టె అంతా బయటపడింది. పెట్టెని మూడు తాళాలు బిగించి ఉన్నాయి. కొక్కాలుపట్టుకొని పెట్టెనెత్తడానికి ప్రయత్నించాడు కాని సాధ్యంకాలేదు. తెరవాలని ప్రయత్నించాడు. తాళాలు లొంగలేదు. మూతకింద పలుగు మొనపెట్టి పెగలదీశాడు. మూతలో ఒక చెక్క విరిగింది. ఇనపరేకులు ఇప్పుడు నిరర్థకమైనాయి. వాటిని పలుగుతో వొంచి తీసేశాడు.

డాంటే ఉద్రేకపూరితుడైనాడు. తల దిమ్మెక్కుతున్నట్లుంది. తుపాకిఎత్తి గుళ్లునింపి చేతికి అందుబాటులో పెట్టుకున్నాడు. కన్నులు మూసుకున్నాడు—ఆకాశంలో చుక్కలకంటె, భావకల్పనలో ఎక్కువ మొత్తానికి పసిపిల్లలు కన్నులు మూసినట్లు మళ్లీ కళ్లు తెరిచాడు. కంటబడినది చూసి అతని కళ్లు చెదిరిపోయినాయి.

పెట్టెలో మూడు అరలున్నాయి. మొదటిదానిలో బంగారు కాసులున్నాయి. రెండవదానిలో మెరుగులేని బంగారు అచ్చులు పేర్చిఉన్నాయి. మూడవ అరలో సగానికి వజ్రాలు, ముత్యాలు, కెంపులు, పచ్చలు ఉన్నాయి. డాంటే వాటిని గుప్పెటలో తీసిపోశాడు. అవి చేతినుండి రాలుతున్న రంగుల వర్షబిందువులవలె ఉన్నాయి. అద్దాల కిటికీలపైబడే వడగళ్లధ్వని చేశాయి. వానిని చేతితో పట్టిచూసి విడిచిపెట్టిన తరవాత తీవ్రంగా కొట్టుకుంటున్న హృదయంతో, డాంటే లేచి గుహద్వారం వద్దకు వెళ్లాడు. ఉన్మత్తుని ఆనందావేశం అతనిలో కనిపిస్తోంది. ఒక గుట్టనెక్కి సముద్రంవంక చూశాడు. ఏమీ కనిపించలేదు. ఒంటరిగానే ఉన్నాడు. మితిలేని ఈ అపార సంపదతో తానొక్కడే ఉన్నాడు. అదంతా తనదే.

కాని ఇది తన భ్రమ కాదుగదా? లేక వాస్తవమేనా? పోతున్న చైతన్యాన్ని ఒడిసి పట్టుకోడాని కన్నట్లు చేతులతో తల నొక్కి పట్టుకున్నాడు. దారి తెన్నులతో నిమిత్తం లేక ద్వీపంలో అడ్డంగా పరుగుతీశాడు. దారిలో కొండమేకలు ఉలిక్కిపడి పారిపోయాయి. అతని కేకలువిని సముద్రపు పక్షులు ఆకాశంలోకి ఎగిరిపోయాయి. వెనక్కి తిరిగివచ్చిన దారినే వెళ్లాడు. గుహలోకి పరుగెత్తి వెళ్లి ధనరాసులముందు నిలిచి చూశాడు. మోకాళ్లపై వొంగి, కంపిస్తున్న హృదయాన్ని రెండు చేతులతో నొక్కిపట్టుకుని భగవంతుని ప్రార్థించాడు.

క్రమంగా డాంటే శాంతిపడ్డాడు. ఆ క్షణంనుంచే అతనికి తన భాగ్య మెంతటిదో తెలిసివచ్చింది. తరవాత ధనాన్ని లెక్కించనారంభించాడు. రెండు, మూడు పౌనుల బరువున్న బంగారు అచ్చులు వెయ్యి ఉన్నాయి. ఇరవైఅయిదు వేల బంగారు కాసులున్నాయి. ఒక్కొక్క కాసు విలువ పాతిక ఫ్రాంకులు. వానిపై పోప్ ఆరో అలెగ్జాండర్ ప్రతిమలూ, అతని పూర్వుల ప్రతిమలూ ఉన్నాయి. ఆపైన సగందాకా నిండివున్న అరలో చూశాడు. వజ్రాలు, రత్నాలు దోసిళ్లతో కొలిచాడు. పది దోసిళ్లైనాయి. వీనిలో అమూల్యమైన వజ్రాలున్నాయి. అందంగా చెక్కబడినవి వున్నాయి.

క్రమంగా పొద్దు వాటారుతోంది. గుహలోనే ఉంటే అకస్మాత్తుగా ఎవరైనా పట్టుకుంటారని భయపడి, డాంటే తుపాకి తీసుకుని పైకి వెళ్ళాడు. బిస్కట్టు తిని సారాయి తాగాడు. మొదటి గుహా ద్వారంవద్ద రాతిని మూసి దానిపై పడుకుని నిద్రపోయాడు.

★



ఉండాలోయ్ ఉండాలి

శ్రీ కట్టోజు సత్యానందం

విద్యార్థికి కలము
దేహానికి బలము,
వ్రతానికి ఫలము,
దాహానికి జలము
ఉండాలోయ్ ఉండాలి!


చూపుకి కళ్ళు,
నోటికి పళ్ళు,
రోడ్డుకు రాళ్ళు,
బండికి తాళ్ళు
ఉండాలోయ్ ఉండాలి!

నవ్వుకి హద్దు
ఖర్చుకి పద్దు,
బండికి ఎద్దు
పాపకు ముద్దు
ఉండాలోయ్ ఉండాలి!

తినుటకు కంచం,
పడకకి మంచం,
కొలతకి కుంచం,
అధికారికి లంచం
ఉండాలోయ్ ఉండాలి!

దంపుకు రోకలి,
మనిషికి ఆకలి,
ఉతుకుకి చాకలి
ఇంటికి వాకిలి
ఉండాలోయ్ ఉండాలి!

దొరకని దొంగ



రాజుగారి కోటలో దొంగలు పడ్డారు. పదివేల రూపాయలు ఖరీదు చేసే బంగారం ఎత్తుకుపోయారు.

ఈ వార్త వూరంతా పాకిపోయింది. దొంగను పట్టుకున్నవాడికి వెయ్యి రూపాయలు బహుమానమిస్తానని రాజుగారు దండోరా వేయించారు.

దొంగను పట్టుకోటానికి మహామహులంతా బయల్దేరారు. ఊళ్లోనూ, చుట్టుప్రక్కలా ఎంత గాలించినా దొంగ దొరకలేదు. ఇల్లా వుండగా పదిరోజులకి మళ్లీ కోటలో దొంగతనం జరిగింది. ఈసారి 15 వేల రూపాయల బంగారంపోయింది. అంతా నిర్ఘాంతపోయారు. రాజుగారికి మతిపోయినట్టయింది.

అసలు దొంగ ఎల్లా దూరాడు కోటలోకి? కోటచుట్టూ కాపలా వాళ్లు ఉన్నారు. రాజుగారు డబ్బు దాచినచోటు కోటలో ఒక మూల వుంది. రాజుగారు చాల రోజుల కిందటే, తన ధనం అక్కడా యిక్కడా పెడితే పోతుందని ఒక గొప్ప శిల్పిని పిలిపించి ఇనప గోడలతో ఒక కోశాగారం కట్టించాడు. ఆ కోశాగారానికి ఒక్కటే తలుపు వుంది. ఆ తలుపుకి అతిబలమైన 30 తాళా లున్నాయి. ఆ తాళంచెవులన్నీ రాజుగారి తలగడకింద ఒక రహస్యమైన అరలో వుంటాయి. కోశాగారానికి కన్నం వేయటానికి గాని, ఇంకో వేపునించి రావటానికి

గాని వీల్లేదు. అసలు కన్నంవేసి నట్టే లేదు. అయితే దొంగ ఎల్లా దూరాడు?

అసలు జరిగిన విషయ మేమిటంటే-రాజుగారు పిలిపించిన శిల్పి అప్పుడప్పుడు కోశాగారంలోనుంచి డబ్బు దొంగిలించి సుఖంగా ధనవంతుడుగా బతకాలని ఆలోచించాడు. ఇనప గోడల్ని కట్టేటప్పుడే లోపల్నుంచి తన యింటిదాకా ఒక పెద్ద సొరంగాన్ని కూడా తవ్వాడు. ఆ సొరంగంతలుపు ఎవరికీ కనిపించకుండా మట్టితో కప్పేశాడు. శిల్పి యింటిలో బయల్దేరి సొరంగంగుండా వచ్చి కోశాగారం అడుగునవున్న ఒక మీట నొక్కగానే తలుపు తెరచుకుంటుంది. గప్‌చిప్‌గా ఎంత డబ్బైనా దొంగిలించవచ్చు.

ఈ కిటుకు శిల్పికి ఒక్కడికే తెలుసు.

కాని తను అనుకున్నట్టు దొంగతనం చేయకుండానే శిల్పి జబ్బు చేసి చచ్చిపోయాడు. చచ్చిపోయే ముందు తన కొడుకుల నిద్దర్నీ పిలిచి ఈ రహస్యం చెప్పి, "ఈ ప్రకారం చేశారంటే మీ జీవితాంతం హాయిగా బతకవచ్చు. అయితే ఒక్కటి గుర్తుపెట్టుకోండి. మన వంశానికి అప్రతిష్ఠ రాకుండా, మీ దొంగతనం బయటపడకుండా జాగ్రత్తగా చూసుకోండి." అని చెప్పాడు.

శిల్పి చనిపోయిన తరవాత కొన్నాళ్లకి కొడుకు లిద్దరూ సొరంగంద్వారా వెళ్లి 10 వేల రూపాయలు దొంగిలించి తెచ్చి దర్జాగా ఖర్చుపెట్టారు. మళ్లీ ఇంకోసారి 15 వేల రూపాయలు తెచ్చారు.

వారిని కనిపెట్టటం రాజుతరమా బ్రహ్మతరమా?

రాజుగారి కేమీ తోచలేదు. చివరికి ఒక ఉపాయం పన్నారు. డబ్బుసంచులు దాచిన స్థలానికి చుట్టూ ఇనప తీగెల బోను పెట్టించారు. చీకట్లోగానీ, ఒక మాదిరి వెల్తురులోగాని ఆ బోను చటుక్కున కనిపించదు.

సరే, మన దొంగ లిద్దరూ ఒక నెల రోజులైనతరవాత మళ్లీ దొంగతనానికి వెళ్లారు. తమ్ముడు కోశాగారం అడుగున సొరంగంలోనే నుంచున్నాడు. అన్న లోపలికి వెళ్లాడు. డబ్బుసంచులదగ్గిరికి వెళ్లగానే పాపం బోనులో కాళ్లూ, చేతులూ, దేహమంతా ఇరుక్కుపోయింది. ఒక్క తల మాత్రం బయట వుంది. ఎంత పెనగులాడినా ఊడిరాలేదు. ఇక తనకు చావు తప్పదనుకున్నాడు. మెల్లగా తమ్ముడిని పిలిచాడు. సంగతంతా చెప్పి.

"మన తండ్రి చనిపోయేటప్పుడు మన వంశానికి అప్రతిష్ఠ తీసుకురావద్దన్నాడు. ఆ ప్రకారం చెయ్యాలంటే ఒకటే మార్గం ఉంది. నే నీ బోనులోంచి బయట పడలేను. కనక నువ్వు నా తలని ఖండించి తీసుకుపో. నా మొండెమును చూసి నన్ను ఎవరూ గుర్తుపట్టలేరు" అన్నాడు.

తమ్ముడు పాపం చాలసేపు ఏడ్చాడు. తల ఖండించటానికి ఒప్పుకోలేదు; విడిపించటానికెంతో ప్రయత్నించాడు. కాని లాభం లేకపోయింది. ఇక తెల్లవార వస్తోంది. అన్న బలవంతాన తల ఖండించక తప్పలేదు.

ఆ మర్నాడు రాజుగారు మామూలుగా ఖజానాకివచ్చి చూసుకున్నారు. ఇనపబోనులో మొండెం ఇరుక్కుని ఉండటం చూశారు. కాని ఆమనిషి ఎవరో గుర్తు తెలియలేదు. బోనులో ఒక మీట నొక్కి, భటులచేత మొండాన్ని లాగించి, దాన్ని కోటగుమ్మానికి వేళ్లాడగట్టించారు. ఆ మొండాన్ని చూసి ఎవరు ఏడవటం మొదలెడతారో వాళ్లని పట్టుకోమని భటులకి ఆజ్ఞాపించారు.

శిల్పి రెండో కొడుక్కీ, అతని తల్లికీ యీ విషయం తెలిసింది. అంతకుముందే అన్నతల నరికి తెచ్చిన సంగతిని తమ్ముడు తల్లితో చెప్పాడు. ఆమె శోకాలు మొదలుపెట్టి కొడుకుని నానాతిట్లూ తిట్టింది.

"నువ్వు సాయంత్రంలోగా నీ అన్న దేహాన్ని తీసుకువస్తావా సరేసరి. లేకపోతే నీ దొంగతనాన్ని రాజుగారితో చెప్తాను." అన్నది.

దొంగకి పెద్ద చిక్కు వచ్చింది. "ఎల్లాగురా ఈపని చెయ్యటం" అనుకున్నాడు. మొండెంచుట్టూ పాతిక మంది రాజభటులు పిచ్చుకత్తులతో పహారా యిస్తున్నారు. వాళ్లని మోసంచేసి ఎల్లా ఆ మొండెం తేవటం? చివరికో ఉపాయం తట్టింది.

కల్లు అమ్మేవాడి వేషం వేసుకున్నాడు. పాతిక గాడిదలమీద పాతిక కల్లుకుండలు కట్టాడు. సాయంకాలం కాగానే గాడిదలను తోలుకుంటూ కోట ముందు గా

బయల్దేరాడు. "కుండెడు కల్లు జేడా, కుండెడు కల్లూ జేడా" అని కేకవేశాడు. ఆ రోజుల్లో కుండెడు కల్లూ రెండు రూపాయలమ్ముతోంది. రాజభటులకి ఆశ్చర్యంవేసింది. బలే చవకగా వస్తోందే కల్లు అనుకున్నారు. కల్లువాడిమీద కెగబడి తలో జేడా యిచ్చి కరువొచ్చినట్టు కల్లుతాగారు. ఒక్కొక్కడు కుండెడు కల్లూ తాగలేక తాగలేక తాగారు. ఇంకేముంది? వాళ్ల పనైపోయింది. తందనాలాడుతూ వొకళ్ల తరవా తొకళ్లు మత్తెక్కి నిద్రపోయారు. అప్పటికి బాగా చీకటిపడింది. ఎక్కడా జనసంచారం లేదు. ఇదే సమయమనుకుని దొంగ నెమ్మదిగా కోటెక్కి అన్న మొండెం కిందికి దించి ఒక గాడిదపైన వేసిపైనగుడ్డ కప్పాడు. రాజభటుల మీసాలు ఒకవేపున కత్తిరించేసి మరిపోయాడు.

మర్నాడు రాజుగారిదంతా తెలిసి తెల్లబోయారు. "ఏ దెవడో ఆరితేరినగజదొంగలాగా వున్నాడు, వీణ్ణి పట్టడమెలాగా" అనుకున్నాడు.

"ఈ దేశంలో ఎవరైనా సరే, అద్భుతమైన ఒక పని చేసినవాడు వచ్చి, రాజకుమార్తెతో ఆవిషయం చెప్పి, ఆమెని 'నమ్మించ'గలిగితే వాడికి రాజకుమార్తె నిచ్చి పెళ్లి చేస్తాను." అని చాటించాడు.

రాజకుమార్తెని పెళ్లి చేసుకోవాలని ఆశపడే అనేకమంది యువకులువచ్చి తాము చేసిన పనులను గూర్చి కోతలుకొయ్యటం మొదలుపెట్టారు. ఒకడు తనుహనుమంతుడిని స్మరించి ఒకసముద్రాన్ని అవలీలగా దూకేశానన్నాడు. మరొకడు తనొక రోజున ఎలుకగామారి ఒక కొండను ఒక రోజులో తినేశానన్నాడు.

రాజకుమార్తె ఈ కోతలకోటయ్యలని నమ్ముతుందా? అందర్నీ చివాట్లుపెట్టి పొమ్మంది.

చివరికి దొంగ తనురాజుగార్ని మళ్లీ ఏడిపించాలనుకున్నాడు. రాజుగారి ఖజానాలోనుంచి దొంగిలించిన ఒక రత్నపు ఉంగరాన్ని జేబులో పెట్టుకుని రాజకుమార్తె దగ్గిరికి వెళ్లాడు. రాజుగారు ఈ ప్రకటన ఎందుకుచేశారో అతనికి తెలుసు. అసలు దొంగవచ్చి తను చేసిన అద్భుతమైన దొంగతనం చెప్పి రాజకుమార్తె నిచ్చి పెళ్లి చెయ్యమంటాడని రాజుగారు ఊహించారు.

సరే, మనదొంగ రాజకుమార్తె దగ్గిరికివెళ్లి తను, తన అన్న రాజుగారి ఖజానాలో ఎల్లా దొంగతనాలు చేశారో, తన అన్న తలకాయనెల్లా నరికాడో, అతని మొండెం ఎల్లా ఎత్తుకుపోయాడో అన్నీ చెప్పాడు. రాజకుమార్తె "నీదొంగతనానికి ఋజువేదీ" అని అడిగింది. దొంగ తన జేబులోనుంచి రత్నపు ఉంగరం తీసి చూపించాడు. రాజకుమార్తె ఇతడేదొంగ" అనుకుని ఆ చెయ్యి చటుక్కుని పట్టుకొంది. కాని విచిత్రంగా ఆ చెయ్యి ఊడి వచ్చేసింది. దొంగ మైనంతో ఒక చెయ్యిని తయారుచేసి అది అసలు చేతికి తగిలించాడు. సగంచెయ్యిని మడిచి చొక్కాలో దాచాడు. పైన ఉత్తరీయం కప్పుకున్నాడు.

రాజకుమార్తెకి ఒక నిమిషంసేపు భయంతో నోటమాట రాలేదు. ఆమైనం చెయ్యిని చూస్తూ అల్లాగే నుంచుండి పోయింది. చివరికిదాన్ని ముందుపారేసి "దొంగ దొంగ"అని అరిచింది.

పక్కగదిలోనే దాక్కున్న రాజభటులు బయటికివచ్చి దొంగమీద పడ్డారు. కాని దొంగ కత్తితీసి అందరినీ తప్పించుకుని అతిసాహసంగా గుమ్మాలన్నీ దాటి పారి పోయాడు.

ఈ సంగతి రాజుగారు విన్నారు. "ఈ దొంగని పట్టుకోవటం మన సాధ్యంకాదనుకున్నాడు." దొంగ తనంతట తనుబయటపడితే అతన్ని క్షమిస్తాననీ, రాజకుమార్తె నిచ్చి పెళ్లి చేస్తాననీ" మళ్లీ దండోరా వేయించారు.

దొంగ మళ్లీ సాహసం చేద్దామనుకున్నాడు. మర్నాడు దర్జాగా అలంకరించుకుని గుర్రమెక్కి రాజువద్దకివెళ్ళి నిలబడ్డాడు.

"కనక, నువ్వే నన్ను మాట నన్నింత తిప్పలుపెట్టిన దొంగవి." అన్నారు రాజుగారు.

"నేనే ప్రభూ!" అన్నాడు దొంగ.

"నీకు భయంలేదా నాదగ్గిరికి రావటానికి."

"మీరునన్ను క్షమిస్తామని ప్రకటించారు. రాజులు ఆడితప్పరని నాకుతెలుసు ప్రభూ!" అన్నాడు దొంగ.

రాజుగారు అతని ధైర్యసాహసాలకి మెచ్చుకున్నాడు.

"నారాజ్యంలో నీకంటే ధైర్యవంతుడూ, తెలివైనవాడూ మరో



ఎందుకు ఏడవటం?

శ్రీ రేపూరు కృష్ణమూర్తి

"ఏంరా రామూ! లెక్కలు చేశావట్రా" అన్నారు మేష్టారు కంటి అద్దాలు తగిలించు కుంటూ.

"లేదు సార్" అని జంకుతూ జవాబిచ్చాడు రాము.

"ఎందుకని?" మేష్టారు బెత్తం చేతిలోకి తీసుకున్నాడు. రాము ప్రాణాలు పైనేపోయాయి.

"వీలులేక పోయిందిసార్. మా అమ్మకు జ్వరంవచ్చిందండి రాత్రి. విసుగు విరామం లేకుండా మాతృదేవికి సేవ చేశానండి. మీరే అన్నారు కదుసార్ తల్లి దైవంతో సమానమని" అన్నాడు రాము చేతులు కట్టుకుంటూ.

"వెధవ. ఎన్ని అబద్ధాలురా. నిన్న సాయిత్రం మీ అమ్మ బాగానే ఉన్నది కదురా" అని మండుకొచ్చాడు మేష్టారు.

"సాయింత్రం బాగుంది సార్. దీపాలు వెలిగించేప్పటికి...." అని పూర్తి చేసేలోగా కేను వీపుమీద పడింది. స్కూలువగానే రామూ ఏడుస్తూ ఇంటికెళ్తున్నాడు. దారిలో పిల్లలంతా కలిశారు. కొందరు ఓదార్చారు. కొందరు మేష్టార్ని తిట్టారు. మరికొందరు మేథావులు మేష్టార్ని ఏగొందిలో పట్టుకుని ఉతుకుదామూ అని ఆలోచించారు.

రాము ఇంటికొచ్చాడు. ఏవో రెండు మెతుకులుతిని మంచంమీద పడ్డాడు. నిద్ర రావటంలేదు. అబ్బా బెత్తం.... మేష్టారు...పిల్లల నవ్వులు...రేపెలా వెళ్ళేది మళ్ళీ ఆ పాడుపూరిగుడిసె స్కూలుకు? మాష్టారికి నన్ను తన్నితే వచ్చే లాభ మేమిటి? ఏమన్నా నాల్గు రూపాయ లెక్కువిస్తారా జీతం? అబ్బా నొప్పి...నిద్ర వచ్చింది మెల్లగా. నిద్రలో కల. కలలో స్కూలు తగలబడి పోయినట్లు, అది కాలి బూడిదైనట్లు వచ్చింది. కలలోనే గంతేశాడు రాము. తెల్లవారింది. నిద్రలేవగనే కిటికీదగ్గఱకెళ్లి స్కూలు వైపు చూశాడు. అరె! స్కూలు అక్కడే ఉందే? కాలిపోయిం దనుకుంటే. రాముడి కళ్లలో నీళ్లు తిరిగాయి. వెక్కి వెక్కి ఏడవటం మొదలుపెట్టాడు. వాళ్ల అమ్మ తల నిమురుతూ 'ఏం నాయనా?' అంది.

ఏం లేదు. మా స్కూలు, మాస్కూలే..." అంటూ ఏడుస్తున్నాడు రాము.

"ఏం? మీ స్కూలే మైంది, బాగానే ఉందే" అంది వాళ్లమ్మ ఆశ్చర్యపడుతూ.

"అందుకే ఏడవటం" అంటూ పెద్దగా ఏడ్చాడు రాము.

★

కథలేదు. నీకు రాజ కుమార్తెనే కాదు, అర్ధరాజ్యాన్నికూడా యిస్తానను. అన్నారు రాజుగారు.

దొంగకీ రాజకుమార్తెకీ పెళ్లి జరిగింది. అంత వైభవమైన పెళ్లి ఏ దేశంలోనూ జరగలేదని చెబుతారు.

[ఇంగ్లీషు కథ కనువాదం]

★

ఎవరిప్రేమగొప్పది?

శ్రీమతి మం. పద్మావతీదేవి

అనగనగా పర్షియా దేశంలో ఒక రాజుండేవాడు. అతడు ప్రజలను కన్నబిడ్డల్లా చూస్తూ, అల్లకల్లోలాలేమీ లేకుండా రాజ్యాన్ని ప్రశాంతంగా పాలిస్తుండేవాడు. ఆ రాజుకు ధైర్యసాహసాలు, వినయ విధేయతలుగల చక్కని కుమారులు ముగ్గురున్నారు. ఇలావుండగా కొన్నాళ్ళకు బాగా ముసలివాడైపోయాడు. తలంతా నెరసిపోయింది. శరీర పటుత్వం తగ్గి రాజ్యంచేసే శక్తి తగ్గిపోయింది. ఇది గమనించి రాజు "నాకు ముసలితనం వచ్చింది. రాజ్యాన్నింక కొడుకుల చేతిలో పెట్టడం మంచిది. ముగ్గురు ధైర్యసాహసాలు కలవారే! కాని వీరిలో ఎవరు చక్కగా రాజ్యాన్ని పాలించగలరో చెప్పడం సాధ్యం కాదు. ఏదైనా యుక్తిచేత వీరిలో రాజ్యాన్ని పాలించగల సమర్థులెవరో కనిపెట్టాలి" అని తనలో తాననుకున్నాడు. వెంటనే ముగ్గురు కొడుకులను తన సముఖానికి పిలిపించేడు.

రాజు వారిని చూచి "నాయనలారా! ముసలివాడినై పోవడంవల్ల రాజ్యభారాన్నింక మోయలేను. ఈ బాధ్యత మీ చేతుల్లో పెట్టాలని చూస్తున్నాను. మీలో ఎవరు నన్నెక్కువగా ప్రేమిస్తున్నారో చెప్పండి. వారికే రాజ్యభారాన్ని అప్పగిస్తాను" అన్నాడు.

మొదటి కొడుకు లేచి "నాన్నగారు! మీయందు నాకుండే ప్రేమ ఆకాశము, భూమి, సముద్రమంత విశాలమయినది. బహుశః యింకా యెక్కువైన దనే చెప్పవచ్చు" అన్నాడు.

రెండవవాడు లేచి "పితాజీ! మీయందు నాకుగల ప్రేమను కొలవడానికి సరియైన వస్తువేదీ యీ లోకంలో లేదు" అన్నాడు.

మూడోవాడు లేచి "నేను నా తండ్రిని బాగా ప్రేమిస్తున్నాను. ఇంతకంటె నేనేమీ చెప్పలేను" అని ముక్తసరిగా సమాధానం చెప్పేడు.

రాజు వారి సమాధానాలకు చాల సంతోషించి, వారిని పంపివేసి మంత్రులను పిలిపించి "నేను మక్కా వెళ్ళి అల్లాను సేవించుకొంటాను. దేముని దయవలన తిరిగివస్తే సరే, నేనే రాజ్యాన్ని ఎవరికీయవలసినది చెప్తాను. లేకపోయినట్లయిన మీరు నా కొడుకులు ముగ్గురు కలసి ప్రస్తుతం, నా తదనంతరం రాజ్యాన్ని పాలించేట్లు చూడండి" అని చెప్పేడు. రాజాజ్ఞకు వారు తమ సమ్మతిని తెలుపగానే రాజు తట్టాబుట్టా సర్దుకొని మక్కాయాత్రకు వెళ్ళిపోయాడు.

రాజు తీర్థయాత్రకు వెళ్ళి సంవత్సరంపైనే గడచింది. కాని అతడు తిరిగి రాలేదు. ఆరోజుల్లో కాశీ, మక్కా తీర్థయాత్రకు వెళ్ళి, సంవత్సరం పైగా గడచిపోయినా రాకపోతే ప్రజలు వాళ్లను చచ్చిన వాళ్లలో జమకట్టేసేవారు. ఆపద్ధతి ప్రకారం రాజుకూడ చనిపోయాడనుకొని, అంత మంచిరాజు పోయినందుకు ప్రజలందరు, విచారించేరు. రాజు మాట ప్రకారం మంత్రులు ముగ్గురు కొడుకులకు రాజ్యము నప్పగించేరు. రాజ్యము, వెనుకటిలాగే ప్రశాంతంగా సాగిపోతున్నది. కాలచక్రములో మరొక సంవత్సరం గిఱ్ఱున తిరిగిపోయింది. ఒక రోజు సాయంత్రం ఆనగరపు ప్రహారిగోడ దగ్గరకు నెమ్మదిగా ఎవరో సాధువు నడచి వస్తున్నాడు. సాధువు వూరిలో అడుగు పెట్టగానే, అతనికి అక్కడే వున్న చెట్టు క్రిందొక చింకిగుడ్డలతో బికారిలాగున్న మనిషి కనిపించేడు. అతడు తనలోతాను "అబ్బ! నేనాతని యెంత గాఢంగా ప్రేమించేవాడిని! ఈదుఃఖము భరించలేను"

అని అనుకుంటూ యేడుస్తున్నాడు. సాధువాతని దగ్గరకు వెళ్ళి "ఏమిటి నాయనా నీసంగతి? ఎందుకిలా విచారిస్తున్నావు? నీ విచారానికి కారణమేమిటో చెప్పు. దేముడు తప్పక నిన్ను కరుణిస్తాడు" అన్నాడు.

ఆతడెంతో విచారంగా "ఏమి చెప్పను! ఈ రాజ్యానికి రాజైన నా తండ్రి చనిపోయాడు. నేనాతనెంతో ఎక్కువగా ప్రేమిస్తుండే వాడిని. అందుచే ఆతని చావుతో నాకు పిచ్చెత్తినట్లయింది. రాజ్యమేలాలనే ఆసక్తిలేక బికారినైనాను" అన్నాడు. సాధు వాతని మాటలకెంతో సంతోషించి "నాయనా అంతగాఢమైన ప్రేమ నుంచిచేకాని, నీ కిచ్చి ప్రేమవలన తండ్రిపేరు కేమాత్రం గొప్పతేలేక పోయావు. తక్కిన యిద్దరు నీవలె బికారులయ్యారా! అని ప్రశ్నించేడు. అందుకాతడు "లేదు. రెండవవాడు తండ్రి చావడమే మేలనుకొని, తన యిష్టాను సారము డబ్బు ఖర్చు పెట్టుతూ విలాస వినోదాలలో మునిగి తేలుతున్నాడు. మూడవవాడు రాజ్యమెట్టి అలజడి పాలు గాకుండా, తండ్రి కీర్తిని రెట్టింపు చేస్తూ రాజ్యాన్ని చాలా సమర్థంగా పాలిస్తున్నాడు" అని చెప్పేడు.

ఈ మాట వినగానే సాధువు "నా మూడవకొడుకే రాజ్యపాలన కర్హుడు" అనుకుంటూ సంతోషాతిశయముచేత గబగబా కోటవైపుకు పరిగెత్తేడు. బికారి కూడా విస్తుపోయి అతని ననుసరించేడు. మంత్రులు మొదలైనవారు సాధువును గుర్తించి తమ రాజు బ్రతికి వచ్చినందుకు చాలా సంతోషించేరు. రాజు వారిని, కొడుకులను చూచి "నాయనా మీలో చివరివాడి ప్రేమే గొప్పది. తండ్రిపేరుకు మెరుగులు పెట్టేవాడే గొప్పవాడు. అందుచే రాజ్యభారాన్ని అతనికే అప్పజెప్పుతున్నాను" అని చెప్పి, అతనికే పట్టాభిషేకం చేసేడు. పూర్వంలాగే ఆమూడో కొడుకు హాయిగా చక్కగా రాజ్యాన్ని పాలిస్తున్నాడు.

పాపలూ! మనంకూడ మనతల్లిదండ్రులకు మంచిపేరు తెచ్చేవాళ్లముగా ప్రవర్తించాలి. ★

తమ్ముడు (అన్నతో): "చూడు, నీఅంత ఎత్తున్నాను నేను."

అన్న: "ఏడిశావ్. సరిగ్గా నుంచో. ఆ, నా చెవులదాకా వచ్చావ్."

తమ్ముడు: "ఛా, నీకేం తెలియదు. అడుగున చూడు, నీ కాళ్లు నా కాళ్లు సమానంగా నేలమీదకొచ్చాయి."

* * * *

"షేక్స్పియరుగనక ఈనాడు బతికివుంటే ప్రపంచం అతన్ని ఎంతగొప్పగా గౌరవించేదో?"

"అవునుమరి, మూడు వందల ఏళ్లుబతికాడంటే అది సామాన్యవిషయమా ?"

బులుసుగొలుసు కథ

శ్రీమతి బులుసు లలిత
శ్రీ బులుసు వి.జి.క్రిష్ణ


‘బులుసు’ కొకసారి వాళ్ళమ్మ వాచీగొలుసు కట్టింది. ఆ గొలుసు ‘బులుసు’ ఎక్కడో పారేశాడు. గొలుసు పారేసిన ‘బులుసు’ని వాళ్ళనాన్న పులుసులోకి ఎముకలు లేకుండా చేసేద్దా మనుకున్నాడు. అప్పుడు ‘బులుసు’ అమ్మ ‘బులుసు’ నాన్నని కలుసుకొని “గొలుసుపోతే పోయింది బతికి ఉంటే బలుసాకు తినొచ్చు” నని చెప్పి ఆ వేళకి ‘బులుసు’కి దెబ్బలు తప్పించింది. అది తెలుసుకొని ‘బులుసు’ ఆగొలుసేం చిన్నదలుసా ఏమిటి పెద్దవాచీగొలుసు కదా అనుకుని కలిసిన వాళ్ళందర్నీ గొలుసు గురించి తెలుసుకోమన్నాడు. కాని ఆఖరికి ఆగొలుసు ‘బులుసు’ వాళ్ళింట్లోనే కుంకుడుపులుసు గిన్నెలో దొరికింది. ఆ గొలుసుని బులుసే తోముదామని కుంకుడు పులుసు, గిన్నెలో వేశాడట. ఆ గొలుసు. పులుసులో వేసిన సంగతి ‘బులుసు’ మరచిపోయాడట. పులుసు గిన్నెలో గొలుసు దొరకగానే, ‘బులుసు’ ఎముకలు పులుసులో కలుస్తాయేమో అన్న భయం తీరిపోగా గొలుసు కూడా ‘బులుసు’కే ఇచ్చేశారు. గొలుసు సంగతి తెలుసుకోమన్న వాళ్ళందర్నీ కలుసుకొని ‘బులుసు,’ తాను పారేసిన వాచీ గొలుసు దొరకగా ఆగొలుసు తనకే ఇచ్చేశారని చెప్పేడు. గొలుసు దొరికిందని తెలుసుకున్న ‘బులుసు’ స్నేహితులు చాలా సంతోషించారు. ఇదీ పులుసులో పడ్డ ‘బులుసు’ గొలుసు కథ. ★

ప్రసిద్ధ అమెరికన్ రచయిత మార్క్‌ట్వేన్ ఒకసారి ఇండియాకు వచ్చాడు. ఒక హోటల్లో భోజనం చేస్తూ ఇలా విసుక్కున్నాడు:

“ఈఇండియన్లు ఈగలు, బల్లులు, బొద్దింకలు మొదలైనవాటిని వేరే ప్లేట్లలో వడ్డించకుండ మిగతా పదార్థాల్లో ఎందుకు కలుపుతారో అర్థంకావటంలేదు.”

నక్కతో మిఠాయి

రాజా



అనగా అనగా ఒక అడవిలో ఒకనక్కా, ఒక చెవలపిల్లీ చాలా స్నేహంగా ఉంటూండేవి. నక్కదంతా కపట స్నేహం. తన అవసరాల కోసం పుట్టుకే స్నేహంగా నటిస్తూ ఉండేది.

ఇలా ఉంటూండగా ఒక రోజున నక్కా, చెవలపిల్లీ కలిసి పాయసం వండుకున్నారు. తీరా కష్టపడి చేశాక, నక్కేమో ఒకపెద్ద అరటి ఆకు కోసి తనకి విస్తరికింద వేసుకుంది. ఒకచిన్న రావిఆకు కోసి చెవలపిల్లికి విస్తరి కిందవేసింది.

ఇది చూసి చెవలపిల్లి ఆశ్చర్యంగా, "నక్కబావా, నక్కబావా! మనిద్దరం సరిసమానంగా కష్టపడి పాయసం చేసింతర్వాత నువ్విలాగ అరటిఆకునిండా పాయసం వేసుకోడమూ, నాకు చిన్న రావిఆకు మీద వెయ్యడమూ బాగుందా? న్యాయంగా యిద్దరికీ చెరిసమానంగా వెయ్యి." అని బ్రతిమాలింది.

నక్క తన ఆకునిండా పాయసం పోసుకుని, చెవలపిల్లికి పుట్టుకు ఆ రావి ఆకుమీద రెండు మెతుకులు విదిపి, "ఛీ, కూసంత ఉన్నావో లేదోగాని, నీకు నాతో సమానంగా కావలసి వచ్చిందా! ఏం చోద్యంగా ఉంది! ఎవరన్నా వింటే నవ్వుతారు. నీ పరిమాణానికి నీకు, నా పరిమాణానికి నాకు! ఏ తెలివితక్కువ దద్దమ్మ కాదనగలదు? రమ్మను సబబు చెప్పిస్తాను." అని బుర్రు బుర్రుమంటూ పాయసం జుర్రడం ఆరంభించింది.

చెవలపిల్లి ఏం చేస్తుంది? నాలిక చాపిందో లేదో ఆ రెండు మెతుకులూ క్షణంలో పూర్తి అయిపోయాయి. నోరూరుతూ, బాకురు బాకురుమంటూ ఆనక్క పాయసం జుర్రుతూంటే చేసేది లేక చూస్తూ కూర్చుంది.

ఉన్నదంతా వడ్డించుకుని కడుపునిండా తిని, మూతి నాక్కుని, హాయిగా ఒకచెట్టు నీడని పడుకుంది నక్క. చెవలపిల్లి ఆకలికి కడుపు మాడుతూ ఆనక్కకి తగిన శాస్తి ఎలాగ చేద్దామా అని ఆలోచనలోపడింది.

చివరకి చెవలపిల్లికి ఒకఉపాయం తట్టింది. అది మెల్లిగా నడుచుకుంటూ ఆ దగ్గర్లోనే ఒక పల్లెటూరు ఉంటే అక్కడికి వెళ్ళింది. అక్కడ ఒక యింటిముందు ఒక ముసలమ్మ వడ్లు దంచుకుంటోంది. పక్కింటి ఆవిడతో వెళ్ళబోసుకొంటోంది,

"ఏమోనమ్మా, మా అబ్బాయి నెల్లాళ్ళాయి పట్నం వెళ్ళాడు రాజుగారి కొలువులో ఉద్యోగంకోసం! యింతదాకా వాడి క్షేమసమాచారాలేమీ తెలియడంలేదు. యివతల తల్లిప్రాణం ఎంతయిదిగా తల్లడిలుతూంటూందో వాడికేం తెలుసు? కాకిచేత కబురంపిస్తేనే చాలు నాకెంత సంతోషంగా ఉంటుంది." అని అంటోంది.

ఇది పొద చాటునించి చెవలపిల్లి విని, అటుతిరిగి, వీధిలోంచి ముసలమ్మ దగ్గరకొచ్చి, "అవ్వా, అవ్వా మీ అబ్బాయి తనకి రాజుగారి కొలువులో మంచి పనిదొరికిందనీ, నాలుగు రోజుల్లో మళ్ళా నిన్ను చూడ్డానికి వస్తాననీ, చెప్పాడు." అని చెప్పింది.

ముసలమ్మ చాలా సంతోషించి "నాచిట్టికూనవుగదే! ఎంత మంచి వార్తని తెచ్చావే!" అని దాన్ని ముద్దెట్టుకుని, ఒక బస్తానిండా బియ్యంతీసి ఒక చక్రాలబండిమీద వేసి, "నీకు బహుమానం ఇదిగో! తీసికెళ్ళు." అని యిచ్చింది. చెవలపిల్లి ఆ చక్రాలబండీని మెడకి కట్టుకుని ఒక పొదచాటుకు తీసికెళ్ళి, ఎవరూ చూడకుండా అట్టే బెట్టింది.

చెవలపిల్లి మళ్ళా పట్నానికి బయలుదేరింది. పట్నంలో ఒకసెట్టి దగ్గరికి వెళ్ళి, "సెట్టిగారూ, మీకు ఈ ఊళ్ళో చాలా మంచిపేరుంది. రాజుగారు నాలుగు బస్తాల బెల్లం పంపించమని చెప్పారు. డబ్బు అక్కడే యిస్తారట!" అని చెప్పింది. సెట్టి ఉప్పొంగిపోయి, "నాచిట్టి చెవలపిల్లికానా! ఇదిగో నీకు బహుమతీ!" అని ఒక బస్తానిండా బెల్లం ఒకచిన్న తోపుడు బండీమీద వేసి, రాజుగారికి పంపించేందుకు తయారు చెయ్యడం మొదలెట్టాడు.

చెవలపిల్లి ఆ బండీని మెల్లిగా తోసుకుంటూ మునుపటి పొదదగ్గరికి వెళ్ళింది.

ఇదే విధంగా పొగడి, నెయ్యి కూడా సంపాదించి, ఈబళ్ళన్నీ తోసుకుని తనుఉండే చోటు చేరుకుని మిఠాయి చెయ్యడం ఆరంభించింది. అప్పటికి నక్క గుర్రుపెట్టి యింకా నిద్రపోతూనే ఉంది.

చెవలపిల్లి నాలుగు ఉండలు తను తిని, ఒకచిన్న మిఠాయిముక్క తీసికెళ్ళి నిద్రపోతున్న నక్కముక్కు దగ్గర పెట్టింది.

ఆ వాసనకి నక్క చటుక్కున లేచి, ముక్కని మింగేసి, "యింకా ఏదీ, ఎదీ?" అని వెదకడం ఆరంభించింది.

చెవలపిల్లి దాన్ని ఆపి, "నక్కబావా, ఊరికేనే వచ్చిందనుకున్నావా ఏమిటి? పట్నంవెళ్ళి బియ్యమూ, బెల్లమూ, నెయ్యీ తెచ్చి తయారుచేశాను." అంది.

నక్క ఆతురతగా, "ఎలాగేమిటి? నాకుకూడా చెప్పు తెచ్చుకుంటాను" అంది.

చెవలపిల్లి దానికి తగ్గ శాస్తి చెయ్యాలని చెప్పి, "నువ్వు తిన్నగా పల్లెటూరి ముసలమ్మ దగ్గరకెళ్ళి దాన్నీ, దాని కొడుకునీ తిట్టు. అది బియ్యం యిస్తుంది. తర్వాత పట్నంలో సెట్టిని తిట్టి వాడిదగ్గర బెల్లంతీసుకో. తరవాత తెలకులాడి దగ్గర నూనె తీసుకురా. అప్పుడు మంచి మిఠాయి చెయ్యొచ్చు." అంది.

అదే విధంగా నక్క ముందర పల్లెటూరి ముసలమ్మ దగ్గరకెళ్ళి, "ఓసిముసలి పీనుగకానా, యిన్నేళ్ళయినా ఎలా బతికున్నావే, నీకు పక్షవాతం రానూ! నీఅంకిళ్ళుపడ! నీకొడుక్కి ఉద్యోగం ఊడే రోజు వస్తుందిలే! నాకు బస్తాడు బియ్యం యిస్తావా యియ్యవా" అంది.

ముసిలావిడకి ఒళ్ళుమండింది. "అలాగే" అని చెప్పి, యింట్లోకెళ్ళి దొడ్డిగుమ్మంలోంచి రోకలిపుచ్చుకు వచ్చింది. నక్క యింకా ఎప్పుడు తెస్తుందా బియ్యపు బస్తా అనిచెప్పి నోరుతెరుచుకు చూస్తోంది. యింతట్లో నడ్డి విరిగేట్లా రోకలి దెబ్బతగిలేసరికి "కుయ్యో మొర్రో" అనుకుంటూ తోక ముడుచుకుని ఒకటే పరుగు లంకించుకుంది.

అది అలా వెళ్ళి తిన్నగా పట్నంలోసెట్టిదగ్గరకెళ్ళింది. అక్కణ్ణించి తిట్లులంకించుకుంది. "ఓరి బొజ్జసెట్టీ, యిరవైనాల్గు గంటలూ నీకు బొజ్జపెంచడం తప్ప మరేం చేతకాదు కావును. నల్లబజారులో లాక్కొచ్చిన లాభాలతో యినప భోషాణం నింపుకుంటున్నావు కావును! రేపు రాజుగారితో చెప్పానంటే పోలీసులు నీకు తిరుక్షవరం చేసి, సున్నపుబొట్లుపెట్టి, గాడిద మీద ఊరేగించి మరీ జైల్లోకి తోసేస్తారు. అప్పుడునీపాట్లు నక్కలమైన మాకు తెలియాలి. చూస్కో నాతడాఖా! యిప్పుడు వెంటనే నాకు బస్తాడు బెల్లం యియ్యి." అంది.

సెట్టికి లోపల్లోపల వొళ్లుమండి పోతోంది. కానిపైకి ఏమ్మంటాడు? మెల్లిగా లోపలికివెళ్ళి బస్తాలో యిన్ని యిటికలు వేసి తెచ్చాడు. "బలే బెల్లం తెస్తున్నాడు." అని నక్క ఊటలేసుకుంటూ నిలుచుంది. యింతలో సెట్టినక్కనడ్డిమీద అది పడేశాడు. నక్కనడ్డివిరిగినా, బెల్లం దొరికిందిగదా అని చెప్పి చల్లగా నానాబాధలూపడీ, ఆ యిటికల బస్తాని లాక్కుంటూ తెలుకులాడి దగ్గిరకివెళ్ళింది.

వెళుతూనే, "ఓరీ తిలఘాతుకుడా! శాస్త్రంలో మీరు నిషిద్ధులు; పాపిష్టులు. అసలైన కోతిబ్రాండు చాయపప్పు నూనె అని బోర్డుకట్టావు తాటికాయంత అక్షరాలతోటి. కాని, నీదంతా కల్తీరకం! దగా!. పచ్చిమోసం! నూటికి తొంభై పాళ్లువేరుశనగ, అవిసె, యిప్పమొదలైన నూనెలే. వెనకటికి ఒకాయన యిదివాడేసరికి ఆవరసని విరేచనాలు పట్టుకున్నాయట! రేపు హెల్తు ఇన్స్పెక్టరుకి రిపోర్టు చేశానంటే చెవులెక్కదీసి ఫైనిచ్చుకోవాలి. వాళ్ళకి లంచాలిచ్చి తప్పించుకుందామనుకుంటున్నావేమో! ఆ పప్పులుడకవు. ఆ కేసులో నిన్నూ, వాళ్లనీ కలిపి మనరాజుగారి ఎదుట విచారణ చేయిస్తాను. చూసుకో నాతడాఖా! నాకు గరిటెడు నూనెయిస్తావాయియ్యవా?" అని బెదరించింది.

తెలుకులవాడికి మహా ఒళ్లు మండిపోతోంది. ఉన్నమాటంటే ఉలుకెక్కువ కాదూ?


వాడు లోపలికి వెళ్ళి సలసలా మరుగుతున్న నూనె గరిటెడు తెచ్చాడు. నక్క సంతోషంగా ఎదురుచూస్తోంది. వెంటనే వాడు ఆ వేడినూనెని దానివీపుమీద తిరగపోశాడు. అసలే దెబ్బలతో ఏడుస్తున్న నక్క నూనెపడేసరికి కుయ్యోమొర్రో అని ఏడుస్తూ, అతికష్టంగా ఆ యిటికల బస్తా మోసుకుంటూ తన అడవికి బయలుదేరింది.

వస్తూనే చెవలపిల్లి ఎదురై, "ఏమైంది నేస్తం?" అని అడిగింది.

"మిఠాయిలాగే ఉంది! ఒక్క బెల్లం మట్టుకు దక్కింది." అని మెల్లగా యిటికల బస్తా మూట విప్పింది. చూస్తే యిటికలు!

చెవలపిల్లి నక్కస్థితికి జాలిపడి, "నేస్తం. ఎప్పుడూ యిలా చెయ్యకేం! యికముందు ఏదిచేసుకున్నా చెరి సగం తీసుకుందాం." అని దానిదెబ్బలకి ఆకుపసర్లూ అవీవేసి కట్టుకట్టి, తనుచేసుకున్న మిఠాయి దానికి యిచ్చింది.

అప్పటినించీ నక్కా, చెవులపిల్లీ నిజంగా చాలా స్నేహంగా ఉంటున్నాయి. ★



గ్రంథ సమీక్ష

అప్పగింత

కర్త: శ్రీ ఈరంకి వెంకటరావు

ప్రకాశకులు: కళాకేళీ ప్రచురణలు, శామల్ కోట.

వెల: రూపాయిన్నర.

1950 సంవత్సరం నవంబరు నెలలో పుస్తకరూపంగా వెలువడింది; "అప్పగింత" నవల. ఈ నవల 1949 చివరి రోజుల్లోనూ, 1950 తొలిరోజుల్లోనూ సీరియల్ గా తెలుగుస్వతంత్రపత్రికలో ప్రకటించబడింది. ఈ నవలను రచించినవారు శ్రీ యీరంకి వెంకటరావు గారు. ఈ నవలలోయున్న విశిష్టత ఏమనగా యిది ఫ్రెంచి కథకుడైన ఎమిలీజోలా వ్రాసిన నవల ఆధారంగా వ్రాయబడినా యిది తెలుగులో స్వతంత్రంగా వ్రాసినట్టు కనబడుతుంది. అనువదించినట్టుగా ఎక్కడా పాఠకుడికి పట్టు యివ్వదు. అయితే మూలకథను చెడగొట్టకుండా, దాన్నే మన వాతావరణానికి, ఆచారాలకు, కట్టుబాట్లకు అనుకూలించేటట్లు వ్రాయడం యీ నవలలో విశేషం. ఇంగ్లీషు రానివారికి, ఇంగ్లీషులో నవలలు చదవడం అలవాటు లేనివారికి ఎమిలీజోలాను యీ నవల చాలా సన్నిహితం చేస్తుంది.

కథావస్తువు బహు సున్నితమైనది, మన స్త్రీత్వ సంబంధమైనది. ఒక కుటుంబంతో ఏమీ సంబంధం లేని, ఆ కుటుంబానికి ఋణపడివున్న ఒక దిక్కులేని బాలుడు, రామదాసు, కృతజ్ఞతా భావంతో గురుతరమైన బాధ్యతను నెత్తిమీద పెట్టుకుంటాడు. అతనికి చదువు చెప్పించి, పోషించిన రాజేశ్వరమ్మ తన మరణసమయంలో తన కుమార్తె సరోజను రామదాసు కప్పగించి మరణిస్తుంది. కాని సరోజ తన తండ్రివలన మేనత్త జానికమ్మపోషణలోనికి పంపబడుతుంది. జానికమ్మ విలాసవతి. జీవితాన్ని తేలికగా, హాయిగా ఆడంబరంగా గడిపే స్త్రీ. ఆమెపోషణలోనున్నా ఆమె అలవాట్లు, పద్ధతులూ, సరోజకు సంక్రమించకుండా ఉండాలని రామదాసు ఎంతో ఆరాటపడతాడు, ఆ వేదన చెందుతాడు. దానికోసం తన స్వాతంత్ర్యాన్ని అమ్ముకుంటాడు. రామదాసుని ఆమె గుర్తుపట్ట లేదు. అతనిని నిర్లక్ష్యంగా చూస్తుంది. అతని ప్రభావ మేమీ ఆమెమీద పని చేయదు. రామదాసు యిక్కడ ఓడిపోయాడు. సరోజ శేషగిరి అనే విలాసపురుషుణ్ణి వివాహమాడుతుంది. శేషగిరిని వివాహమాడేవరకూ జీవితంమీద, సంసారంమీద ఎన్నో ఆశలు పెట్టుకొన్న సరోజ ఆతర్వాత హతాశురాలౌతుంది. ఆమె దాంపత్యాన్ని, వివాహసంబంధాన్ని అర్థంచేసుకునేటప్పటికి పరిస్థితులు చెయ్యిదాటిపోతాయి. అయితే రామదాసు ఆమెను అనుగమించటం మాత్రం మానడు. అతనిలో కార్యదీక్ష, విశ్వాసపాత్రతతోపాటు, యీర్ష్య, బాధ గూడ పనిచేయుచూ వుంటాయి. రామదాసు సుగుణాలకుప్ప గాదు. సామాన్య మానవుడు. అతను ఆ యీర్ష్యతోనే సరోజను వెంటాడుతాడు. రామదాసు, నరసింహం అనే మిత్రుడితో కలిసి శాస్త్రపరిశోధనలు చేస్తూ వుంటాడు. అమితమైన ధనాన్నీ, అనంతమైన కీర్తినీ యిద్దరుమిత్రులూ సంపాదిస్తారు. సంఘంలో ఒక విశిష్టమైన స్థానాన్ని ఏర్పరచుకొంటారు. వీరు శేషగిరియింట్లోవాళ్లుగా మసుల్తూవుంటారు. కొన్నాళ్ళకు వ్యాపారం వ్యవహారంమీద బొంబాయి వెళ్లిన శేషగిరి అక్కడనే అకస్మాత్తుగా చనిపోతాడు. సరోజ అంధకారంలో పడిపోతుంది. కాని ఆమె జీవితంలో ఒక్క ఆశాకిరణం నరసింహం. నరసింహం ఆమెను వివాహమాడి ఆమె జీవితాన్ని సుఖవంతంచేయడానికి అంగీకరిస్తాడు. రామదాసు తన ఆవేశాన్ని, ఆవేగాలని తన ఆశయాలకోసం అణగద్రొక్కుకుని, వారిద్దరినీ ఏకంచేసి తన కార్యభారం, రాజేశ్వరమ్మ పట్ల తన కృతజ్ఞత వెల్లడించుకుంటాడు. రామదాసు బ్రహ్మచారిగానే అసువులు వదిలేస్తాడు.

ఈ నవలలో అడుగడుగునా హృదయానికి హత్తేటట్లు కనపడేది, యిందులో వాడబడిన వ్యావహారికభాష. యీ నవలను, యింత రమ్యంగా, చదువరికి హాయిగా వుండేటట్లు ఒక్క ఈరంకి వెంకట్రావుగారే వ్రాయగలరనేది నిర్వివాదాంశం. ప్రారంభించినది మొదలు చివరవరకూ ఒక్క బిగిని యీభాష చదువరిని తీసుకువెళ్లిపోతుంది. ఈ గమనంలోనే సున్నితమైన మన స్త్రీత్వ సంబంధమైన విషయాలు హృదయానికి నాటుకుపోయేటట్టు చెప్పబడ్డాయి. అక్కడక్కడ చక్కని హాస్యంకూడా వుంది. ఈ నవల ఒక్కసారి చదివితే మరలమరల చదువ బుద్ధి పుడుతుంది. రామదాసుపాత్ర చదువరినుంచి ఎంతో సానుభూతిని పుణికి పుచ్చుకుంటుంది. రామదాసు యీ నవలలో అడుగడుగునా అసంతృప్తికి, నిరాశాభావానికి లోనవుతూవుంటాడు. అతను అనేక సార్లు తన కర్తవ్యపరిపాలనలో ఓడిపోతాడు, అతనిమనస్సే అతనికి ఎదురుతిరుగుతుంది. చివరకి రామదాసు సరోజలో కలిగించలేనిమార్పు శేషగిరిని వివాహమాడిన తర్వాత పరిస్థితులే ఆమెలో కలిగిస్తాయి. రామదాసు ఓడిపోయినరంగంలోనే గెలుస్తాడు. అతని స్వార్థంకు సంబంధించినంత మట్టుకు అతను గెలుస్తూన్న రంగంలోనే అతను ఓడిపోతాడు. చివరికి ఏది యేమైనా అతడు తన ఆశయాన్ని నెరవేర్చుకుంటాడు. ఈ సంఘటనలచిత్రణ యీ నవలలో చాలా గొప్పగా పాత్రలను పాఠకుడికి పరిచయం చెయ్యడం, రంగంలో ప్రవేశపెట్టడం కూడా యీ నవలలో ఒకప్రత్యేకత.

స్వతంత్రంగా గాని, అనువదించి గాని 1950 సంవత్సరంలో వచ్చిన అన్ని నవలకంటె 'అప్పగింత' అన్నివిధాల గొప్ప రచన. తెలుగుభాషలో తప్పకుండా ఉండవలసిన నవల. 'అప్పగింత' చదివినప్రతి పాఠకుడూ యిదే అభిప్రాయానికి వస్తాడని నావిశ్వాసం. ఇది సినీమాగాతీస్తే గొప్పసాంఘిక చిత్రంఅవడానికి సందేహం లేదు.

"వేణీసంహారము"

అనువాదకుడు: శ్రీ బులుసు వేంకటేశ్వరులు బి. ఏ., రామారావుపేట, కాకినాడ. వెల: రు 3.

"తుఫాన్"

(10 ప్రణయ కథలు) రచయిత, శ్రీ చేబియ్యం శ్రీ రామమూర్తి ఎం. ఏ., ప్రకాశకులు: అజంతా ప్రచురణాలయం: ఫోర్ట్ గేట్, రాజమండ్రి వెల: 12 అణాలు.

గ్రంథస్వీకారం

బారిస్టరు పార్వతీశం - ప్రథమభాగం. తృతీయ ముద్రణం - వెల: 1-4-0

మొక్కుబడి - ఇంకా ఇతర నాటికలు ప్రథమ ముద్రణం - వెల: రు 2

కర్త: శ్రీ మొక్కపాటి నరసింహశాస్త్రి అడ్మిరాలిటీ హౌసు, మద్రాసు 4.

నాకబలి - నవల - వెల: రు 2 లు.

కర్త: శ్రీ వి. డి. ప్రసాదరావు, C/o ఆంధ్రపత్రిక, మద్రాసు 1.

★ సాహిత్య సింహావలోకనం ★

రుద్రమదేవి

రచన: నోరి నరసింహశాస్త్రి

విషయ వైవిధ్యంగల నవలలు తెలుగులో ఉన్నవి అరుదు. సాంఘిక నవలల్లో ఉత్తమశ్రేణికి చెందినవి మాలపల్లి, వేయిపడగలు, నారాయణరావు, అప్పగింత మొదలైనవి వ్రేళ్ళమీద లెక్కింపదగినవే. చారిత్రకపు మూసలో కరగించి పోసి ఆంధ్రుల ప్రతిభను వేనోళ్ళ చాటేవి 'హిమబిందు', 'నారాయణభట్టు', రుద్రమదేవి మొదలైన కొద్ది నవలలు మాత్రమే అనడం అతిశయోక్తి కాదేమో.

నరసింహశాస్త్రిగారు నవల రచనాశిల్పంలో సిద్ధహస్తులు. ముఖ్యంగా రుద్రమదేవి, ప్రతి ఆంధ్రుడు చదివి, ఆనందించి గర్వించదగిన ఉత్తమనవల.

నవలలో కాకతీయుల శౌర్య వైభవాలు కళ్లకు కట్టినట్లు రచయిత చిత్రించారు.

భావాన్ని మించిన భాష, భాషను మించిన భావం, భాషను పొదిగే శైలి, రసవత్తర ఘట్టాలు పాఠకులను మైమఱపించి కవియత్నాన్ని సార్థకం చేశాయి.

కవి బ్రహ్మ భారతరచనకు చేసిన తపస్సు, పట్టినదీక్ష, పలికిన పలుకులు, అక్షర రూపంలో రూపొందిన విధానం శాస్త్రిగారి ప్రతిభకు మచ్చుతునకలు.

కాకతీయుల కాలంలో గణికలు కేవలం కేళీ విలాసాల్లోనేగాక, కళా ప్రాగల్భ్యంలోను, కవితాగరిమలోకూడా అందె వేసిన చేతులుగా మన ముందు నిలిచేటట్లు రచయిత చూపారు.

రుద్రమదేవి యొక వినూత్నసృష్టి. నవలా రచయితల్లో శాస్త్రిగారొక యపూర్వస్రష్ట; ఒక్క ముక్కలో యీ నవలలోని సొగసులు అనుభవైకవేద్యమని చెప్పి ముగిస్తాను.

ఇటు
సి. వి. కృష్ణారావు.
విజయవాడ.

తండ్రులు-కొడుకులు

కథల సంపుటి. రచయిత: శ్రీ గోపీచంద్. "బీదవాళ్ళంతా ఒకటి" వగైరా ఈ సంపుటిలోని ఇతర కథలు. వీటన్నిటిలోనూ తండ్రులు - కొడుకులు బాగుంది. కథా నిర్మాణంలో మంచి శిల్పం ఉంది. ఒకే వ్యక్తిని వివిధ రూపాల్లో చూస్తుంది లోకం. ఎవరికి వాళ్లు తాను చూచేదే ఋజుమార్గంగా తలుస్తారు. నిజానిజాలను విడదీసి విపులంగా చెప్పగల విజ్ఞాని ఉంటే లోకం ఒకప్పుడు కాకున్నా ఇంకొకప్పుడైనా తెలుసుకుంటుంది. విజ్ఞానియైన రచయిత చేయగలిగేది అదే! ఈ కథలోని తండ్రి స్థితిని చూచి ప్రథమంలో జాలిపడతాం. కొడుకులో క్రూరత్వం చూస్తాం. ఘాతకుడు! అనుకుంటాం. సావధానంగా విషయాలు తెలుసుకున్న తరువాత తండ్రిలోని అవకతవకలు, కొడుకుయొక్క ఉదాత్తత బయటపడుతుంది. సావధానమైన ఆలోచనలు లేని లోకపు తప్పటడుగుల నడకల నీడల ప్రతిబింబన ఈ కథలో స్పష్టంచేయబడింది.

ఈ సంపుటిలోని కథలన్నీ కూడ తెలుగు కథాసాహిత్యంలో ఉచ్చస్థితి నందుకోగల్గినవై.

చదువు

పెద్దకథ. రచయిత, శ్రీ కొడవటిగంటి. వీరి కథలు సహజంగా వాస్తవికత కళ్ళకు కట్టినట్లుగా ఉంటై. కథలోని వ్యక్తులు నిండుగా, ఒకో తత్వానికో పాత్ర నిదర్శనంగా భావంకు తగిన భాషలో మాట్లాడుతుంటారు. పిల్లల మానసిక తత్వాన్ని ఇంత సన్నిహితంగా, ఇంత సహజంగా, ఇంత నిర్దుష్టంగా చిత్రించిన రచనని తెలుగు సాహిత్యంలో చూచి ఉండలేదు. బడిలో పిల్లలు చేరుతారు. బీదా బిక్కి అన్ని తరగతులవాళ్లు ఉంటారు వాళ్ళలో. అందులో కుమ్మరాళ్ల కుర్రాడు జేబులో గుప్పెడు మిరపకాయలు తీసుకొస్తాడు. బలపాల సంపాదన ఆశతో పందానికి దిగుతాడు. "ఎవరైనా బలపం ముక్క ఇస్తే పచ్చిమిరపకాయలు తింటా" నంటాడు. పందెం ప్రారంభిస్తాడు. దయాభిమానాల వాతావరణంలో పెరిగిన ఇంకో కుర్రాడది చూచి "వద్దు, వద్దు తినకు. కావలిస్తే నా బలపం ఊరికే తీసుకో" అంటాడు. ఈ కుర్రాడే ఇంకోడి ముఖాన కనుబొమ్మల మధ్య మచ్చ ఉంటం చూచి "అదేమిటి" అని అడుగుతాడు. "చిన్నప్పుడు కాల్చా" రని నిర్లక్ష్యంగా జవాబు. అల్లరి చేశావా అని ఆదుర్దాతో అడుగుతాడు. దానికి జవాబుగా "ఓరి వెర్రి మొగమూ, అల్లరిచేయట మేమిటి. చిన్నబిడ్డ గుణం వస్తే కాలుస్తారు. కాల్చకపోతే అప్పుడే హరహరా అయిపొయ్యేవాణ్ణి" చిన్నబిడ్డగుణం అతని కర్థకాలేదు. "అది కొంతమంది కొస్తుంది... ఇదిగో చూచుకో" అంటూ పొట్టమీది వాతలు చూపిస్తాడు. "ఒకసారా, నాకు నాలుగుసార్లు నాసామి రంగా, నాలుగుసార్లు. చచ్చేవాణ్ణే వాత వెయ్యకపోతే". "ఈ పొట్టమీది వాతలు సూది కాల్చి వేశారు. మొహాన చుట్ట కాల్చి వేశారు." ఇలాంటి సంభాషణలతో కథ అంతా బిట్టలు మెప్పెన సహజసౌందర్యంతో తొణికొడుతుంది. మరల మరల ఆ సంభాషణల్ని వినాలనిపిస్తుంటుంది.

ఆర్థిక అడ్డంకులవలననో మరే కారణం చేతనో రసహీనంగా తీసుకొనిరాబడుతున్న ఇతర తెలుగుపత్రికా సాహిత్యపులోటును కొంతవరకు కప్పిపుచ్చుతూ 'చదువు' లాంటి ఉత్తమకథల్ని ఇవ్వగల్గుతున్నందుకు ఆంధ్రజ్యోతికి సంతసం వెలిబుచ్చవలసి ఉంది.

"జీవితాదర్శం"

రచయిత, శ్రీ చలం. వీరి రచనలు సాంఘిక వాతావరణం, తెలుగు సాహిత్యంలోనే ఒక విప్లవాన్ని లేపినయి. ప్రతి పాఠకుని హృదయంలోనూ సంఘర్షణ కలుగజేసినై. రచనలోని తీవ్రమైన శక్తి, మార్దవం, రసికత్వం, సనాతుణ్ణి, సోమరుని సహితం చేదుమాత్రల్లాగ మింగించగలిగినై వీరి రచనలు. పాఠకలోకం, అర్థం చేసుకునో, అలవాటు పడో 1950 కి మాత్రం "జీవితాదర్శం" శాంతంగా చదువుకొనిఉంటుంది. జీవితాదర్శం పెద్దకథ అనుకోవచ్చు. ఉదాత్తమైన ప్రేమ దీనికి భూమిక. "జీవితాదర్శం, శాంతి. ఆ శాంతిని భగ్నంచేసేయే సుఖమూ, ఏ గొప్పతనం, ఏ శృంగారం ......జీవితానికి చాల విరోధం. అంటే శాంతిని భగ్నంచేసేది సుఖమూ కాదు, గొప్పతనం కాదు, శృంగారం కాదు." శాంతి లేని ప్రేమ వట్టిది. ఆదర్శజీవి ప్రేమ శాంతియుతం. ఎలాంటి దుర్ఘటనకూడ తేలికగా దాటగలిగి జీవితాన్ని మథించి శాంతియుతంగా జీవింజగల కౌశలం కలిగిఉంటం గొప్పతనం అంటారు చలం.

"మహాప్రస్థానం"

గేయ సంపుటి. కవి, శ్రీ శ్రీ. చలం యోగ్యతాపత్రం చదివిం తరవాత 'మహాప్రస్థానం' ఎందుకు ఉత్తమం అని అంటున్నానో రాసేందుకు కలం సాగకుండా ఉంది. క్రొత్తగా పరిచయం జరిగిన రచయితల రచనల్లో 'అశ్రుమాల' బాగుంది. రచరచయిత, శ్రీ నారప రెడ్డి. ప్రద్యాలు, గేయాలు రెండూ మిశ్రితమైయుందీ కావ్యం. గేయాలకంటె పద్యాలు బాగున్నై. ఉన్నతమైన ఆశయంతో, పరిసరాల ప్రేరేపణతో, ఉద్వేగంతో వ్రాయబడింది. కవి తన ఆశయాన్ని ఈ విధంగ చెప్పుకున్నారు.

"ఆకటి చిచ్చుతో అడరి
యార్చెడు లోకపు దీనరావముల్
సోకని మేడలన్ ప్రణయ
లోలిత మత్తిలు గొప్పవారితో
నాకు పనేమి నావలె
దినంబులు బాధల వెళ్లబుచ్చు యీ
లోకపు దీన మానవుల
లోగొను కష్టపు గాథ వ్రాసెదన్."

అని పరిసరాల్ని అద్దంలాగా ప్రతిబింబింపజేయగల హృదయాన్ని కలిగిఉండటం కవికి ఒక ప్రత్యేకత. దాచేస్తే దాగని సత్యాన్ని బాహాటంచేయటం కవి లక్షణం. శ్రీ నారప రెడ్డి కవి హృదయం బాధాపూరిత జనావళి-దుఃఖమూర్తి-దీనారావముల వినగలిగి ఎంతో జాలిగా అనునయ వాక్యాల్ని పలుకుతుంది.

"............
గాలిగర్భాన నేడ్పులు గరిగిపోవ
విల దుఃఖించుచుంటి వీ వెతరు తల్లి"

సులభమైన శైలి, నాటి ప్రశ్న వేదాంతి, కవి వేమన్నను గుర్తు తెస్తారు చదువుతుంటే,

"............
దేవళాలు తెరిచి దేవుణ్ణి జూపింత్రు
దేవు డేమి సేయు దెలుపుడయ్య"

హృదయాంతరాళముల నంటగల భావన, భాషాపటిమ, యథార్థత కలిగిఉన్న కవిత్వానికి రాణింపు కలుగుతుంది.

"మోసపు పాఠశాలయయి
ముందుకు సాగడు లోకనీతి క
భ్యాసము జెందలేని హృద
యంబును సంఘపు బాకు పోటులన్
జేసిన గాయ మట్లు మెరసెన్
రవి పశ్చిమమందు లోకపుం
దోసము లట్లు చీకటులు
దోర్లెన్ సర్వము ముంచివేయగన్"

శ్రీ నారప రెడ్డి కవిత్వం రాణించిందనే చెప్పుకోవచ్చు.

మొత్తంమీద 1950 సంవత్సరంలో తెలుగు సాహిత్యంతన మందగమనాన్నే సాధించిందని చెప్పవలె.

—ఉమేప్రావ్.

* * *

"రేషనింగు కథలు"

—రచన: జ్యోతికుమారి.

ఈ కథాసంపుటిలో పదమూడు కథలున్నాయి. రేషనుకార్డు యివ్వటం ఆలశ్యంచేశిన గుమాస్తా ఉద్యోగం పోతుంది మొట్టమొదటి కథలో. స్వంతానికి కిరసనాయిల్ డబ్బా దగ్గర వుంచుకొన్నందుకు అతనుమీద కేసు పెడతాడు యిన్స్పెక్టరు. అతను భాగ్యవంతుడై కౌన్సిల్ పదవికి రాగానే ఆ యిన్స్పెక్టరే పంచదారబస్తాలు నిలువచేసిన నేరంనించి అతన్ని కాపాడేందుకు శ్రమ పడుతాడు.

"రేషనింగు ముఠా" అనే కథ చక్కగా వుంది. యీపుస్తకంలో ప్రభుత్వోద్యోగులు అమాయిక ప్రజానీకాన్ని పెట్టే కష్ట, నిష్ఠూరాలు బాగా నిరూపించాడు రచయిత. మొత్తంమీద యీ కథలన్నీ మధ్యతరగతి కుటుంబీకునికి కష్టాలు తెల్పుతాయి.

కె. సదాశివరావు.
కర్నూలు.



అంతరం

(౯-వ పేజీ తరువాయి)

దగ్గరకి తీసుకొని ఆడించింది. మంగమ్మ ఒక్కర్తీ సుగుణ ఈడుదిగాబట్టి యిద్దరికీ బాగా జత కుదిరింది. పుల్లమ్మత్త, గైర మొన్మదిగా అత్తతో లోకాభిరామాయణం మొదలుపెట్టారు.

సాయంకాలం కాగానే ఎవరిళ్లకి వాళ్లు వెళ్లిపోయారు. సుగుణ జున్నుపాలు తీసి పంచదార కలిపి జున్ను చేసింది. చేసింది భర్తకి కాస్త తీసి వేరేగావుంచి వాకిలి వూడ్చుకొంటున్న పుల్లమ్మత్తకి కాస్త రుచి చూపించింది. భలేబాగా వొండుతావు కోడలా నువ్వు అని ఒకటే పొగడ్డం!

రాత్రికి భర్త, జగన్నాధం వచ్చిం తర్వాత, సుగుణ ఆ గ్రామస్త్రీల గురించి ఒకటే మెచ్చుకొని చెప్పింది. పల్లె ప్రజల మధ్య నివశించడం సుగుణకి కొత్తగాని, జగన్నాధానికి మాత్రం ఏమీ కొత్తకాదు. ఆమె చెప్పిన మాటలు చిరునవ్వు నవ్వుకుంటూ విని, భోజనాలయిన తర్వాత కుక్క, 'రాము'ని తీసుకొని కిళ్లీకోసం బయలుదేరాడు.

కిళ్లీ కొట్టు చేరువలోనేవుంది. కొట్టు లోపల చిన్న కిరసనాయిలు బుడ్డి వెలుగుతోంది. బయటవున్న బెంచీ బల్లమీద రావన్న మావ, జగ్గయ్యన్న, సోవప్ప నాయుడు, వీర్రెడ్డి, పోలయ్యబావకూచొని కులాసాకబుర్లు చెప్పుకొంటున్నారు.

జగన్నాధం కుక్కని తీసుకొని కొట్టు దగ్గిరికొచ్చి మిఠాయి కిళ్లీ ఒకటిమ్మన్నాడు. కొట్టు అబ్బి కాసేపు ఆ కొత్త ముఖాన్ని పరికింపుగా చూసి, తర్వాత ఆకులు తీశాడు కిళ్లీకట్టడానికని. పోలయ్యబావ నోట్లోంచి చుట్టతీసి తుపుక్కన పక్కకివూసి, నిలబడి జగన్నాధం దగ్గరకి వచ్చాడు.

"మీరే కదండీ ఇయ్యాదికి కొత్తగా వచ్చారు?" అని అడిగాడు.

"అవునండి" అని తిరిగి జగన్నాధం సమాధానమిచ్చాడు.

"ఇంతక ముందెక్కడుండేవోళ్లండీ?" అంటూ వీర్రెడ్డి దగ్గిరికొచ్చాడు.

"రాజమండ్రిలో"

రావన్న మావ లేచి, పనిగు[illegible], సోమప్పనాయుడు పిల్లల గురించి అ[illegible]రు జగన్నాధం అన్నిటికీ నవ్వుకుంటూ సమాధానం చెప్పాడు. పోలయ్య బావ, "అరె మీరిట్టా నిలబడే వున్నారు, కూకొని మాటాడండి" అని తన స్థలంలోకి ఆహ్వానించాడు. ఆ ఒక్క పావుగంటలోనే జగన్నాధం వాళ్లల్లో పూర్తిగా కలిసిపోయాడు. తను ఆ గ్రామంలో ఎంతో కాలంనుంచి కాపురమున్నంత కలవడిగా, సన్నిహితముగా మాటాడాడు.

జగన్నాధం కుక్కని చూసి మళ్లా వీధి కుక్కలు పోగయి అరవడం మొదలు పెట్టాయి. జగన్నాధం కుక్కగూడ ప్రతి సవాల్ చేస్తున్నట్టు రెండుమూడు మాట్లు 'బంయ్' మంది. జగన్నాధం 'ఏయ్, రామూ' అని మందలించగానే యిక అరవకండా, అరుస్తున్న ఊరకుక్కల కేసి చురచుర చూస్తోంది.

కిళ్లీ కొట్టు సూరయ్య మిఠాయికిళ్లీ బాగా సావాఁ నేసి కట్టిచ్చాడు. జగన్నాధం కిళ్లీ అందుకోవాలని లేస్తుండగా వీర్రెడ్డి లేచి, అది అందుకొని అతనికిచ్చాడు. కిళ్లీ అందుకొని జగన్నాధం డబ్బులివ్వబోతే సూరయ్య "ఎందుకు లెండి" అంటూ ఆడబ్బుల్ని తీసుకోలేదు.

"మంచిజాతి కుక్కండి. ఎక్కణ్ణించి తెచ్చారు?" అంటూ రావన్నమావ 'రాము'ని విజలేస్తూ చిటికలేశాడు. 'రాము' తోకాడించింది. కుక్కలకిగూడ 'రాము' అనే పేర్లున్నవని వినడం సోమప్పనాయుడికిదే మొదటిసారి. చిత్రంగా కుక్కకేసి చూస్తున్నాడు. కాసేపు ఏవేవోమాటాడుకొన్న తర్వాత జగన్నాధం అందరికీ నవ్వుకొంటూ నమస్కారాలుచేసి వెళ్ళిపోడానికి నుంచున్నాడు.

"ఎంతపని ఎంతపని చేశారు! మీలాంటి పెద్దింటోళ్లు మాలాటోళ్లకి చెయ్యెత్తి దణ్ణం పెట్టడం...?" అంటూ గబుక్కున జగ్గయ్యన్న, పోలయ్యబావ, వీర్రెడ్డి నిలబడి వారించారు.

"ఫర్వాలేదండి. పెద్దలకి నమస్కారం చేస్తే ఆయుష్షు వృద్ధవుతుందంటారు..." అని నవ్వుకొంటూ జగన్నాధం 'రాము' ని తీసుకొని బయలుదేరాడు. వీధికుక్కలన్నీ అరచుకొంటూ 'రాము' వెనకాలే బయలుదేరాయి. 'రాము' రాజఠీవితో ఆ ఊరకుక్కల మొరుగుల్ని నెక్ఖచేయకండా యజమాని వెనకాల విలాసంగా నడచింది.

"ఛెఛెయ్" అంటూ కుక్కల్ని తిట్టి, నాలుగు బెడ్డల్ని సోవప్పనాయడు ఊరకుక్కలకి విసిరాడు. ఒక కుక్కకి ఒక బెడ్డ తగిలి 'కుంయ్' మన్నా మిగతా కుక్కలు మాత్రం మొరగడం మాన్లేదు.

"కుఱ్ఱోడయితే పోయాడుగాని, మంచి యినయం, బుద్ధి, గ్యానం వుందోయ్ అతగాడిదగ్గర. మంచి కలుపుగోరుమనిషే. రేపటికి మంతో కల్సిపోతాడు పూర్తిగా" అంటూ జగ్గయ్యన్న జగన్నాధాన్ని పొగిడాడు.

"ఎలాగయినా చదువుకొన్నావోళ్లు తరహాయేవేరు. అసలలా ఎలిపోయేప్పుడు దణ్ణం మనకిపెడతాడని అనుకొన్నావాఁ? అదంతా చిన్నప్పణ్ణించి అబ్బిన మంచిబుద్ధులు. మనూరు పిల్లలూ వున్నారు, ఎందుకు పెంకిడిప్పకాయల్లా!... తే అగ్గిటుదే..." అంటూ వీరెడ్డి జగ్గయ్యన్నదగ్గ చుట్టతీసి, తన చుట్టవెలిగించుకొన్నాడు.

నెలరోజుల్లో జగన్నాధం ఆగ్రామీణుల్లో పూర్తిగా కలసిపోయాడు. సుగుణ గూడ అలానే సరదాఅయిన మనిషి గాబట్టి పుల్లమ్మత్తలాంటి ముత్తైదువలదగ్గర్నుంచి పార్వతిలాంటి పిల్లలవరకూ పూర్తిగావాళ్ళల్లో కలసిపోయింది. పుల్లమ్మత్త అప్పుడప్పుడు ఊరగాయపచ్చడి, ఉల్లిపాయ పులుసు లాంటి వంటకాలు తెచ్చి రుచిమాపిస్తోంటే మంగమ్మప్ప వూరికే అప్పుడప్పుడు. పాలు, పెరుగు, నెయ్యి కొంచం కొంచం తీసుకవచ్చేది. గైరమొన్మదిన ఏమీఁ యివ్వలేని ఓబు[illegible] గాబట్టి అప్పుడప్పుడు లవకుశల పదం పాడుతూ అత్తస్నేహాన్ని బాగా చూరగొంది. ఇంకా ఆ వీధి ఆడవాళ్లందరు సుగుణ స్నేహంకోసం, ఆమెతో మాటాడ్డం కోసం తహతహలాడిపోయేవారు.

ఇక జగన్నాధం ఏవీధిలోంచివెళ్లినా ఈశిగాడి దగ్గర్నుంచి, రావన్నమావ వరకూ దణ్ణాలుపెట్టడం, కుశలప్రశ్నలడగడం. అప్పుడప్పుడు. పోలయ్యబావ జగన్నాథంతో ఆసికాలాడుతూ గేదిమార్కు సిగరెట్టు కాల్చమని యిచ్చేవాడు. అప్పుడే కొంతమంది జగన్నాధాన్ని వరసగూడ కలుపుకొన్నారు. చదువుకొన్నవాడు గాబట్టి గ్రామీణులు ఏ నోటురాయించవాలన్నా, ఏ వుత్తరంముక్క చదివించుకోవాలన్నా, సలహాలు కావాలన్నా జగన్నాధం చుట్టూ చేరేవారు. కొంతమందయితే జగన్నాధం హాస్యపుమాటలు వినాలని సూరయ్య దుకాణందగ్గర రాత్రిఎనిమిదినించే పోగయేవారు. అతను రాగానే, అతన్ని అందరిమధ్యా కూచోబెట్టుకొనేవారు.

ఇక జగన్నాధం జాతికుక్క 'రాము'ని చూస్తే ఆ గ్రామంలో ఒక్క కుక్కకిగూడ పట్టంలేదు. 'రాము' వీధిలో కొస్తేచాలు అనికుక్కలు ఒక్కసారిగా 'బంయ్' మనడం; 'రాము' వాట్లని లెక్ఖచేయకండా ముందుకుసాగిపోతే, చాలక అవీ వెనక పడేవి. 'రాము' వెనక్కి తిరిగిందా, మళ్లా ఒక్కదానికీ ఎదురుగానిలబడి అరవటానికి గుండెలు లేవు. కొన్ని తెగించి మీదకురి

కివా 'రాము' కోరలు చూడగానే పలాయనం చిత్తగించేవి. 'రాము' పడుకొని వున్నా అవి మొరగడం మానేవి కాదు. వాట్లకసలు బుద్ధనేదే లేదు. కొత్తగా ఆ ప్రదేశానికి తమలాంటి జతువే ఒకటి వస్తే దాన్ని ఆదరంగా ఆదరించాలనే జ్ఞానం వాట్లకి కొస్తన్నా లేదు. వచ్చీరాగానే కోరలు చూపించి యుద్ధాలకి సవాల్ చేస్తాయి. ఆ కొత్తకుక్క ఎంత తప్పుకతిరిగినా, దాన్ని అసలు అవి వొదలనే వొదలవు. తానివాసన తగిలేచాలు 'కంయ్, బొంయ్' మంటూ మొరుగుతాయి. పోనీ ఒక్కసారిగా దాన్ని చంపెయ్యడానికి, వాటికి ధైర్యం చాలదు.

అలానే గడుస్తున్నాయి రోజులు. ఇప్పటికి సరిగా రెండేళ్లు గడచాయి. మధ్యాహ్నంపూట సుగుణఅరుగుమీదికి ఒకరెండేళ్ల క్రితం గుమిగూడే సంతమంది యిల్లాళ్లు యిప్పుడు గుమిగూడటం లేదు. అసలు అక్కడికి రావడమే లేదు. సుగుణ బియ్యం చేటలో వేసుకొని అరుగుమీద కూర్చుంటే యింతకముందు ఆమె పిలవకపోయినా వచ్చి ముందువచ్చి తలో కాస్త బియ్యంబాగు చేసేవారు. కాని యిప్పుడామె పిలుస్తున్నా ఎవరూ వినిపించుకోవడం లేదు. ఏదో, ఎక్కడో పనుందంటూ వెళ్ళిపోయేవారు.

ఇప్పుడు వీళ్ళంతా పుల్లమ్మత్త అరుగుమీద మకాం వేశారు. అష్టాచెమ్మ ఆడుతూ ఆ వూళ్లో వూసులు ఏ యిల్లాలో ఎత్తేది; గభుక్కున గౌరమ్మొదిన సుగుణ పేరుని సూచించేది.

"చాలమ్మాచాలు; చిత్రాంగి ఎంతకయినా తగును. అత్తమెత్తం దవబట్టి ఆవెఁ ఎం–ఏది ఆట, పాడిందిపాటగా సాగిపోతోంది. మొగుడుగూడఅలాంటివాడేగాబట్టి పెళ్లాంమాట లెత్తుకొని తల్లిని నానామాటలు అంటుంటాడు. పాపం! ఆవెఁ, యింకేం చేస్తుంది, అన్ని తిట్లూ తింటూ ఆ యింట్లోనే, కోళ్లేసే అంటు మెతుకులు తింటూ వుంటోంది."

అంతలో పుల్లమ్మత్త గవ్వల్ని విసుర్తూ, గౌరమ్మొదిన చెవిదగ్గరకి వంగివూదేది; "దేవఁన్త తక్కువదా? చవఁత్తకార్తి. అలాంటి దొంగముండ కాబట్టే దానికి అలాంటి, బాగాఅణిచేసే వోళ్లు దొరికింది. మొన్న మా చంటాడుమెళ్లో గొలుసు దొంగతనం చేసేసింది. నేను సరిగ్గా ఆసఁయాని కక్కడికి ఎళ్లబట్టి దొరికిపోయింది..."

"అలాంటి దొంగముండ గాబట్టే దాని కొడుక్కింకా పిల్లలు కలగటంలేదు" అని నిట్టూర్చేది పోలమ్మ.

"అబ్బ అలా అనగానే గ్యాపకం వొచ్చింది. అది, ఏది, సుగుణతేదూ, మనరావఁగాణి గుమ్మంలోంచితొంగితొంగి చూస్తోంది. ఆడుగూడ దానికేసిచూసి నవ్వడం, యికిలించడం..." అనేది రహస్యంగా ఎర్రమ్మ.

"ఈ పాపం ఎప్పటికయినా బద్దలవకండా వుంటుందేంటి, నేను చూస్తానుగా" అనేది ఈరమ్మ పిక్కనప్పుతూ.

ఈ సమావేశంలో వాళ్లికి ప్రతీదీ విచిత్రంగానే అగుపించేది. ఆ యిచిత్రాన్ని, యిద్దూరంగా చెప్పుకొనేవారు. వాళ్లి కుక్కకి 'రాము' అనే పేరు పెట్టుకొన్నారట "చానమ్మాచాన. ఎక్కడా దేవుఁడి పేరు కుక్కలకి పెట్టుకోటం నేను చూళ్లేదు" అనే ఆశ్చర్యం! సుగుణకి పిల్లలు లేరట, ఇక ఆమెనుగురించి ఒకటేచర్చ.

ఈ సంగతులన్నీ సుగుణకి మొదట్లో చూచాయిగా తెలిశాయి గాని, వాట్లని ఆమె నమ్మలేదు. కాని ఒకనాటి వెన్నెల రాత్రి వెనకింట్లో పుల్లమ్మత్త బొకబొకలు వినిపించగానే సుగుణచెవిని అలా సారించింది. ఆ మాటలని విని అలా నీరయిపోయింది. ఆ స్థితిలో ఆమెకళ్లనించి బొటబొట నీళ్ళు గూడ కారిపోయాయి. మంచంమీద పడి వెక్కివెక్కి ఏడ్చింది. తన తమ్ముడులా చూసుకొంటున్న రావుఁడుకి తనకీ ఏదోవున్నట్టు వూసులాడుకొంటున్నారు!

సాయంకాలమవగానే జగన్నాథం స్నానం చేసి, భోజనమయిన తర్వాత అలవాటుప్రకారం సూరయ్యకొట్టికి బయలుదేరేవాడు. సూరయ్య యింతకముందులా అతన్ని 'మీరు' అని గౌరవంగా పిలవడం మానేశాడు. 'ఏవఁయ్యా' అనే జేరంలోకి దిగాడు. ఇదిగాకండా వాడి డబ్బు ఎత్తుకపారిపోతున్నట్టు, జీతం యింకా నాలుగు రోజులకి అందుతుందనగా "ఏవఁయ్యా, జగన్నాథం! నా బాకీ ఏది?" అని నిలదీసి అడిగేవాడు.

ఇప్పుడు యింతకముందులా వీరిరెడ్డి చుట్టలివ్వడంలేదు. ఎంతో ఆప్యాయంగా, ప్రేమ కారిపోతున్నట్టు మాటాడే రావఁన్న గూడ సరిగా మాటాడ్డంలేదు. తనే ఎప్పుడయినా పలకరిస్తే, నోరుకదిపేవాడు. ఒక్క జగ్గయ్యతప్పితే మిగతావాళ్ళవరు తను కదిపితేగాని కదిలేవాళ్లు కారు!

ఒకనాటిరాత్రి జగన్నాథం భోంచేసిన తర్వాత మామూలుగా కిళ్లీకొట్టుదగ్గరకివచ్చి సూరయ్యని ఒక కిళ్లీ యిమ్మన్నాడు. సూరయ్యసలు అతనిమాటలు వినుపించుకోనట్టే ఏవోపద్దులు రాసుకొంటున్నాడు. జగన్నాథం కాసేపయిన తర్వాత మళ్లీ అడిగాడు. సూరయ్య కసిరినట్టు మాటాడాడు:

"ఇక నే నివ్వలేనయ్యా. ఇప్పటికే ఆ రూపాయల పద్దు పెరిగిపోయింది. క్రితం నెల యిస్తా నిస్తానని ఎగనామం పెట్టావ్. ఇప్పుడుగూడ అలానే చేస్తావ్. నే నసలు ఒక దమ్మిడీ అరువియ్యనిక. ఆ బాకీ అంతా పైసలా చేసుకొంటే తర్వాత చూడొచ్చు" అన్నాడు దూకుడుగా.

జగన్నాథం ముఖం మాడిపోయింది. క్రితం నెల సూరయ్య బాకీ యిచ్చేయవలసిందే కాని తల్లికి జబ్బు చేయడంవల్ల ఆ కాస్త డబ్బు మందులకీ మాకులకీ అయిపోయింది...సరె యిక నేం చేస్తాడు, మాటాడకండా వెనక్కి తిరిగిపోయాడు.

నాలుగడుగులు ముందు కేసేసరికి ఈరిగాడి మాటలు వినిపించాయి: "చానా పెద్దమనిషనుకొన్నాం గాని ఆ ఈదిలో ఆడంగులందరికీ కన్ను కొట్టడవేఁ"

కన్ను కొట్టడవేఁ కాదు, సారన్న పెళ్లాం మంగ లేదూ, దాన్నిగూడ మరిగాడు. ఈ చాటురం కన్నాళ్లు దాగుతుందేంటి? ఎప్పుడోప్పుడు పొక్కక మానుతుందా, అప్పుడు ఎదవ పక్కటెముకలు యిరక్కతప్పుతాయా?" అంటూ మీసం తిప్పాడు వీరిరెడ్డి.

జగన్నాథం అడుగులు మరింక ముందుకి సాగలేదు. వీరిరెడ్డిని అమాంతంగా పీక నొక్కేయాలన్నంత ఉద్రేకి అయిపోయాడు గాని, వెంటనే తమాయించుకొని వెనక్కి చూడకండానే కోపంగా ముందు కడుగు లేశాడు. వెనకనించి వెటకారపు నవ్వులతన్నింకా బాధించాయి......వీధి మలుపు తిరగ్గానే జగన్నాథం అడుగులు కాస్త మెల్లబడ్డాయి. ఉద్వేగంగూడ కాస్త తగ్గింది గాని ఆరాటం మాత్రం తగ్గలేదు. తను ఆ గ్రామాని కొచ్చి యిప్పటికి సరిగ్గా రెండేళ్లు కావస్తోంది గాని, ఆ వీధి ఆడవాళ్ల ముఖాలే సరిగా తెలీవు. ఇక మంగమ్మ రోజూ తనింటికి వస్తున్నా తనెప్పుడూ ఆమెని కన్నెత్తి చూడలేదు. ఒకసారి ఆమె వుత్తరం చదివేసుని వస్తే ఏదో పనుందనే వంకమీద బయటికి వెళ్లిపోయాడు. అంత సిగ్గు స్త్రీలంటె! అలాంటి తనకి, తన చెల్లెలులాంటి మంగమ్మకి సంబంధం పెట్టారు. అప్రయత్నంగా జగన్నాథం కళ్లు చెమ్మగిల్లినై.

ఇంటికి చేరుకొనేసరికి 'రాము' బయట వెన్నెల్లో ఆ వీధికుక్కలన్నిటితో కలిసి సరసాలాడుకొంటోంది. ఒకదానిమీదొకటి పడి సరదాగా కరచుకొంటున్నాయి. అక్కడి కుక్కలే పారిపోవడం, తిరిగి వెనక్కి వచ్చి పళ్లతో మెల్లగా కొరుకోవడం - ఎంత ఆనందంగా గెంతు

తున్నాయి! అనుకొంటూ జగన్నాథం 'రాము' దగ్గరగా వచ్చాడు. యజమానిని చూడగానే 'రాము' తోకాడించుకొంటూ మీద కెగబాకిపోయింది. నేలమీద కాళ్లు చాపి తన ప్రేమని వ్యక్తం చేసేట్టు సన్నగా అరచింది. దాన్ని చూసి మిగతా కుక్కలు గూడ జగన్నాథం చుట్టూ చేరాయి. చుట్టూ చేరిన కుక్కల్ని చూడగానే 'రాము' తిరిగి యజమాన్ని వొదిలి వెనక్కి పరుగెత్తింది. మిగతా కుక్కలన్నీ 'రాము'ని వెంబడించాయి. అది వాటికి ఓ 'మూగ దొంగాట'!

జగన్నాథం కుక్కల అమాయక స్నేహానికి ఒక నిట్టూర్పు విడిచి లోలోనే నవ్వుకొన్నాడు. నోరు లేకపోయింది గాని, నిజంగా అవి ధన్యులు; జంతువులయితే అయ్యాయిగాని వాట్ల కేరింతాలు నిజంగా స్వర్గసేధాలు – అనుకొంటూ ఆ కుక్కల గంతుల్లో తన మానవ హృదయాన్ని కాసేపు హాయిగా విసిచిపెట్టేశాడు.

మొదట్లో అవి ఒకదాన్ని చూసి మరొకటి కోరలు చూపించుకొన్నాయి, అరచాయి, మొరిగాయి, కొన్ని సమయాల్లో మీదపడి కరచుకొన్నాయిగూడ! కాని కాలం జరుగుతున్న కొద్దీ వాటివైరం కొత్త కొత్త చొప్పున తగ్గి, మెల్ల మెల్లగా దగ్గరకి చేరుకొన్నాయి. స్నేహితు లయ్యాయి. వాటి భాషలో మాటాడుకొన్నాయి. ఇక స్నేహమయిపోయింది గాబట్టి ఒకదాని మీద మరొకటిపడి చెలగాటాలాడాయి. ఇప్పుడవి గాఢ స్నేహితులు!...'రాము' వల్ల ఆవీధి వూరకుక్కలు గూడ మంచి జాతి పిల్లల్ని పెట్టాయి. 'రాము' యిప్పుడు గర్వంగా కొన్ని ప్రాణుల 'తండ్రి' అయింది.

ఇలా అనుకొంటూనే జగన్నాథం యింట్లోకి వెళ్ళాడు. ఇంట్లో మంగమ్మ సుగుణతో మాటాడుతోంది. సుగుణ, మొన్నరాత్రి పుల్లమ్మత్త తనమీద అన్న మాటలని మంగమ్మకి చెబుతూ కన్నీరు విడుస్తోంది. మంగమ్మ సుగుణని బుజ్జగిస్తోంది. జగన్నాథం సుగుణని చూశాడు గాని, ఆ పక్కనే మంగమ్మని చూడగానే కంగారు పుట్టి, సుగుణ కన్నీటిని గుర్తించలేకపోయాడు. జగన్నాథాన్ని చూడగానే మంగమ్మ మంచం మీంచి లేచి తనింటికి వెళ్లిపోయింది.

జగన్నాథం, మంగమ్మ వెళ్లిపోగానే మెల్లగా సుగుణదగ్గరికి వెళ్ళి మంచంమీద కూచొన్నాడు. ఏమీ మాటాడకండా తలొంచుకొని నేలని కాలుతో రాస్తున్నాడు. సుగుణ భర్తెక్కడ తన కన్నీటిని చూస్తాడో అని వెనక్కి తిరిగి కళ్లు తుడుచుకొని, అక్కణ్ణించి వెళ్లిపోబోయింది.

"సుగుణా" భర్త పిలుపుకి సుగుణ ఆగింది. "మనం తిరిగి రాజమండ్రి వెళ్ళిపోదాం?" అన్నాడు.

సుగుణ అప్పుడు తల తిప్పి భర్తకేసి చూసింది. ఆ ముఖాన్ని చూడగానే ఆశ్చర్యపోయింది. కళ లేదు. తన్ని చూడగానే కొంటెగా నవ్వే కళ్లు చల్లబడి నిరాశని వెల్లడిచేస్తున్నట్టున్నాయి. దగ్గరగా వచ్చి "ఏం?" అని అడిగింది.

అతను తలెత్తి భార్యముఖంలోకి చూసి, తన దృష్టి నలా ఆమె ముఖంలో నిలపలేక మంచంమీంచి లేచి చేతులు వెనక్కి కట్టుకొని యిటూ అటూ పచారుచేయడం మొదలు పెట్టాడు. "సుగుణ!......నామీద నీకేమయినా అనుమాన ముందా?" అన్నాడు మెల్లగా.

"ఏమిటి మీ రనేది?" గభుక్కున జగన్నాథం దగ్గరికొచ్చి రెండుచేతులు పట్టుకొని ఆపింది.

"నామీద నీకు అనుమానం లేదు?...... ఊళ్ళో ప్రతీవారు నన్ను అనుమానంగా చూస్తున్నారు."

"ఎందుకు?" గభుక్కున అనేసిందే గాని, భర్త అన్నమాటల అంతర్యాన్ని ఆమె గ్రహించకపోలేదు...అప్పుడే తన మీద లోకు లనుకొంటున్న మాటలుగూడ జ్ఞప్తికొచ్చాయి.

"ప్రతీవారూ, నాకూ మంగమ్మకీ ఏదో సంబంధ ముందన్నట్టు మాటాడుతున్నారు.. రేపటినించి మంగమ్మ నిక్కడికి రానివ్వకండా చేయలేవు?" అన్నాడు సుగుణ చేతులు పట్టుకొని బతిమాలుతున్నట్టు.

సుగుణ యిహ తన ఆరాటాన్ని దాచుకోలేకపోయింది. రేపటినించి యిక మంగమ్మని యిక్కడికి రానివ్వకండా చేయడం కాదు తను చేయవలసిన పని—రేపే బండిమీద మరో వూరు వెళ్లిపోవడం. లేకపోతే ఈ అజ్ఞానుల సూటీపోటీమాటలకి తలొగ్గవలసి వస్తుంది. ఆ అభిప్రాయాన్నే భర్తకి చెప్పింది. చివరికి తనమీద వాళ్లు మోపిన నిందని అతనికి చెప్పకండానే అక్కణ్ణించి వెళ్ళిపోయేలాగు భర్తని ఒప్పించింది.

రాత్రి సుగుణకి నిద్ర పట్టలేదు. పుల్లమ్మ, బుల్లెమ్మ, గైరమ్మ, పోలమ్మ, చివరికి చిన్నపిల్ల పార్వతి గూడ తన్ని దెప్పుతున్నట్టే భ్రమించింది. జగన్నాథంగూడ సరిగా కునుకు తియ్యలేదు. వీర్రెడ్డి తన్ని అనుమానంతో కర్ర పట్టుకొని బుర్ర బద్దలుగొట్టినట్టే కలలు కన్నాడు.

'రాము' మాత్రం ఏ చీకూ చింతా లేకండా సంతోషంగా ఆ వెన్నెల రాత్రిలో మిగతా కుక్కలతో ఆడుకొంది. కాని యజమాని మంచాన్ని మాత్రం విడిచిపెట్టేది కాదు. 'రాము' శబం చేసినప్పుడల్లా జగన్నాథం, మానవుడికీ, జంతువుకీగల అంతరాన్ని వితర్కించుకొంటూ లోలోనే నవ్వుకొన్నాడు. మానవుడికి ఆ నాలికని తిప్పి భాషని తయ్యారు చేసుకోగానే ఒక విధమయిన అజ్ఞానం, అసూయ, అనుమానం గూడ వాడిలో పుట్టాయి!

తెల్లవారిం తర్వాత జగన్నాథం బండి తీసుకొచ్చాడు. సామానంతా బండిలో కెక్కించి, సుగుణ, తల్లి బండిలోకి ఎక్కిం తర్వాత జగన్నాథంగూడ బండెక్కాడు. అంతలో జగ్గయ్యన్న వచ్చాడు.

"ఎక్కడికి బాబు ఈ ప్రయాణం?" అని ఆశ్చర్యంగా అడిగాడు.

"కుక్కలు రాజ్యం చేసే దేశానికి" అని నవ్వుతూ జగన్నాథం సమాధానమిచ్చాడు.


పక్కనించిపోతున్న ఈరిగాడు, సోవప్ప నాయుడుతో "జగ్గయ్య ఆడి దగ్గర కాకాపట్టినట్టున్నాడు. ఆడి పంచ వొదల్టం లేదు" అంటూ యికిలించాడు.

అంత సరదాగా వుండే సుగుణ వెళ్ళిపోతోందని [illegible] పెట్టుకొంది. పుల్లమ్మత్త మిగతా యిల్లాళ్ళకో యిచిత్రాన్ని చూపించి "రంకు దింకెన్నాళ్లో పట్నం మొగుడుతో కులకాలనుకొందో? ఎళ్లిపోతోంటె ఎలా పక్కీగ్గా ఏడుస్తోందో!" అంది.

"మాతల్లి మాయమైపోతోంది. పట్నం కులుకంతా రావిగాడి మీద చూపించేసింది...ఇకనించైనా ఈ ఈది కుర్రాళ్లు బాగుపడతారు" అంది నాయరాలు నారాయణమ్మ. బండి కదిలింది. రాము బండిని అనుసరించింది. కింద నడుస్తుందేగాని వెనకాలే వస్తున్న 'స్నేహితుల్ని' ఒక కంటితో చూస్తూ గెంతుతోంది. దానికి తెలీదు: తన యజని శాశ్వతంగా ఆ గ్రామాన్ని విడిచిపెట్టేస్తున్నాడని. మిగతా కుక్కలన్నీ గ్రామపొలిమేరవరకూ 'రాము' వెనకాలే సరసాలాడుకొంటూ వచ్చాయి. కాని 'రాము' యింకా అక్కడాగకండా ఎక్కడికో యింకా యింకా వెళ్ళిపోతుండడంతో యిక అక్కణ్ణించి కాలుకదపడానికి యిష్టపడక అక్కడే అలా వుండిపోయి 'కుంయ్యో' మంటూ కిందదొర్లుతు ఏడ్చాయి.

★

ఆంధ్ర దేశమంతటా విజయయాత్ర సాగిస్తున్నది.



సారథీ వారి...

అగ్నిపరీక్ష

ప్రొడ్యూసర్ కె.భాస్కరరావు
డైరెక్టర్ మాణిక్యం

రాజ్యం... రఘురామయ్య...శివరావు...
సి.యస్.ఆర్.. లక్ష్మీకాంతం.. మాలతి... నటించిరి.

విజయవాడ—	సరస్వతీ పిక్చర్ పాలెస్	చింతామణి—	డైమండ్ టాకీస్
గుంటూరు—	సరస్వతీ పిక్చర్ పాలెస్	చిక్‌మంగళూరు—	గురునాథ టాకీస్
నెల్లూరు—	వినాయక సినిమా	బళ్ళారి—	స్టార్ సినిమా
రాజమండ్రి—	శ్రీ రామా టాకీస్	అనంతపురం—	వరదా టాకీస్
కాకినాడ—	పూర్ణా థియేటర్	కడప—	లక్ష్మీ టాకీస్
విజయనగరం—	ప్రభాత్	ఏలూరు—	గోపాలకృష్ణ
మచిలీపట్నం—	సరస్వతీ పిక్చర్ పాలెస్	భీమవరం	—వెల్‌కం
బెంగుళూరు సిటీ—	మూవీలాండ్ టాకీస్		

డిస్ట్రిబ్యూటర్లు:

ఆంధ్రా : ప్రీమియర్ ఫిలిమ్సు లిమిటెడ్, విజయవాడ. నైజాం : ప్రీమియర్ పిక్చర్సు, సికింద్రాబాద్.

సీడెడ్ : సరస్వతీ టాకీస్ లిమిటెడ్, గుంతకల్. మైసూర్ : విజయలక్ష్మి & కంపెనీ, బెంగుళూర్.

వివరములకు : సారథీ ఫిలిమ్సు లిమిటెడ్, మద్రాసు 17.

Regd. No. M. **4479**

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty St. Madras.